

## అంగన్‌వాడీ హెల్పర్లకు శుభవార్త

3 లో..

నేటి ప్రభాత
సూర్య
జాతీయ తెలుగు దిన పత్రిక
TGTEL/25/A0784

ప్రచురణ : హైదరాబాద్ | ఎడిటర్ : పోలగోని రాజేశ్ | శుక్రవారం | 04 - 07- 2025 | సంపుటి : 1 | సంచిక : 32 | పేజీలు : 8 | 4/-



# భారత దేశ ఘనాఘనుడు!

**ప్రధాని మోదీకి ఘనా దేశపు అత్యున్నత పురస్కారం**

- రాబోయే ఐదేళ్లలో భారత్-ఘనాల మధ్య రెట్టింపు వాణిజ్యం
- ఘనంగా స్వాగతించిన ఘనా అధ్యక్షుడు పార్లమెంటులో ప్రసంగం
- భారతదేశంలో 2,500 కంటే ఎక్కువ రాజకీయ పార్టీలు ఉన్నట్లు ప్రకటన
- ఆశ్చర్య పోయిన పార్లమెంట్ సభ్యులు

**న్యూఢిల్లీ :**

భరాత ప్రధానికి ఘనమైన స్వాగతం, సత్కారం లభించాయి. ఘనా అత్యున్నత పురస్కారం కూడా ప్రదానం చేసింది. రాబోయే ఐదేళ్లలో భారత్- ఘనా దేశాలు వాణిజ్యాన్ని రెట్టింపు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాయని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఘనాకు భారతదేశం కేవలం భాగస్వామి మాత్రమే కాదని.. ఇరు దేశాలు కలిసి జోడీగా అభివృద్ధి పథంలో ముందుకు సాగుతున్నాయని తెలిపారు. భారత కంపెనీలు ఘనాలో దాదాపు 900 ప్రాజెక్టు లలో రెండు బిలియన్ డాలర్లు పెట్టుబడిగా పెట్టాయని మోదీ చెప్పుకొచ్చారు. ఐదు రోజుల పర్యటనలో భాగంగా పశ్చిమ ఆఫ్రికాలోని ఘనా దేశంలో ప్రధాని నరేంద్ర మోదీ పర్య టిస్తున్నారు. ఈ సందర్భంగా ఘనాలో ప్రధాని మోదీకి ఆ దేశ ప్రతినిధులు, ప్రజల నుంచి సాదర స్వాగతం లభిస్తోంది. ప్రధాని మోదీ, ఘనా అధ్యక్షుడు జాన్ ద్రామానీ మహామాతో పలు భాగస్వామ్య అంశాలపై చర్చించారు. ఇం డియా.. ఘనాతో యూపీఐ డిజిటల్ చెల్లింపుల విధానాన్ని పంచుకునేందుకు


మిగతా 2వ పేజీలో..



## కేసీఆర్‌కు సుస్తీ!

- అనారోగ్యంతో బాధపడుతున్న కెసిఆర్
- చికిత్స కోసం యశోదాలో చేరిక

2 లో..



## నగరానికి ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే

- స్వాగతం పలికిన సీఎం.. మంత్రులు
- నేటి సామాజిక న్యాయ సమరభేరిలో హాజరు

2 లో..



## అమెరికా ఆంక్షలపై అధ్యయనం

- లిండ్సే గ్రాహంతో టచ్‌లో ఉన్నాం
- వాషింగ్టన్ మీడియా సమావేశంలో జైశంకర్

2 లో..



## ఫార్ములా కేసులో ఎసిబి విచారణ

- హాజరైన అరవింద్ కుమార్

2 లో..

## ప్రపంచ పెట్టుబడి కేంద్రంగా

# హైదరాబాద్

## ఫోర్త్ సిటీ - భారత్ ఫ్యూచర్ సిటీ



- ప్రభుత్వం మారినా పారిశ్రామిక పాలసీ మార్చలేదు
- రాబోవు వందేళ్ల కోసం తెలంగాణ రైజింగ్ 2047
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- మలబార్ జెమ్స్ అండ్‌జ్యువెలరీ తయారీ యూనిట్ ప్రారంభం

(నేటి ప్రభాత సూర్య-జనరల్ బ్యూరో)

హైదరాబాద్‌ను ప్రపంచ పెట్టుబడుల కేంద్రంగా తీర్చి దిద్దడం తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఈ మేరకు రంగారెడ్డి జిల్లా మహేశ్వరం ఇండస్ట్రియల్ పార్క్‌లో మలబార్ జెమ్స్ అండ్ జ్యువెలరీ తయారీ యూనిట్‌ను సీఎం ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి శ్రీధర్ బాబు, పీసీసీ అధ్యక్షుడు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం తెలంగాణ పారిశ్రామిక విస్తరణలో మరో మైలురాయిగా నిలుస్తుందని అంటున్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వాలు మారినా మన పారిశ్రామిక పాలసీలు మార్చలేదని గుర్తు చేశారు. పెట్టుబడులకు మెరుగైన అవకాశాలు కల్పిస్తూ ముందుకు వెళుతున్నామని వివరించారు. పెట్టుబడులను ఆకర్షించడమే కాదు.. వారికి లాభాలు చేకూరేలా రాష్ట్ర ప్రభుత్వం సహకరిస్తుందని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వంపై నమ్మకం ఉంచి యూనిట్ ఏర్పాటు చేసిన మలబార్ గ్రూప్‌నకు ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు. పారిశ్రామిక రంగానికి పెట్టుబడులను ప్రోత్సహిస్తూ చేస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని తెలిపారు. రాబోయే వందేళ్ల అవసరాలను దృష్టిలో ఉంచుకుని రూపొందించిన 'తెలంగాణ రైజింగ్ 2047' అనే విజన్ డాక్యుమెంట్‌ను డిసెంబర్ 9న విడుదల చేయనున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఇది దృష్టిలో ఉన్న వ్యూహాత్మక ప్రణాళికగా పేర్కొన్నారు. తెలంగాణ భవిష్యత్ తరాల కోసం నిర్మితమవుతున్న గ్లోబల్ వేదిక అని కితాబిచ్చారు. తెలంగాణపై నమ్మ కంతో భారీ పెట్టుబడులు పెట్టిన మలబార్ గ్రూప్‌కి సీఎం ప్రత్యేక అభినందనలు తెలిపారు. "మహేశ్వ రంలో జ్యువెలరీ తయారీ యూనిట్‌ను ప్రారంభించ డమే కాకుండా, స్థానిక అభివృద్ధి, ఉపాధికి ఇది కొత్త దారి చూపుతోందని అన్నారు. ఇది తెలంగాణ రాష్ట్రంలో

మిగతా 2వ పేజీలో..

## నీటి వాటాను కాలరాసిందే

# కేసీఆర్.. హరీశ్

- ఇపుడేమో రాద్ధాంతం చేస్తున్నారు
- రేవంత్ రెడ్డి వల్లే బనకచర్లకు బ్రేక్
- పదేళ్లు బీసీలకు కేసీఆర్ చేసిందేమిటో
- లేఖ రాసింది బీఆర్ఎస్ నాయకురాలిగానా
- లేక జాగృతి నేతగానా? కవితకు సూటి ప్రశ్న
- బీజేపీ చీఫ్ పదవికి బీసీలు దొరకలేదా
- పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్
- ఎమ్మెల్యే అనిరుధ్‌పై సీరియస్ అయిన పీసీసీ చీఫ్

(నేటి ప్రభాత సూర్య-పొలిటికల్ బ్యూరో)

బనకచర్ల ప్రాజెక్టుల విషయంలో తెలంగాణలోని అధికార, విపక్ష పార్టీల మధ్య ఇంకా మాటల తూటాలు పేలుతున్నాయి. ఈ ప్రాజెక్టు విషయంలో కేసీఆర్ వ్యాఖ్యలకు రేవంత్ రెడ్డి కౌంటర్ ఇవ్వగా బుధవారం నాడు బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు రీకౌంటార్ ఇచ్చారు. హరీశ్ రావు చేసిన రీకౌంటర్‌కు తెలంగాణ పీసీసీ ఛీఫ్ మహేష్ కుమార్‌గౌడ్ తాజా మరో రీకౌంటర్ ఇచ్చారు. తెలంగాణకు నీటి వాటాను కాలరాసిందే మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీష్‌రావులు అని మహేశ్ కుమార్ గౌడ్ మండిపడ్డారు. సీఎం రేవంత్ రెడ్డి సంకల్పం వల్లే నేడు బనకచర్ల ప్రాజెక్ట్ పనులకు బ్రేక్ పడిందని ఆయన గుర్తుచేశారు. కేసీఆర్ తెలంగాణ



నీటి వాటాను ఏపీకి దారాదత్తం చేశారని ధ్వజమెత్తారు. ఒక్క నీటి బొట్టు కూడా వదలబోమని సీఎం రేవంత్‌రెడ్డి అనుకున్నారని.. కాబట్టే బనకచర్ల పనులు ఆగిపోయాయని చెప్పుకొచ్చారు. గురువారంనాడు గాంధీ భవన్‌లో మహేష్‌గౌడ్ మీడియాతో మాట్లాడుతూ బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకి కూడా గట్టి కౌంటర్ ఇచ్చారు. తెలంగాణ రాష్ట్రంలో బీసీ బిల్లు చేసేటప్పుడు కవిత జైల్లో ఊచలు లెక్కపెడుతోందని విమర్శించారు. కవిత లేఖ రాసింది బీఆర్ఎస్ నాయకురాలిగానా జాగృతి నాయకురాలిగానా అని మహేష్ గౌడ్ ప్రశ్నల వర్షం కురిపించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ

మిగతా 2వ పేజీలో..

# రైళ్లు ఆపుదాం.. ఢిల్లీకి పోదాం!

- ప్రధాని మోడీతో అఖిలపక్షం కోసం బిజెపి రావాలి
- రిజర్వేషన్ల కోసం కాంగ్రెస్ బిసి నేతలు ఒత్తిడి తేవాలి
- 17న రైల్ రోకోకు అన్ని పార్టీలు ముందుకు రావాలి
- మీడియా సమావేశంలో బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత డిమాండ్

హైదరాబాద్- నేటి ప్రభాత సూర్య :

బీసీ రిజర్వేషన్ల సాధన కోసం ఢిల్లీకి అఖిల పక్షంను తీసుకుని వెళ్లాలని బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత మరోమారు డిమాండ్ చేశారు. దీనిపై తేల్చకుండా స్థానిక ఎన్నికలను నిర్వహించరాదని అన్నారు. బీసీ రిజర్వేషన్లు లేకుండా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకూడదని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత అన్నారు. ప్రధాని వద్దకు అఖిలపక్షాన్ని తీసుకెళ్తానన్న సీఎం ఇంకా తీసుకెళ్లలేదని విమర్శించారు. జూలై 8లోపు రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ.. బిసి రిజర్వేషన్లు



లేకుండా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడానికి వీలు లేదని విమర్శించారు. రైల్ రోకోకు మద్దతు కోరుతూ బిఆర్ఎస్ సహా అన్ని పార్టీలకు లేఖ రాస్తామని చెప్పారు. గోదావరి- బనకచర్ల విషయంలో ప్రభుత్వం మెతక వైఖరి అవలంబిస్తోందని,ఎపి సిఎం చంద్రబాబు నాయుదును ఒక్క మాట కూడా అనలేదంలేదని పేర్కొన్నారు. కాంగ్రెస్‌లోని బీసీ నేతలు రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తీసుకురావాలన్నారు. బీసీ బిల్లు విషయంపై బీజేపీపై ఒత్తిడి తీసుకురావాలని ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేకి లేఖ రాస్తున్నామని చెప్పారు. ఈ నెల 17న బీసీ రిజర్వేషన్ బిల్లు అమలు కోసం జాగృతి ఆధ్వర్యంలో చేపట్టనున్న రైల్ రోను విజయంతం చేయాలన్నారు. రైల్ రోకోకు సంబంధించిన పోస్టర్‌ను హైదరాబాద్‌లోని తన నివాసంలో ఎమ్మెల్సీ కవిత విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైల్ రోకో కార్యక్రమానికి వివిధ పార్టీల మద్దతు కూడగట్టామన్నారు. బీసీ బిల్లుపై బీజేపీ చొరవ తీసుకోవాలని, ఈ విషయమై ఆ పార్టీ నూతన అధ్యక్షుడు రామచందర్ రావుకు లేఖ రాశామని చెప్పారు. ఆయన చొరవ తీసుకోని బీజేపీ అధ్యక్ష హోదాలో తొలి విజయం నమోదు చేసుకోవాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ది పొందేందుకే కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే హైదరాబాద్ వస్తున్నారని విమర్శించారు. బీసీలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా స్థానిక సంస్థల ఎన్నికలకు ఎలా వెళ్తారని ప్రశ్నించారు. ఖర్గే, రాహుల్ గాంధీ, సోనియాగాంధీ, ప్రియాంకగాంధీ బీసీల కోసం పార్లమెంట్‌లో ఎన్నడూ మాట్లాడలేదని మండిపడ్డారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలయ్యేలా బీజేపీపై ఖర్గే ఒత్తిడి తేవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కులగణన

మిగతా 2వ పేజీలో..

# 14 నుంచి కొత్త రేషన్ కార్డుల పంపిణీ

- మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి వెల్లడి
- తిరుమలగిరిలో సీఎంచే శ్రీకారం
- రాష్ట్ర రాజకీయాల్లో నల్లగొండ జిల్లా కీలక పాత్ర
- ప్రతీ నూతన కార్యక్రమం నల్లగొండ నుంచే మొదలు

హైదరాబాద్- నేటి ప్రభాత సూర్య :

కొత్త రేషన్ కార్డులను పంపిణీని సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమా ర్కలు ఈనెల 14న నల్లగొండ జిల్లా తుంగ తుర్తి నియోజకవర్గంలోని తిరుమలగిరిలో ప్రారంభిస్తారని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. ఈ నెల 13వ తేదీ వరకు రేషన్ కార్డుల విచారణ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఉమ్మడి



నల్లగొండ జిల్లా సమీక్షా సమావేశంలో మంత్రులు అడ్లూరి లక్ష్మణ్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎంపీలు రఘువీర్‌రెడ్డి, చామల కిరణ్‌రెడ్డి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు,కలెక్టర్లు హాజరయ్యారు. జిల్లా కేంద్రంలో 6 కోట్లతో నిర్మించిన ఆర్‌అండ్‌బీ సూపరింటెండ్ ఇంజనీర్ నూతన కార్యాలయ భవనాన్ని ప్రారంభించారు. సమీక్షా


మిగతా 2వ పేజీలో..

# అవి ఆరోపణలు మాత్రమే!

- గ్రూప్‌వన్‌లో అవకతవకలపై పిటిషన్లు
- నేటికి వాయిదా వేసిన హైకోర్టు

హైదరాబాద్- నేటి ప్రభాత సూర్య :

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్-1 పిటిషన్లపై విచారణను హైకోర్టు శుక్రవారానికి వాయిదా వేసింది. తెలుగు మీడియం అభ్యర్థులకు సరైన మార్కులు వేయలేదని పలువురు దాఖలు చేసిన పిటిషన్‌పై ఉన్నత న్యాయస్థానం విచారణ జరిపింది. ఈ సందర్భంగా టీజీపీఎస్సీ తరఫున సీనియర్ న్యాయవాది ఎస్.నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపించారు. పరీక్ష రాసిన అభ్యర్థుల సంఖ్య విషయంలో ఎలాంటి తేడా లేదన్నారు.



నామినల్ రోల్స్, అభ్య ర్థుల వేలిముద్రల ఆధారంగా పూర్తి వివరాలు వెల్లడించినట్లు చెప్పారు. కోఠిలోని ఓ కేంద్రంలో పరీక్ష రాసిన వారే ఎక్కువ మంది ఎంపికయ్యారనేది అవాస్తవం. అక్కడ ఉన్న రెండు కేంద్రాలలో 1500 మంది అభ్యర్థులు మెయిన్స్

మిగతా 2వ పేజీలో..



# పేరొక్కడిది.. రోల్ ఇంకోడిది..

- యథేచ్ఛగా నడుస్తున్న మెడికల్ షాపులు
- నిబంధనలకు విరుద్దంగా జనరిక్ మందుల విక్రయం
- నటననిద్ర ప్రదర్శిస్తున్న డ్రగ్ కంట్రోల్ అధికార్లు
- అందాల్సింది అందితే తనిఖీలు ఎందుకు...?
- తీరు మార్చుకొని డ్రగ్ ఇన్ స్పెక్టర్లు
- అధికార్ల నిర్లక్ష్యం... ప్రజలకు శాపం

(నేటి ప్రభాత సూర్య-ఇన్వేస్టింగ్ టీం రిపోర్ట్)

నాణ్యమైన వైద్యంతోపాటు నాణ్యమైన డ్రగ్స్ కూడా ప్రజలకు రోగాలనుంచి బయటపడేస్తాయి. వైద్యం ఎంత నాణ్యమైనది అయినా వాడే మందులు(డ్రగ్)లో నాణ్యత లోపముంటే ఊల్టా రోగీ ప్రాణాలతో చెలగాటమాడినట్లు అవుతుంది. హైదరాబాద్ నగర పరిసరి ప్రాంతాలలో మరీ ముఖ్యంగా ఇబ్రహీం పట్నం నియోజకవర్గంలోని తర్కయంజాల్‌తోపాటు పరిసర ప్రాంతాల్లో మెడికల్ షాపుల బాగోతం అంత ఇంతా కాదు. ఇక్కడున్న చాలా షాపులు సర్టిఫికేట్ పరంగా ఒకరి పేరుపై ఉంటే వాటి నిర్వాహణ ఇంకోకరు నిర్వహిస్తున్నారు. అంటే ఒకరి సర్టిఫికేట్ కొనుగోలు చేసి వారి పేరుతో ఇతరులు మెడికల్‌షాపు పెట్టి వ్యాపారం నిర్వహిస్తున్నారన్న మాట. ఇక రేట్ల విషయంలో ప్రత్యేకించి చెప్పనక్కర్లేదు. షాపుల వారీగా ఎవరికి తోచినంతా వారు దండుకొంటున్నట్లు విమర్శలు వస్తున్నాయి. వాస్తవానికి నాణ్యమైన వైద్యం వైద్యులు అందిస్తే నాణ్యమైన మందులు (డ్రగ్) మెడికల్ షాపులు అందించాలి. మెడికల్ షాపులు ఈ నిబంధనలు పాటిస్తున్నారా లేదా అన్నది తనిఖీలు చేయాల్సింది. డ్రగ్ ఇన్స్పెక్టర్లు. ఈ డ్రగ్ కంట్రోల్ శాఖకు చెందిన డ్రగ్ ఇన్ స్పెక్టర్ల పాత్రపై చాలా చోట్ల విమర్శలు వస్తున్నాయి. మెడికల్ షాపులు ఎవరి పేరుపై ఉన్నాయి వారు నిబంధనలను పాటించి మెడికల్ షాపులు నిర్వహిస్తున్నారా

మిగతా 2వ పేజీలో..



## బనకచర్లపై రాహుల్ మౌనమెందుకు

- బీజేపీతో కలసి తెలంగాణకు రాహుల్ గాంధీ ద్రోహం
- కేటీఆర్ ఘాటు విమర్శ

(నేటి ప్రభాత సూర్య-పొలిటికల్ బ్యూరో)

బీజేపీతో కలసి లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ తెలంగాణప్రజలకు తీరని ద్రోహం చేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. తెలంగాణకు ద్రోహం చేయడంలో బీజేపీతో రాహుల్ గాంధీ కలిసి పనిచేస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. తెలంగాణ రైతుల నోట్లో మట్టి కొట్టే బనకచర్ల ప్రాజెక్టు విషయంలో రాహుల్ మౌనంగా ఉండడం ముమ్మాటికి కుట్రే అన్నారు కేటీఆర్. గోదావరిలో తెలంగాణకు న్యాయంగా రావాల్సిన వాటాను తన గురువు చంద్రబాబుకు రేవంత్ రెడ్డి ధారాదత్తం చేస్తుంటే ఆపకుండా రాహుల్ గాంధీతో పాటు కాంగ్రెస్ అగ్రనాయకత్వం ఈ ప్రాంతానికి తీరని అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. 2014 విభజన చట్టంలోని హామీలను నెరవేర్చాలని ఏ రోజు మోదీ ప్రభుత్వాన్ని రాహుల్

మిగతా 2వ పేజీలో..

సూర్య
జాతీయ తెలుగు దిన పత్రిక
TGTEL/25/A0784
శుక్రవారం
04- 07- 2025



# నగరానికి ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే

- స్వాగతం పలికిన సీఎం..మంత్రులు
- నేటి సామాజిక న్యాయ సమరభేరిలో హాజరు

(నేటి ప్రభాత సూర్య-పొలిటికల్ బ్యూరో)

ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే హైదరాబాద్ నగరానికి చేరుకొన్నారు. తెలంగాణ రాష్ట్ర పర్యటనలో భాగంగా ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే గురువారం సాయంత్రం హైదరాబాద్ చేరుకున్నారు. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో దిగిన ఆయనకు సీఎం రేవంత్ రెడ్డితోపాటు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు స్వాగతం పలికారు. అనంతరం నగరంలోని తాజ్ కృష్ణ హోటల్‌కు ఖర్గే చేరుకున్నారు. జులై 4వ తేదీన నగరంలోని ఎల్బీ స్టేడియంలో పార్టీ కార్యకర్తలతో భారీ సభ జరగనుంది. ఈ సభకు మల్లికార్జున ఖర్గే ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఆ సందర్భంగా పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు క్యాడర్‌కు ఆయన దిశానిర్దేశం చేయనున్నారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి భారీగా కేడర్‌ను ఈ సభకు తరలించేందుకు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశారు. మరోవైపు శుక్రవారం జరగనున్న ఈ సభకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది.

# డమ్మీననోళ్లకు డాడీ అవుతా

- నాకంటే ఫైర్ బ్రాండ్ ఎవరూ లేరు
- నేనేంటో త్వరలోనే చూపిస్తా
- రాజాసింగ్ వ్యవహారం ఢిల్లీ చూసుకొంటుంది
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు

(నేటి ప్రభాత సూర్య-పొలిటికల్ బ్యూరో)



డమ్మీ డమ్మీ అంటూ తనను ఉద్దేశించి వస్తున్న వ్యాఖ్యలపై బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు తీవ్రంగా స్పందించారు. నన్ను డమ్మీ అన్నవాళ్లకు డాడీ అవుతాననంటూ హెచ్చరించారు. రాష్ట్ర అధ్యక్ష పదవి అనేది కిరీటం కాదని అదొక బాధ్యత అంటూ పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల మీద దృష్టి సారించామని. వీలైనన్నీ ఎక్కువ స్థానాలను కైవసం చేసుకోవడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. రాజాసింగ్ అంశాన్ని జాతీయ అధినాయకత్వమే చూసుకుంటుందని రాంచందర్ రావు తెలిపారు. తాను డమ్మీ లీడర్‌నా కాదా అనేది త్వరలో చూపిస్తానని ఆయన స్పష్టంచేశారు. తన పొలిటికల్ లైఫ్‌లో ఇప్పటివరకు 14 సార్లు జైలుకు వెళ్లి వచ్చానని.. లాఠీ దెబ్బలు తిన్నానని.. మావోయిస్టులతో పోరాటం చేశానని ఆయన గుర్తు చేశారు. అందరినీ కలుపుకుపోవాలనే ఉద్దేశంతో కూల్‌గా ఉంటున్నానని.. తన ఉగ్రరూపం చూస్తే తట్టుకోలేరని ఘాటుగా వ్యాఖ్యానించారు. చొక్కా గుండీలు విప్పి అడ్డగోలుగా బూతులు మాట్లాడితే మాస్ లీడర్ కాదని.. సిద్ధాంతాన్ని బలంగా ముందుకు తీసుకెళ్లగలిగిన వారే అసలైన నాయకులని అన్నారు. ఆ నమ్మకం, సంకల్పం తనకు ఉందని తెలంగాణ బీజేపీ చీఫ్ రాంచందర్ రావు ధీమా వ్యక్తం చేశారు. ప్రస్తుతం రాష్ట్ర బీజేపీ పార్టీలో ఎలాంటి విభేధాలు లేవని.. అందరం కలిసికట్టుగానే పని చేస్తామని ప్రకటించారు. బీఆర్ఎస్ పార్టీ ట్విట్టర్ పార్టీ అని.. దానితో ఎవరికీ ఉపయోగం లేదని విమర్శించారు. తమ పోటీ ఎప్పుడూ కాంగ్రెస్‌తోనే ఉంటుందని రాంచందర్ రావు పేర్కొన్నారు.

# ఫార్ములా కేసులో ఎసిబి విచారణ

హాజరైన అరవింద్ కుమార్



**హైదరాబాద్ :** ఫార్ములా ఈ కార్ రేస్ కేసులో ఏ2గా ఉన్న ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్ గురువారం ఏసీబీ ఎదుట హాజరయ్యారు. ఈ కేసుకు సంబంధించి మూడోసారి ఏసీబీ విచారణకు వచ్చారు. ఫార్ములా ఈ కార్ రేస్ కేసులో నిధుల బదలాయింపులో అరవింద్ కుమార్ కీలక పాత్ర పోషించారని ఏసీబీ గుర్తించింది. హెచ్ఎండీఏ డైరెక్టర్‌గా పని చేస్తూ నిధులను మళ్లించినట్టుగా ఆరోపణలు ఉన్నాయి. కేబినెట్ అనుమతి లేకుండా నిధులను బదిలాయించినం దుకు ఏసీబీ కేసు నమోదు చేసింది. ఈ కేసులో మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కూడా ఇప్పటికే రెండుసార్లు ఏసీబీ అధికారులు విచారించారు. జూన్ 16న కేటీఆర్ ఇచ్చిన స్టేట్‌మెంట్ ఆధారంగానే అరవింద్‌కుమార్‌ను ఏసీబీ ప్రశ్నిస్తోంది. ఎఫ్ఈవో కంపెనీకి దాదాపు రూ.45 కోట్లు 71 లక్షల నగదును బదిలీ చేశారు. వాటికి సంబంధించే మూడోసారి అరవింద్ కుమార్‌ను విచారణకు పిలిచి ఏసీబీ స్టేట్‌మెంట్‌ను రికార్డు చేసింది. ప్రధానంగా కవిబినెట్ అనుమతి లేకుండా నిధుల బదలాయింపుపై ప్రశ్నించినట్లు సమాచారం. హైదరాబాద్‌లో 2023లో నిర్వహించిన ఫార్ములా–ఈ రేస్ కోసం విదేశీ సంస్థకు నిబంధనలకు విరుద్ధంగా సొమ్ము చెల్లించడం వల్ల ప్రభుత్వానికి రూ.54.88 కోట్ల మేర నష్టం వాటిల్లిందని ఏసీబీ కేసు నమోదు చేసింది. రేస్ నుంచి ఫార్ములా–ఈ ఆపరేషన్స్ తప్పుకొన్న అనంతరమూ నిధులు ఎందుకు విడుదలచేయాల్సి వచ్చిందనే కోణంలో ఆరా తీసింది. ఎన్నికల నియమావళి అమలులో ఉన్నా ఆర్థికశాఖ నుంచి అనుమతి తీసుకోకపోవడం.. మంత్రివర్గం ఆమోదం పొందకపోవడం..తదుపరి మూడేళ్ల పాటు రేస్‌ల నిర్వహణకు రూ.600 కోట్ల మేర చెల్లించేందుకు ఒప్పందం కుదుర్చుకోవడాన్ని అంతర్గత విచారణలో ప్రభుత్వం తప్పుపట్టింది.ఆర్థికశాఖ నుంచి అనుమతి తీసుకోకుండానే రూ.54.88 కోట్ల మేర చెల్లించడాన్ని తీవ్ర నేరంగా పరిగణించింది. దీనిపై ఏసీబీ దర్యాప్తు చేస్తోంది.అయితే పురపాలకశాఖ మంత్రి హోదాలో కేటీఆర్ ఆదేశించడంతోనే తాము నిధులు విడుదల చేసినట్లు అప్పట్లో హెచ్ఎండీఏ కమిషనర్‌గా కొనసాగిన అర్వింద్‌కుమార్ ఇది వరకే ప్రభుత్వానికి లిఖితపూర్వక వాంగ్మూలం ఇవ్వడంతోపాటు ఏసీబీ విచారణలోనూ అంగీకరించారు.

# అమెరికా ఆంక్షలపై అధ్యయనం

వాషింగ్టన్ మీడియా సమావేశంలో జైశంకర్

**వాషింగ్టన్ :** రష్యా నుంచి చమురు కొనుగోలు చేసే దేశాల నుంచి చేసుకొనే దిగుమతులపై 500 శాతం పన్నుతో 'ఆర్థిక బంకర్ బస్టర్' జారవిడుస్తామంటూ అమెరికా సెనెటర్ లిండ్సే గ్రాహం వ్యాఖ్యలపై భారత్ స్పందించింది. భారత విదేశాంగ మంత్రి జైశంకర్ వాషింగ్టన్‌లో మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ అమెరికా కాంగ్రెస్‌లో జరుగుతున్న పరిణామాలు భారత్ ప్రయోజనాలపై ప్రభావం చూపనుండటంతో వాటిని జాగ్రత్తగా గమనిస్తున్నామన్నారు. భారత్ దౌత్య కార్యాలయ సిబ్బంది, ఇతర అధికారులు ఆ బిల్లుకు స్పాన్సర్‌గా వ్యవహరిస్తున్న లిండ్సే గ్రాహంతో టచ్‌లో ఉన్నట్లు చెప్పారు. 'మా ఆందోళనలు, ఇంధన భద్రత ప్రయోజనాలను ఆయనకు తెలియజేసినట్లే భావిస్తున్నా. ఇక అవసరమైతే ఆ సమస్య వచ్చినప్పుడు ఎదుర్కోవాలని పేర్కొన్నారు. క్వాడ్ సమావేశంలో పాల్గొనడానికి నాలుగు రోజుల పర్యటన నిమిత్తం వాషింగ్టన్‌కు వెళ్లిన విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ ,తమ ఆందోళనలను ఆ సెనెటర్‌తో ఇప్పటికే పంచుకొన్నామని ఆయన పేర్కొన్నారు. ఆ బిల్లు వాస్తవరూపం దాలిస్తే ఎదురయ్యే ఇబ్బందులపై తమకు అవగాహన ఉందని చెప్పారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా ఈ బిల్లుకు మద్దతు ఇవ్వడం పరిస్థితిని మరింత జఠిలం చేసింది. రష్యా నుంచి చమురు కొనుగోలు చేసే దేశాల నుంచి అమెరికా చేసుకొనే దిగుమతులపై 500 శాతం పన్ను విధించాలని ఈ బిల్లు ప్రతిపాదిస్తోంది. ఈ బిల్లును ప్రస్తావించే సమయంలో సెనెటర్ లిండ్సే గ్రాహం భారత్, చైనా పేర్లను ముఖ్యంగా ప్రస్తావించడం గమనార్హం. ఉక్రెయిన్‌తో చర్చలకు రష్యాను ఒప్పించేందుకు ఓ ఆయుధం వలే ఈ బిల్లును వాడాలని ట్రంప్ కార్యవర్గం భావిస్తోంది.

# విచారించి చర్యలు తీసుకోండి

- మీనాక్షి నటరాజన్ ను కలిసిన కొండా దంపతులు
- 16 పేజీల నివేదిక
- నేను కరెక్ట్ గానే ఉన్నా.. కొండా సురేఖ
- రాహుల్‌ను ప్రధానిగా రేవంత్‌ను మరో పదేళ్ళు సీఎంగా చూడాలనుందన్న కొండా మురళీ



(నేటి ప్రభాత సూర్య-పొలిటికల్ బ్యూరో)

కాంగ్రెస్ పార్టీలో వరంగల్ పార్టీ విభేదాలు డైలీ సీరియల్ ను మంచి ఉత్కంఠను రేపుతున్నాయి. పరస్పర ఫిర్యాదులతో జిల్లా కాంగ్రెస్ పార్టీ రాజకీయం రంజుగా మారుతోంది. కొన్ని రోజులుగా జిల్లా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు వర్సెస్ మంత్రి కొండా సురేఖ దంపతులకు మధ్య వార్ కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఒకరికి వ్యతిరేకంగా ఒకరు సమావేశాలు నిర్వహించడం, పార్టీ అధిష్టానికి ఫిర్యాదులు చేయడం జరుగుతోంది. గత కొద్ది రోజులుగా ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్‌లో విభేదాలు కొనసాగుతున్న విషయం తెలిసిందే. ప్రభుత్వ సలహాదారు వేం నరేంద్రరెడ్డి, జిల్లా ఇన్చార్జి మంత్రి పొంగులేని శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్ రెడ్డి, నాయిని రాజేంద్రరెడ్డి, గండ్ర సత్యనారాయణ, ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య, డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, మాజీ ఎంపీ ఆర్.సురేంద్ర రెడ్డితో కొండా దంపతులు విభేదిస్తున్నారు. ఒక విధంగా చెప్పాలంటే జిల్లా కాంగ్రెస్ అంతా ఒక వైపు కొండా దంపతులు మరోవైపు అన్నట్లు పరిస్థితి మారిపోయింది. జిల్లాలోని కీలక నేతలు అయిన మంత్రి సీతక్క, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, సీనియర్ నేత బలరాం నాయక్ వంటివారు తటస్థంగా ఉండిపోయారు. ఈ పరిస్థితుల్లో పార్టీ నిలువునా రెండుగా చీలిపోయే ప్రమాదం ఉందన్న సమాచారంతో అధిష్టానం రంగంలోకి దిగింది. ఈ వివాదాన్ని పార్టీ రాష్ట్ర ఇన్చార్జి మీనాక్షి నటరాజన్ ఎలా చక్కదిద్దుతారనేది ఉత్కంఠ రేపుతోంది. ఇదిలావుంటే జిల్లా ఎమ్మెల్యేలపై మంత్రి సురేఖ భర్త సీనియర్ నేత కొండా మురళి వ్యాఖ్యలతో వివాదం మొదలైంది. దీనిపై ఎమ్మెల్యే నాయిని రాజేంద్రనాథ్ రెడ్డి నివాసంలో మిగిలిన నేతలు సమావేశమై కొండా తీరుపై పార్టీ పెద్దలకు ఫిర్యాదుచేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గత వారం పార్టీ క్రమశిక్షణ సంఘానికి ఎమ్మెల్యేలపై ఓ నివేదిక సమర్పించిన మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి, గురువారం పార్టీ రాష్ట్ర ఇన్ చార్జి మీనాక్షి నటరాజన్ ను కలిసి మరో నివేదిక సమర్పించారు. హైదరాబాద్ ఎమ్మెల్యే క్వార్టర్సులో పార్టీ రాష్ట్ర ఇన్చార్జి మీనాక్షి నటరాజన్ను కొండా దంపతులు ప్రత్యేకంగా కలిశారు. ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీలో జరుగుతున్న పరిణామాలపై సుమారు 16 పేజీలతో నివేదిక ఇచ్చారు. ఉమ్మడి జిల్లాలో ఉన్న మొత్తం 12 నియోజకవర్గాల్లో ఎక్కడ ఏం జరుగుతుందో ఆ నివేదికలో పొందుపరిచినట్లు సమాచారం. తమపై జిల్లా ఎమ్మెల్యేలు చేసిన ఫిర్యాదుపైనా మంత్రి కొండా సురేఖ దంపతులు వివరణ ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. తమపై వచ్చిన ఫిర్యాదులపై విచారణ జరిపి నిజాలు తెలుసుకున్న తర్వాత ఎవరిది తప్పుంటే వారిపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్చార్జి మీనాక్షి నటరాజన్ ను కోరినట్లు తెలుస్తోంది. అనంతరం బయటకు వచ్చిన కొండ దంపతులు ఎమ్మెల్యే క్వార్టర్స్ వద్దే మీడియాతో మాట్లాడారు. తనకు కేటాయించిన శాఖలకు న్యాయం చేస్తున్నానని, రూల్స్ ప్రకారమే నడుచుకుంటున్నానని మంత్రి సురేఖ తెలిపారు. తను చూస్తున్న డిపార్టుమెంట్ల ఫైల్స్ అన్నీ చెక్ చేసుకోవచ్చని, మంత్రిగా తాను ఎలాంటి తప్పు చేయలేదని వివరించారు. నా మంత్రి పదవిపై ఎవరు మాట్లాడినా స్పందించాను. సుష్మితలో పారేది కొండా మురళీ, కొండా సురేఖ రక్తం. మా కూతురికి మా ఆలోచనలు వంశపారంపర్యంగా రావడంలో తప్పులేదని సురేఖ వ్యాఖ్యానించారు. కొండా మురళీ మాట్లాడుతూ తాను బీసీ కార్డు పట్టుకునే బతుకుతున్నట్లు చెప్పారు. అణగారిన వర్గాలు బలం ఉన్నవాడి దగ్గరికే వస్తారు. పేదల సమస్యలు తీర్చుతాను కాబట్టే జనం తన వద్దకు వస్తారని తెలిపారు. నాకు ప్రజా బలం ఉంది. పనిచేసే వారిపైనే బండలు వేస్తారు. నడిచే ఎద్దునే పొడుస్తారు. పార్టీ ఎవరికి టికెట్లు ఇచ్చిన గెలిపించే బాధ్యత నేను తీసుకుంటానని ఇన్చార్జి మీనాక్షి నటరాజన్ కు హామీ ఇచ్చినట్లు మురళీ తెలిపారు. 'కాంగ్రెస్ పార్టీని బతికించడమే నా ఉద్దేశం. రాహుల్ గాంధీని ప్రధాని చేయడం నా ఉద్దేశం. రేవంత్ రెడ్డిని ఇంకో పదేండ్లు ముఖ్యమంత్రిగా చూడడం నా ఉద్దేశం. పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్‌కు అండగా నిలుస్తా' అని కొండా మురళి స్పష్టం చేశారు.

# భారత దేశ ఘనాఘనుడు!

మొదటిపేజీ తరువాయి..



సిద్ధంగా ఉందని ఈ సందర్భంగా మోదీ చెప్పారు. ఉగ్రవాదం మానవాళికి శత్రువని.. ఇరు దేశాలు స్పష్టం చేశాయని, ఉగ్ర ముప్పును ఎదుర్కోవడంలో పరస్పర సహకారాన్ని మరింత బలోపేతం చేయాలని నిర్ణయించినట్లు మోదీ వెల్లడించారు. రక్షణ, భద్రతా రంగంలో ఇరుదేశాలు కలిసి ముందుకు సాగుతాయని మోదీ చెప్పారు. సాయుధ దళాల శిక్షణ, సముద్ర భద్రత, రక్షణ సామాగ్రి సరఫరా, సైబర్ భద్రత తదితర రంగాల్లో భారత్–ఘనా దేశాల మధ్య పరస్పర సహకారం పెరుగనున్నదని ప్రధాని మోదీ తెలిపారు. అటు, సంస్కృతి, సాంప్రదాయ వైద్యం తోపాటు పలు రంగాల్లో సహకారాన్ని అందించే నాలుగు ఒప్పందాలపై ఇరు దేశాలు సంతకం చేశాయి. అనంతరం ఘనా పార్లమెంటును సందర్శించి సభ్యులను ఉద్దేశించి ప్రధాని మోదీ ప్రసంగించారు. ఈ గౌరవనీయమైన సభలో ప్రసంగించడం తనకు చాలా గౌరవంగా ఉందన్న మోదీ.. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య ప్రతినిధిగా, 1.4 బిలియన్ల భారతీయుల సద్భావన, శుభాకాంక్షలను తీసుకువచ్చానని అన్నారు. బుధవారం సాయంత్రం తన ప్రియ స్నేహితుడు, అధ్యక్షుడు జాన్ మహామా నుంచి ఘనా జాతీయ అవార్డును స్వీకరించడం హృదయపూర్వక అనుభవమని మోదీ సభకు చెప్పారు. భారతదేశం ప్రజాస్వామ్యానికి తల్లని చెప్పిన మోదీ.. మనకు, ప్రజాస్వామ్యం కేవలం ఒక వ్యవస్థ మాత్రమే కాదన్నారు. ఇది మన ప్రాథమిక విలువలలో ఒక భాగమని చెప్పుకొచ్చారు. భారతదేశంలో 2,500 కంటే ఎక్కువ రాజకీయ పార్టీలు, వివిధ రాష్ట్రాలను పరిపాలించే 20 వేర్వేరు పార్టీలు, 22 అధికారిక భాషలు, వేలాది మాండలికాలు ఉన్నాయని మోదీ చెప్పారు. భారతదేశానికి వచ్చిన ప్రజలను ఎల్లప్పుడూ హృదయపూర్వకంగా స్వాగతించడానికి ఇదే కారణమని ప్రధాని అన్నారు. 'ఇవాళ మన దార్శనికుడు, రాజనీతిజ్ఞుడు, ఘనా బిడ్డ డాక్టర్ క్వామే న్క్రుమాకు నివాళులర్పించే గౌరవం నాకు లభించిందని' అన్నారు. ఘనా పర్యటలో ప్రధాని మోదీ ఆ దేశ అత్యున్నత పురస్కారాన్ని అందుకున్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విశిష్ట రాజనీతి, ప్రభావవంతమైన ప్రపంచ నాయకత్వానికి గుర్తింపుగా ఆ దేశ అధ్యక్షుడు జాన్ డ్రామణి మహామా చేతుల మీదుగా ఘనా జాతీయ గౌరవం 'ఆర్డర్ ఆఫ్ ది స్టార్ ఆఫ్ ఘనా' పురస్కారాన్ని అందుకున్నారు. 1.4 బిలియన్ల భారతీయుల తరపున ఈ అవార్డును స్వీకరిస్తున్నానని చెప్పిన మోదీ.. ఈ గౌరవాన్ని భారతదేశ యువత ఆకాంక్షలు, సాంస్కృతిక, సంప్రదా యాలు, వైవిధ్యం, ఇంకా ఘనా – భారత్ మధ్య చారిత్రక సంబంధాలకు అంకితం చేశారు. ఈ గౌరవాన్ని అందించినందుకు ఘనా ప్రజలకు, ప్రభుత్వానికి ప్రధాని మోదీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ దేశంలో పర్యటించడం తనకు లభించిన గౌరవమని హర్షం వ్యక్తంచేశారు. ఘనా ప్రజాస్వామ్య స్ఫూర్తిని చాటుతోందని కొనియాడారు. రెండో ప్రపంచయుద్ధం తర్వాత ఏర్పడిన ప్రపంచక్రమం వేగంగా మారుతోంది. సాంకేతికతలో విప్లవం, గ్లోబల్‌సౌత్‌లో ఎదుగుదల ఆ మార్పునకు దోహదం చేస్తున్నాయి. గ్లోబల్‌సౌత్ గళం వినిపించకుండా ఆ పురోగతి సాధ్యంకాదు అన్నారు. 2047నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చాలని మా ప్రజలు సంకల్పంతో ఉన్నారు. బలమైన భారత్.. సుస్థిరమైన ప్రపంచానికి దోహదం చేస్తుంది. ఆఫ్రికా అభివృద్ధి దిశగా చేసే ప్రయాణంలో మా సహాయాన్ని అందిస్తాం. మన దేశాల పురోగతికి పరస్పరం సహకరించు కుందామని మోదీ పిలుపునిచ్చారు. జీ20కి భారత్ సారథ్యం వహిస్తోన్న తరుణంలోనే ఆ గ్రూప్‌లో ఆఫ్రికా యూనియన్ శాశ్వత సభ్యత్వం పొందడం ఆనందకరమని వ్యాఖ్యానించారు. ఈ పర్యటనలో భాగంగా రెండు దేశాల మధ్య పరిశోధన, అభివృద్ధి, ఔషధ తదితర రంగాలకు సంబంధించిన ఒప్పందాలు కుదిరాయి. గత మూడు దశాబ్దాల్లో భారత ప్రధాని ఒకరు ఘనాను సందర్శించడం ఇదే ప్రథమం.

# నీటి వాటాను కాలరాసిందే కేసీఆర్.. హరీశ్

మొదటిపేజీ తరువాయి..

కవితకి మహేష్ గౌడ్ కౌంటర్ ఇచ్చారు. తెలంగాణ రాష్ట్రంలో బీసీ బిల్లు చేసేటప్పుడు కవిత జైల్లో ఊచలు లెక్కపెడుతోందని విమర్శించారు. పదేళ్లు బీసీలకు కేసీఆర్ చేసింది ఏంటని నిలదీశారు. బీసీల రిజర్వేషన్లు తగ్గించింది కేసీఆర్ కాదా అని ప్రశ్నించారు. కవిత ఇప్పటిదాకా బీసీల కోసం ఒక్కమాట అయినా మాట్లాడారా అని నిలదీశారు. రాజకీయ శూన్యంలో ఉన్న కవిత.. తన ఉనికి కోసమే మాట్లాడుతోందని చెప్పుకొచ్చారు. కేసీఆర్‌తో ఆస్తి పంపకాల వాటా కోసమే కవిత తమ ప్రభుత్వం గురించి మాట్లాడుతోందని విమర్శించారు. కవిత బీసీల కోసం ఉద్యమం ఎక్కడ చేసిందని మహేష్ గౌడ్ ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీలో కోవర్టులు ఉన్నారని ఆ పార్టీ ఎమ్మెల్యే అనిరుధ్ చేసిన వ్యాఖ్యలపై మహేష్ గౌడ్ సీరియస్ అయ్యారు. అనిరుధ్ వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణిస్తున్నామని అన్నారు. ఆధారాలు లేకుండా మాట్లాడితే ఎలా అని ప్రశ్నించారు. క్రమశిక్షణ విషయంలో సీరియస్‌గా ఉంటామని మహేష్ గౌడ్ స్పష్టం చేశారు. బీజేపీకి మహేష్ గౌడ్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. బీజేపీ తెలంగాణ అధ్యక్ష పదవి కోసం బీసీ నాయకుడు దొరకలేదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అనేకమందికి అవకాశాలు ఇచ్చామని స్పష్టం చేశారు. మైనార్టీలకు త్వరలోనే అవకాశం ఇస్తామని మహేష్ గౌడ్ హామీ ఇచ్చారు. ఇదిలావుంటే శుక్రవారంనాడు జరిగే సభకు సామాజిక న్యాయ సమరభేరిగా నామకరణం చేశామని మహేష్ గౌడ్ తెలిపారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే శుక్రవారంనాడు జరిగే పీఏసీ సమావేశంలో ఖర్గే పాల్గొంటారని అన్నారు. శుక్రవారం సాయంత్రం ఎల్బీ స్టేడియంలో గ్రామ అధ్యక్షుల సమావేశాల్లో ఖర్గే పాల్గొంటారని వెల్లడించారు. రేపటి సమావేశంలో పలువురు గ్రామ, జిల్లా కమిటీల అధ్యక్షులకు మాట్లాడే అవకాశం కల్పిస్తున్నామని తెలిపారు. ప్రతి నియోజకవర్గం నుంచి 500 మంది కాంగ్రెస్ నేతలు శుక్రవారం ఎల్బీ స్టేడియానికి వస్తారని మహేష్ గౌడ్ వెల్లడించారు.

# అవి ఆరోపణలు మాత్రమే!

మొదటిపేజీ తరువాయి..

రాశారు. మిగతా పరీక్షా కేంద్రాల్లో రాసిన వాళ్లలో అంతకంటే ఎక్కువ మందే ఎంపిక య్యారు. కోఠిలోని రెండు కేంద్రాలను కేవలం మహిళలకు కేటాయించ డంతో సౌకర్యాలను మాత్రమే పరిగణనలోకి తీసుకున్నాం. ఉద్యోగానికి ఎంపిక కాని అభ్యర్థులు ఏవేవో అనుమానాలతో పిటిషన్లు దాఖలు చేశారు.వారు చేస్తోన్న ఆరో పణల్లో ఎలాంటి వాస్తవాలు లేవు. కేవలం అపోహలు మాత్రమేనని వాదించారు. గ్రూప్ 1కు ఎంపికైన తెలుగు మీడియం అభ్యర్థులు 9.95 శాతం, ఆంగ్ల మాధ్య మం అభ్యర్థులు 89.88 శాతం, ఉర్దూ మాధ్యమంలో 0.1 శాతంగా ఉన్నారు. ఏపీలో రెండేళ్ల క్రితం నిర్వహించిన ఏపీపీఎస్సీ పరీక్షల్లోనూ ఆంగ్ల మాధ్యమ అభ్యర్థులే ఎక్కువగా ఉన్నారు. టీజీపీఎస్సీకి తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ మాధ్యమ అభ్యర్థుల పట్ల ఎలాంటి వివక్ష లేదు. అందరికీ నిపుణులు ఎంపిక చేసిన అంశాల ఆధారంగా మార్కులు వేశారని కోర్టుకు తెలిపారు.ఎ ాదనలు విన్న ధర్మాసనం ఎవాల్యుయేటర్‌కు ఏమైనా మార్గదర్శకాలున్నాయా అని ప్రశ్నించింది.టీజీ పీఎస్సీ నుంచి వివరాలు తీసుకొని సీల్డ్ కవర్‌లో సమర్పిస్తామని నిరంజన్‌రెడ్డి కోర్టుకు తెలిపారు. దీంతో విచారణను ఉన్నత న్యాయస్థానం నేటికి వాయిదా వేసింది.

# పేరొక్కడిది.. రోల్ ఇంకోడిది..

మొదటిపేజీ తరువాయి..

లేదా అన్నది తనిఖీ చేయాల్సిన బాధ్యత ఈ డ్రగ్ అధికార్లపై ఉంది. కానీ అవేమీ కనిపించడంలేదన్నట్లుగా వాస్తవ పరిస్థితి ఉంది. దీనికి కారణం ఎవరి పేరుపైనో ఉన్న సర్టిఫికేట్ ను తీసుకొని ఇంకో మాటలో చెప్పాలంటే వాని కొనుగోలు చేసి ఇతరులు వాటి ఆధారంగా మెడికల్ షాపులు నిర్వహిస్తున్నారు. మెడికల్ షాపులపై డ్రగ్ ఇన్ స్పెక్టర్లు నజర్ పెట్టకపోవడంవల్లే పేరొక్కడిది రోల్ ఇంకోడిది అన్నట్లుగా మెడికల్ షాపులు కొనసాగుతన్నాయి. డ్రగ్ అధికార్లు తనిఖీలు నిర్వహిస్తే ఇవి బయటపడుతాయి. కానీ పైకి తనిఖీలు నిర్వహించినట్లు డ్రగ్ ఇన్ స్పెక్టర్లు నటిస్తూ అందాల్సింది అందుకొని జారుకొంటున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనికి ప్రత్యేక సాక్ష్యం నేటికీ తుర్కయంజీల్ ప్రాంతంలో ఒకరి పేరుపై సర్టిఫికేట్ ఉంటే ఇంకోకరు వాటిని నిర్వహిస్తున్న మెడికల్ షాపులు అనేకమున్నాయి. ఒక వ్యవస్థ, అధికార యంత్రాంగం కలిగిన డ్రగ్ కంట్రోల్ అధికార్లకు ఇది తెలియందా అంటే తెలియందేమీ కాదు. ఇది తెలిసినా తీసుకోవాల్సింది తీసుకొని నటననిద్రను డ్రగ్ ఇన్ స్పెక్టర్లు ప్రదర్శిస్తున్నట్లు తెలుస్తోంది.

**యథేచ్ఛగా జనరిక్ అమ్మకాలు..?**

మెడికల్ షాపులకు...జనరిక్ మెడికల్ షాపులకు తేడా ఉంటుంది. జనరిక్ మందులను జనరిక్ మెడికల్ షాపుల్లోనే విక్రయించాలి. అలా కాకుండా ఇతర మెడికల్ షాపుల్లోనూ అమ్మితే అది చట్ట విరుద్ధం. కానీ తుర్కయాంజాల్‌లో మాత్ర సీన్ అందుకు విరుద్ధంగా ఉంది. సాధారణ మెడికల్ షాపుల్లోనే జనరిక్ మందులను యథేచ్ఛగా అమ్ముతున్నారని విమర్శలు వెల్లువెత్తుతు న్నాయి. ఇలా అమ్మకూడదు అని అమ్ముతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత డ్రగ్ ఇన్ స్పెక్టర్లపై ఉంది. అందుకే డ్రగ్ ఇన్ స్పెక్టర్లు తమ విధి బాధ్యతగా మెడికల్ షాపులలో తనిఖీలు నిర్వహిస్తుండాలి. ఈ తనిఖీలు కూడా నిరంతరంగా కొనసాగుతుండాలి. కానీ చేయాల్సిన డ్యూటీ యే డ్రగ్ ఇన్ స్పెక్టర్లు చేయడంలేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇక సాధారణ మందులకు జనరిక్ మందులకు ఓతేడా ఉంది. బ్రాండేడ్ డ్రగ్ కం పెనీల మందులు చాలా ఖరీదుగా ఎక్కువ ప్రభావంతో పనిచేసేవిగా ఉం టాయి. ఇక జనరిక్ మందులు కూడా బాగా పనిచేసినా పేరుగాంచిన కంపెనీ డ్రగ్ కంటే తక్కువగా అంటే 60 నుంచి 70శాతం మేర మాత్రమే ఫలితాలను ఇస్తాయి. ఇలాంటి జనరిక్ మందులు ప్రత్యేకించి ఏర్పాటు చేసిన మెడికల్ షాపుల్లో అమ్మడం వెనక ప్రధాన ఉద్దేశం వాటిని కొనుగోలు చేసే ప్రజలకు జనరిక్ మందులు అన్న వాస్తవం తెలియజేయడం కోసం. కానీ అందుకు విరుద్ధంగా సాధారణ మెడికల్ షాపుల్లో సైతం ఈ జనరిక్ మందులు అమ్మితే డబ్బులు పోగొట్టుకోవడంతోపాటు తక్కువ ప్రభావాన్ని చూపే జనరిక్ మందులను తమకు తెలియకుండానే కొనుగోలు చేసి ప్రజలు నష్టపోయే ప్రమాదముంది. ఈ కారణం చేత మెడికల్ షాపుల్లో మందుల విక్రమం అంతా సక్రమంగా సాగుతోందా లేదా అన్నది తనిఖీ చేయాల్సింది డ్రగ్ అధికార్లు. కానీ అదే డ్రగ్ ఇన్ స్పెక్టర్ల పాత్రపై తుర్కయాంజిల్ లో పెద్ద ఎత్తున్న విమర్శలు వస్తున్నాయి.

**రోగాల సీజన్ స్టార్ట్...నష్టపోతున్న ప్రజలు**

ప్రస్తుతం తెలంగాణ వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు పెట్రేగిపోతున్నాయి. దీంతో మెడికల్ షాపులకు ప్రజల రాక సందడి కనిపిస్తోంది. ఈ సమయంలో మెడికల్ షాపులపై తనఖీలు చేసి ప్రజలకు నాణ్యమైన మందులు(డ్రగ్) అందేలా చూడాల్సిన డ్రగ్ ఇన్ స్పెక్టర్లు మాత్రం నిమ్మకునీరెత్తిన్నట్లు వ్యవహరిస్తున్నారు అన్న విమర్శ బలంగా వినిపిస్తోంది. మెడికల్ షాపుల్లో నాణ్యమైన మందులు అమ్ముతున్నారా లేదా ప్రమాణాలను పాటిస్తున్నారా లేదా కంపెనీ మందులు అమ్ముతున్నారా లేక జనరిక్ మందులు అమ్ముతున్నారా అన్నది తనఖీ చేయాల్సిన డ్రగ్ ఇన్ స్పెక్టర్లు తమ బాధ్యతను విస్మరిస్తున్నారు అన్న విమర్శలు వస్తున్నాయి. డ్రగ్ ఇన్ స్పెక్టర్లు తనఖీలు చేయకుండా నటననిద్ర ప్రదర్శిస్తున్న తీరుతో నాణ్యమైన మందులు అందక ప్రజల ఆరోగ్యం దెబ్బతినడమే కాకుండా వారు ఆర్థికంగా నష్టపోయే పరిస్థితులు నెలకొంటున్నాయి. మరి అవినీతి రహిత ప్రభుత్వం అని చెప్పుకొనే రేవంత్ రెడ్డి సర్కార్ ఈ డ్రగ్ ఇన్ స్పెక్టర్ల విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకొంటోంది. నిబంధనలకు వ్యతిరేకంగా నడుచుకొంటున్న మెడికల్ షాపులపై ఎలాంటి చర్యలు తీసుకొంటోందో వేచిచూడాల్సిందే.

# కేసీఆర్‌కు సుస్తీ!

- అనారోగ్యంతో బాధపడుతున్న కెసిఆర్
- చికిత్స కోసం యశోదాలో చేరిక

హైదరాబాద్- నేటి ప్రభాత సూర్య :



బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ అనారోగ్యంతో బాధపడుతు న్నారు. దీంతో గురువారం ఆయన సోమాజిగూడలోని యశోదా ఆసుపత్రిలో చేరారు. ఈ సంద ర్భంగా కేసీఆర్‌కు డాక్టర్లు వైద్య పరీక్షలు నిర్వహించారు.గత కొద్ది రోజులుగా కేసీఆర్ సీజనల్ జ్వరంతో బాధపడుతు న్నట్లు సమాచారం. అయితే గురువారం ఎర్రవల్లిలోని తన ఫామ్‌హౌస్ నుంచి నగంంలో నందినగర్‌లోని తన నివాసానికి కేసీ ఆర్‌తోపాటు ఆయన కుటుంబ సభ్యులు చేరుకున్నారు.గత వారం రోజులుగా జలుబు, దగ్గు, తలనొప్పితోపాటు జర్వం ఆయన్ని ఇబ్బంది పడుతున్నట్లు తెలు స్తుంది. జూన్ 11వ తేదీన కాళేశ్వరం ప్రాజెక్ట్ కమిషన్ ఎదుట కేసీఆర్ విచారణకు హాజరైన సంగతి తెలిసిందే. ఆ సమయంలో సైతం ఆయన కొంత అస్వస్థతతో ఉన్నా రు. ఆ సమయంలో కమిషన్ ఎదుట విచారణ నేపథ్యంలో ఒపెన్ కోర్టుకు తాను రాలేనని.. ఇన్‌సైడ్ విచారణకు హాజరవుతానంటూ కమిషన్‌కు ఆయన స్పష్టం చేశారు. అందుకు కమిషన్ సానుకూలంగా స్పందించింది. దీంతో ఇన్ సైడ్ విచారణకు కేసీఆర్ హాజరైన సంగతి తెలిసిందే.ఈ క్రమంలో ఆయ నకు జ్వరం తీవ్రం కావడంతో ఆస్పత్రికి తీసుకువచ్చారు.కెసిఆర్ వెంట భార్య శోభారాణి, కెటిఆర్,హరీష్ రావు, మాజీ ఎంపి సంతోష్ కుమార్ ఉన్నారు.

# ప్రపంచ పెట్టుబడి కేంద్రంగా హైదరాబాద్

మొదటిపేజీ తరువాయి..

విశ్వసనీయ పెట్టుబడి వాతావరణానికి నిదర్శనం అని కొనియాడారు. మహేశ్వరం ప్రాంతాన్ని పారిశ్రామిక కేంద్రంగా తీర్చిదిద్దే క్రమంలో.. "ఫోర్త్ సిటీ – భారత్ ఫ్యూచర్ సిటీ" నిర్మాణాన్ని కూడా ప్రకటించారు సీఎం. దీనిద్వారా ప్రాంతీయ అభివృద్ధితో పాటు లక్షలాది ఉద్యోగావకాశాలు కలుగుతాయని చెప్పారు. పెట్టుబడులను ఆకర్షించడమే కాకుండా.. వాటి ద్వారా ఆ పెట్టుబడిదారులకు లాభదాయకత కూడా కలగాలి అనే దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పెట్టుబడులకు మెరుగైన అవకాశాలు, పారదర్శకత అందిస్తూ ముందుకు సాగుతున్నామని స్పష్టం చేశారు.

# రైళ్లు ఆపుదాం.. ఢిల్లీకి పోదాం!

మొదటిపేజీ తరువాయి..

వివరాలు బయట పెట్టాలని డిమాండ్ చేశారు. ఇప్పటికీ పాత లెక్కలే చెబుతున్నారని విమర్శించారు. గ్రామ పంచాయతీల వారీగా కులగణన వివరాలు బయట పెట్టాలన్నారు. జూలై 17న రైల్ రోకో నిర్వహించి తెలంగాణ నుంచి ఢిల్లీ వెళ్లే ప్రతి రైలును ఆపుతామన్నారు. బీసీ రిజర్వేషన్ బిల్లు సాధించేందుకు బీజేపీపై ఒత్తిడి తెస్తామని వెల్లడించారు. గోదావరి–బనకచర్ల ప్రాజెక్టు విషయంలో కాంగ్రెస్ పార్టీ మెతక వైఖరి కనబరుస్తున్నదని విమర్శించారు. ఏపీ సీఎం చంద్రబాబును ఒక్క మాట కూడా అనలేదని ధ్వజమెత్తారు. కొందరి కాంట్రాక్టుల కోసమే బనకచర్ల ప్రాజెక్టు అంటూ కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి అన్నారని చెప్పారు. రాష్ట్రంలో చంద్రబాబు కోవర్టులు ఉన్నారని చెప్పారని, ఇప్పటికైనా రేవంత్ రెడ్డి బనకచర్లను ఆపాలని గట్టిగా కొట్లాడాలని చెప్పారు.

# 14 నుంచి కొత్త రేషన్ కార్డుల పంపిణీ

మొదటిపేజీ తరువాయి..

సమా వేశంలో ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లా డుతూ రాష్ట్ర రాజకీయాల్లో ఉమ్మడి నల్లగొండ జిల్లా రాజకీయం గా కీలక పాత్ర పోషిస్తున్నదన్నారు. ప్రభుత్వం ఏ నూతన కార్యక్రమం చేపట్టినా అది నల్లగొండ జిల్లా నుంచే మొదలవుతుందన్నారు. హుజూర్ నగర్ నుంచే సన్న బియ్యం పథకం ప్రారంభించామని గుర్తు చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం మునుగోడు ఉప ఎన్నికల్లో రేషన్ కార్డులు ఇస్తామని గప్పాలు కొట్టి మోసం చేసిందన్నారు. తాము పూర్తిస్థాయిలో కొత్త రేషన్ కార్డులు ఇవ్వబోతున్నామని ప్రకటించారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో పెండింగ్ ఇరిగేషన్ ప్రాజెక్టులను పూర్తి చేసి తీరుతామని స్పష్టం చేశారు. ఎమ్మెల్యేలు అందరూ భూసేకరణ మీద దృష్టి పెట్టాలన్నారు. గత బీఆర్ఎస్ 10 ఏళ్ల పాలనలో జిల్లా ప్రాజెక్టులు నిర్లక్ష్యానికి గురయ్యాయని విమర్శిం చారు. పథకాల లక్ష్యాలను పూర్తిగా సాధించేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గత పాలకులు కృష్ణ జలాల పంపిణిలో కేవలం 299టీఎంసీలకే ఒప్పుకోవటంతో తెలంగాణకి అన్యాయం జరిగిందని తెలిపారు.

# బనకచర్లపై రాహుల్ మౌనమెందుకు

మొదటిపేజీ తరువాయి..

నిలదీయలేదు అని కేటీఆర్ గుర్తు చేశారు. ఎంత పెరిగినా గొర్రెకు బెత్తడే తోక అన్నట్టు ప్రతిపక్ష నేతగా రాహుల్ గాంధీ సాధించింది ఏం లేదన్నారు కేటీఆర్. లోకసభలో ప్రతిపక్ష నాయకుడిగా ఏడాది పూర్తి చేసుకుంటున్న రాహుల్ తెలంగాణ సమస్యలు, ఈ ప్రాంతానికి హక్కుగా రావాల్సిన అంశాల మీద ఏ రోజు కూడా మాట్లాడలేదన్నారు.2014 పునర్విభజనచట్టంలో ఇచ్చిన హామీల అమలుపై నరేంద్రమోడీ ప్రభుత్వాన్ని ఇప్పటి వరకు రాహుల్ గాంధీ ప్రశ్నించలేదని కేటీఆర్ గుర్తుచేశారు.కాళేశ్వరం లేదా పాలుమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయ హెూదా, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ గురించి కేంద్రాన్ని రాహుల్ ఎందుకు నిలదీయడం లేదో చెప్పాలన్నారు. విభజన చట్టంలో ఉన్న ఐటి ఇన్వెస్టిమెంట్ రీజియన్‌ను 2015లోనే మోడీ ప్రభుత్వం రద్దు చేస్తే రాహుల్‌గాంధీ మాట్లాడకుండా కేంద్ర ప్రభుత్వానికి వత్తాసు పలికారన్నారు.వరంగల్ ప్రజల చిరకాల కోరిక కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ విషయంలో కూడా రాహుల్ వ్యవహరించిన తీరును ప్రజలు ఇంకా మరిచిపోలేదన్నారు. ఇక బొగ్గు బ్లాక్‌లను కేటాయించకుండా తెలంగాణ కొంగు బంగారం సింగరేణి అస్థిత్వాన్నే మాయం చేయాలనుకున్న మోడీ ప్రభుత్వ కుట్రలపై రాహుల్‌గాంధీ ఏ రోజుకూడా లోక్‌సభలో మాట్లాడలేదన్నారు. ఎలాగైనా అధికారంలోకి రావాలని ఆచరణ సాధ్యం కాని హామీలు ఇచ్చి అమలుచేయలేక రేవంత్ రెడ్డి చతికిలపడితే రాహుల్ తప్పించుకు తిరుగుతున్నారని కేటీఆర్ విమర్శించారు. హామీల అమలుకు తనదే గ్యారంటీ అని గప్పాలు కొట్టిన రాహుల్, ఇప్పుడు తెలంగా ణకు రాకుండా ముఖం చాటేశారన్నారు. ఎన్నో ఆశలతో కాంగ్రెస్ ను గెలిపిం చిన తెలంగాణ ప్రజలకు రాహుల్ గాంధీ ఇచ్చిన శాపం రేవంత్ సర్కార్ అని కేటీఆర్ మండిపడ్డారు.

# ప్రారంభమైన అమర్‌నాథ్ యాత్ర



**శ్రీనగర్ :** కశ్మీర్ హిమాలయ పర్వతాల్లో మంచులింగం రూపంలో కొలువైన శివుడ్ని భక్తులు దర్శించుకునేందుకు కట్టుదిట్టమైన భద్రత మధ్య అమర్‌నాథ్ యాత్ర ప్రారంభమైంది. యాత్ర మారాల్లో గగనతలంపై నుంచి కూడా పర్యవేక్షణ సాగుతోంది. 38 రోజుల పాటు సాగే ఈ యాత్ర ఆగస్టు 9 నాటికి పూర్తవుతుంది. 3880 మీటర్ల ఎత్తులో ఉండే గుహలో ఉన్న ఈ క్షేత్రానికి గురువారం మొదటి బ్యాచ్ భక్తులు బల్తాల్, నున్‌వాన్ శిబిరాల నుంచి బయలుదేరారు. అనంతనాగ్ లోని పహల్గాం లో నున్‌వాల్ శిబిరం నుంచి 48 కిమీ రూటు నుంచి, సెంట్రల్ కశ్మీర్ లోని గండెర్‌బాల్ సోనామార్గ్ ఏరియా14 కిమీ బల్తాల్ రూటు నుంచి గురువారం తెల్లవారు జామున బయలుదేరారు. యాత్రికులు 'భంభం బోలే.. హరహరమహాదేవ్' నినాదాలతో ముందుకు సాగారు. ముందుగా భరించలేని వాతావరణంలో కష్టతరమైన మార్గం ఉన్నా వారి ముఖాల్లో ఆనందం తొంగి చూసింది. యాత్రికులు తమకు కట్టుదిట్టమైన భద్రత, ఇతర సౌకర్యాలు కల్పించ డంపై సంతోషం వ్యక్తం చేశారు. యాత్రికులతోపాటు కేంద్ర మంత్రి శోభ కరం ద్లజే కూడా బల్తాల్ రూటులో బయలుదేరారు. బుధవారం జమ్ము లోని భగవతి నగర్ శిబిరం నుంచి మొదటి బ్యాచ్ 5892 మంది యాత్రికులు బయలుదేరారు. లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా జెండా ఊపి యాత్రను ప్రారంభించారు. యాత్రికులు మధ్యాహ్నం కశ్మీర్ లోయకు చేరుకోగానే అధికారవర్గాలు, స్థానికుల నుంచి వారికి ఘనమైన స్వాగతం లభించింది. గత ఏప్రిల్‌లో పహల్గాం ఉగ్రదా డిలో 22 మంది తుపాకీ కాల్పులకు బలైపోయిన దుర్ఘటన దృష్ట్యా భక్తులకు ఎలాంటి భయాందోళనలు లేకుండాఉండేందుకు గట్టిభద్రతా ఏర్పాట్లు జరిగాయి.

# రేపే బిజెపి అధ్యక్షుడిగా రామచంద్రరావు బాధ్యతలు

**హైదరాబాద్- నేటి ప్రభాత సూర్య :**



తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన రామచంద్రరావు శనివారం పదవీ బాధ్యతలు స్వీకరించబోతున్నారు. శనివారం నాడు అసెంబ్లీకి ఎదురుగా ఉన్న గన్‌పార్క్ వద్ద అమరవీరుల స్థూపానికి నివాళి అర్పించి.. ఉదయం 10 గంటలకు బీజేపీ కార్యాలయంలో అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉంది. అనంతరం చార్మినార్ దగ్గర ఉన్న భాగ్యలక్ష్మి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేయనున్నారని కమలం పార్టీ వర్గాలు తెలిపాయి. ఇటీవల తెలంగాణ భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడిగా మాజీ ఎమ్మెల్సీ రామచంద్రరావు ఏకగ్రీవంగా ఎన్నిక అయ్యారు. బీజేపీ హైకమాండ్ ఆదేశాల మేరకే రామచంద్రరావును పార్టీ చీఫ్ గా ఏకగ్రీవంగా ఎంపిక చేసింది. కానీ, రామచంద్రరావు ఎంపికపై అసంతృప్తి వ్యక్తం చేసిన గోషామహల్ బీజేపీ ఎమ్మెల్యే రాజా సింగ్ నామినేషన్ వేయడానికి ప్రయత్నించినప్పటికీ కౌన్సిల్ సభ్యుల బలం లేకపోవడంతో ఆయన నామినేషన్ తీసుకోలేదు. దీంతో అసంతృప్తితో ఉన్న ఆయన పార్టీకి రాజీనామా చేశారు. అలాగే, అధ్యక్ష రేసులో ఉన్న ఎంపీ ఈటల రాజేందర్, ధర్మపురి అరవింద్, బండి సంజయ్‌లు కమలం పార్టీ హైకమాండ్ ఆదేశాల మేరకు రామచంద్రారావుకు మద్దతు ఇస్తున్నట్లు వెల్లడించారు. దీంతో కిషన్ రెడ్డి స్థానంలో తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా రామచంద్రరావు ఎన్నికయ్యారు. ఆయన శనివారం నాడు పదవీ బాధ్యతలు చేపట్టబోతున్నారు.

# అంగన్‌వాడీ హెల్పర్లకు శుభవార్త

## టీచర్ ప్రమోషన్ల గరిష్ట వయోపరిమితి పెంపు



**హైదరాబాద్- నేటి ప్రభాత సూర్య :** అంగన్వాడీ హెల్పర్లకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. అంగన్వాడి టీచర్లుగా ప్రమోషన్ పొందే హెల్పర్ల గరిష్ట వయోపరిమితిని పెంచుతూ కీలక నిర్ణయం తీసుకుంది. తాజా నిర్ణయం వల్ల 45 ఏళ్లు దాటిన హెల్పర్లకు ప్రయోజనం చేకూర నుంది. సుమారు 45 నుంచి 50 ఏళ్ల మధ్యలో 4,322 మంది అంగన్వాడీ హెల్పర్లు ఉన్నారు. వీరందరికీ అంగన్వాడీ టీచర్లుగా ప్రమోషన్ దక్కే అవకాశం ఉంది. టీచర్లుగా ప్రమోషన్ పొందాలి అనుకునే అంగన్వాడి హెల్పర్ల గరిష్ట వయసును 50 ఏళ్లకు పెంచే ఫైలుపై మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క సంతకం చేసింది. త్వరలో అధికారిక ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉంది. ప్రభుత్వ నిర్ణయంపై మంత్రి సీతక్కకు అంగన్వాడి యూనియన్ లు ధన్యవాదాలు తెలిపారు.

# సూక్ష్మ, చిన్న వ్యాపారులకు రుణాలు మరింత సులువు

## ముందస్తు చెల్లింపు జరిమానాలకు ఆర్‌బిఐ బ్రేక్



**ముంబై :** రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సూక్ష్మ, చిన్న వ్యాపారులకు రుణాలు అందుబాటులో ఉండేలా కీలక నిర్ణయం తీసుకుంది. ఈ క్రమంలో జనవరి 1, 2026 నుంచి కొత్తగా ఇచ్చే లేదా పునరుద్ధరించే ఫ్లోటింగ్ రేట్ రుణాలపై బ్యాంకులు, నాన్-బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీలు ముందస్తు చెల్లింపు జరిమానాలు విధించకూడదని ఆర్‌బీఐ తెలిపింది. ఈ నిర్ణయం ఎంఎస్ఇలకు ఆర్థిక సౌలభ్యాన్ని, స్వేచ్ఛను అందించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. ఈ నిర్ణయాన్ని ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ మైక్రో అండ్ స్మాల్ / మీడియం ఎంటర్‌ప్రైజెస్ స్వాగతించింది. ఈ విధానం గతంలో రిటైల్ రుణాలపై ముందస్తు చెల్లింపు జరిమానాలను నిషేధించిన ఆర్‌బీఐ ఆదేశానికి అనుగుణంగా ఉంది. రుణ గ్రహీతల హక్కులను కాపాడడం, రుణ మార్కెట్‌లో ఆర్థిక చేరికను ప్రోత్సహించడం పట్ల ఆర్‌బీఐ తన నిబద్ధతను మరోసారి గుర్తు చేసింది. ఈ నిర్ణయం ఓ÷ూఇలకు మరింత సౌలభ్యం, ఆర్థిక స్వేచ్ఛను అందిస్తుందని, దీనివల్ల వ్యాపారులు తమ ఆర్థిక అవసరాలకు అనుగుణంగా మెరుగైన రుణ ఆప్షన్లను ఎంచుకుంటారని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఆర్‌బీఐ తన నోటిఫికేషన్‌లో సూక్ష్మ, చిన్న వ్యాపారాలకు సౌకర్యవం తమైన రుణ సౌలభ్యం చాలా ముఖ్యమని పేర్కొంది. బ్యాంకులు, ఔఈఈఅలు అనుసరిస్తున్న పద్ధతులను తమ పర్యవేక్షణ సమీక్షల్లో గుర్తించినట్లు తెలిపింది. ప్రధానంగా ముందస్తు చెల్లింపు జరిమానాలు రుణగ్రహీతలకు అసౌకర్యాన్ని కలిగించడమే కాక, ఒప్పంద వివాదాలకు కూడా దారితీస్తున్నాయని వెల్లడించింది. కొన్ని బ్యాంకులు, ఔఈఈఅలు రుణ ఒప్పందాల్లో పరిమితి కలిగించే నిబంధనలు చేర్చి, రుణ గ్రహీతలకు తక్కువ వడ్డీ రేట్లు లేదా మెరుగైన సేవల కోసం ఇతర రుణదాతల వైపు మళ్లకుండా అడ్డుకుంటున్నాయని ఆర్‌బీఐ బుధవారం రాత్రి జారీ చేసిన నోటిఫికేషన్‌లో తెలిపింది. ఇలాంటి పద్ధతులు రుణ గ్రహీతల ఎంపిక స్వేచ్ఛను, మార్కెట్‌లో ఆరోగ్యకరమైన పోటీని దెబ్బతీస్తాయని హెచ్చరించింది. ఈ ఆంక్షల నుంచి కొన్ని రకాల రుణదాతలకు మినహాయింపు ఇచ్చారు. స్మాల్ ÷నాన్స్ బ్యాంకులు, రీజినల్ రూరల్ బ్యాంకులు, టైర్3 ప్రైమరీ (అర్బన్) కో ఆపరేటివ్ బ్యాంకులు, రాష్ట్ర, కేంద్ర కో-ఆపరేటివ్ బ్యాంకులు, మిడిల్ లేయర్ ఔఈఈఅలు ఉన్నాయి. దీంతోపాటు ఇప్పటికే రూ.50 లక్షల వరకు రుణాలపై ముందస్తు చెల్లింపు జరిమానాలు విధించకుండా నిషేధించబడ్డాయి. క్యాష్ క్రెడిట్ లేదా ఓవర్ డ్రాఫ్ట్ సౌకర్యాల విషయంలో రుణ గ్రహీత ఒప్పందంలో నిర్దేశిరచిన వ్యవధిలో సౌకర్యాన్ని పునరుద్ధరించ కూడదని బ్యాంకుకు ముందస్తు సమాచారం ఇస్తే, సౌకర్యం గడువు తేదీన రద్దు అయితే, ముందస్తు చెల్లింపు జరిమానాలు వర్తించవని నోటిఫికేషన్ స్పష్టం చేసింది.

# నైజీరియన్ వద్ద మత్తు పదార్థాలు స్వాధీనం



**హైదరాబాద్ :** మత్తు పదార్థాల రవాణాకు అడ్డుకట్ట పడడం లేదు. తాజాగా ఆసిఫ్‌నగర్ లో భారీగా మత్తు పదార్థాలు బయటపడ్డాయి. సైబరాబాద్ ఎస్ఓటీ పోలీసులు నైజీరియన్‌ను వెంబడించి పట్టుకుని అరెస్ట్ చేశారు. శంషాబాద్ విమానాశ్రయం నుంచి పోలీసులు వెంబండించారు. ఆసిఫ్ నగర్ లోనీ ఓ అపార్ట్‌మెంట్ లో రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం ఎస్ఓటీ పోలీసులు ఆసిఫ్ నగర్ లోని ఓ ఫ్లాట్ లో సోదాలు నిర్వహించిన పోలీసులు మత్తు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. దొరికిన మత్తు పదార్థాలను టెస్టింగ్ కు తరలించారు. మారేడుపల్లి, ఎల్బీ నగర్ పోలీస్ స్టేషన్ లో ఇద్దరిపై పలు కేసులు నమోదయ్యాయి. కేటుగాళ్లు కోర్టుకు హాజరవకుండా తప్పించుకు తిరుగుతున్నారు. ఈ వ్యవహారంపై లోతుగా దర్యాప్తు చేస్తున్నారు పోలీసులు.

# యూరియా కొరతకు ప్రభుత్వ అసమర్థతే కారణం

- నిల్వ, సరఫరా ప్రణాళికలో వైఫల్యం
- వైఫల్యాలను కేంద్రంపై నెట్టడం దారుణం
- మండిపడ్డ బిజెపి ఎంపి డికె అరుణ

**హైదరాబాద్- నేటి ప్రభాత సూర్య :**



రాష్ట్రంలో యూరియా కొరతకు ప్రభుత్వ అసమర్థతలే కారణమని బిజెపి ఎంపి డికె అరుణ మండిపడ్డారు. కొరతపై రైతుల్లో అపోహలు కలిగించేలా కాంగ్రెస్ ప్రభుత్వం, బిఆర్ఎస్ నేతలు కేంద్రాన్ని టార్గెట్ చేస్తూ చేస్తున్న అసత్య ప్రచారాన్ని బిజెపి తీవ్రంగా ఖండిస్తోందని డికె అరుణ అన్నారు. రాష్ట్రంలో యూరియా కొరత కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం, అసమర్థ పాలన వల్లే ఏర్పడిందని ఆరోపించారు. దేశవ్యాప్తంగా ఎక్కడా ఎరువుల కొరత లేకపోయినా, ఒక్క తెలంగాణలో మాత్రమే ఇలాంటి పరిస్థితులు ఎందుకు నెలకొన్నాయో చెప్పాలని అన్నారు. సరఫరా, నిల్వల ప్రణాళికలో వైఫల్యం వల్లే రైతులకు ఇబ్బందులు కలుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ సర్కారు సరఫరా, నిల్వల ప్రణాళికపై వైఫల్యం వల్లే రైతులు ఇబ్బందులు పడుతున్నార న్నారు. ఎరువుల విషయంలో రాష్ట్ర రైతులు ఎలాంటి అపోహలో పడొద్దని, ఈ రబీ సీజన్‌కు రాష్ట్రానికి అవసరమైన యూరియాను కంటే ఎక్కువగా కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే సరఫరా చేసిందన్నారు. రాష్ట్రానికి అవసరం 9.5 లక్షల మెట్రిక్ టన్నులైతే కేంద్రం 12.02 లక్షల మెట్రిక్ టన్నులు యూరియా పంపిందని గుర్తు చేశారు. ఇదే కాకుండా డీఏపీ, ఎన్‌పికెఎస్ వంటి అన్ని ఎరువులూ రాష్ట్ర అవసరానికి మించి పంపించా మన్నారు. డీఏపీ కోసం 1.47 లక్షల టన్నులు అవసరం ఉండగా, 1.72 లక్షల టన్నులు పంపించడమే దీనికి ఉదాహరణ అని అన్నారు. కేంద్రం ఎప్పటికప్పుడు రాష్ట్ర అవసరాలను అంచనా వేసి అధికంగా సరఫరా చేస్తోంది. కానీ రాష్ట్ర ప్రభుత్వం మాత్రం పంపిణీ వ్యవస్థను సక్రమంగా నిర్వహించడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. మార్క్‌ఫెడ్ దివాళా తీసిందని చెబుతూ ట్రాన్స్‌పోర్ట్ ఛార్జీలను రైతులపై మోపడం, కొన్ని కోఆపరేటివ్ సంఘాల్లో ఎరువులు నిల్వ వేసి బ్లాక్ మార్కెట్‌కు తిప్పడంపై ఆరోపణలు రావడం ఈ పరిస్థితికి నిదర్శనం. అసలు సమస్య రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యం. కానీ దాన్ని కప్పిపుచ్చుకునేందుకు కేంద్రంపై తప్పుడు ఆరోపణలు చేయడం అనైతిక చర్యగా ఆమె అభివర్ణించారు. రైతుకు కేంద్ర ప్రభుత్వం ఒక్క యూరియా బస్తాకు రూ.2,236, డీఏపీ బస్తాకు రూ.2,422 సబ్సిడీ ఇస్తోంది. ఒక్క ఎకరా రైతుకు ఒక పంటకు రూ.9,31 6 విలువైన ఎరువుల సబ్సిడీ లభిస్తోందన్నారు. ఏడాదికి రెండు పంటలు పండిస్తే రూ.18,632. దీనికి తోడు పీఎం కిసాన్ ద్వారా రూ.6,000 కలిపి మొత్తంగా రూ.24,632 మద్దతు కేంద్రం అందిస్తోందని వెల్లడించారు. ఇంతటి మద్దతు అందిస్తున్న కేంద్రంపై తప్పుగా ఆరోపణలు చేయ డం, రాష్ట్ర ప్రభుత్వం దుష్ప్రచారం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. అసలు ఎరువుల కొరత అనేదే లేదు. రాష్ట్ర ప్రభుత్వం సప్లై చైన్‌లో వైఫ ల్యం, అవినీతి, చొరవలేని పాలన కారణంగా రైతులకి సమస్యలు ఎదురవుతున్నాయని తెలిపారు. మరోవైపు రూ.268కే ఇవ్వాల్సిన యూరి యాను అధిక ధరకు, రూ.1311కే ఇవ్వాల్సిన డీఏపీను అదనంగా ధర వసూలు చేస్తూ విక్రయిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను దోచుకుం టోందన్నారు. స్థానిక ఎన్నికలు జరపలేకపోయిన కారణంగా ఆర్థిక సంఘం నిధులు కోల్పోయిన రాష్ట్ర ప్రభుత్వం, కేంద్రం ఇచ్చిన ఎరువులను కూడా సమర్థంగా పంపిణీ చేయలేక రైతులను ఇబ్బందుల్లో పడేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా రైతులకు మద్దతుగా గత 10 ఏళ్లలో రూ.12.5 లక్షల కోట్ల ఫెర్టిలైజర్ సబ్సిడీ ఖర్చు చేసిందన్నారు. ప్రత్యేకంగా తెలంగాణలో మూతబడ్డ రామగుండం ఫెర్టిలైజర్ ప్లాంట్‌ను రూ.6,338 కోట్లతో పునరుద్ధరించి మళ్లీ ప్రారంభించిందన్నారు. ఇవన్నీ మోడీ ప్రభుత్వం రైతుల పట్ల ఉన్న నిబద్ధతకు నిదర్శనమని ఎంపి డికె అరుణ అన్నారు.

# చిత్రాల పైరసీతో భారీ బిజినెస్

## కేటుగాడిని అరెస్ట్ చేసిన సైబర్ క్రైమ్ పోలీసులు

**హైదరాబాద్- నేటి ప్రభాత సూర్య :**



టాలీవుడ్‌లో విడుదలైన పలు భారీ చిత్రాలను పైరసీ చేసి.. వాటి ద్వారా భారీగా నగదు దండు కుంటున్న కిరణ్‌కుమార్‌ను సైబర్ క్రైమ్ పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. అతడి వద్ద నుంచి భారీగా పైరసీ సినిమ్ ÷ల్స్‌ను స్వాధీనం చేసుకు న్నారు. అనంతరం కిరణ్ కుమార్‌ను సైబర్ క్రైమ్ పోలీసులు విచారిస్తున్నారు. టాలీవుడ్‌లో దాదాపు 40 పెద్ద సినిమాలను అతడు పైరసీ చేసినట్లు గుర్తించారు. ఈ సినిమాలను హెచ్‌డీప్రింట్ రూపం లో పైరసీ చేసి విక్రయించినట్లు కనుగొన్నారు. ఈ భారీ చిత్రాలను పైరసీ చేయడం వల్ల టాలీవుడ్ పరిశ్రమకు రూ. 3,700 కోట్లు నష్టం వాటిల్లిందని సైబర్ క్రైమ్ పోలీసులు తెలిపారు. మరోవైపు కామ్ కార్డ్ ద్వారా సినిమాలను పైరసీ చేసినట్లు పోలీసుల ఎదుట కిరణ్ కుమార్ ఒప్పుకున్నాడు. సినిమా థియేటర్లలోనే పైరసీ చేసి వాటిని అతడు మాఫి యాకి విక్రయించేవాడు. వన్ తమిళ్ ఎమ్‌వీ సం స్థకు ఈ పైరసీ సినిమాలను అతడు విక్రయించా డు. ఇలా ఒక్కొక్క సినిమాకి అతడు 400 క్రిప్టో కరెన్సీని తీసుకున్నాడు. స్ప్రింటోతోపాటు బిట్ కాయిన్స్ రూపంలో వారి నుంచి కిరణ్ కుమార్ నగదు వసూల్ చేశారు. బిట్ కాయన్స్, క్రిప్టో రూపంలో వచ్చిన నగదును గూగుల్ పే ద్వారా ఇండియన్ కరెన్సీకి అతడు మార్చుకున్నట్లు విచారణలో సైబర్ క్రైమ్ పోలీసులు గుర్తించారు. ఇటీవల విడుదలైన కన్నప్ప, పెళ్లికాని ప్రసాద్, గేమ్ చేంజర్, రాజధాని సినిమాలకు చెందిన ఫైల్స్‌ను కిరణ్‌కుమార్ నుంచి సైబర్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్ థియేటర్ల లోనే కామ్ కార్డు ద్వారా కిరణ్ ఈ సినిమాలు రికార్డింగ్ చేసినట్లు సైబర్ పోలీసులు గుర్తించారు. ఏడాదిన్నర కాలంలో దాదాపు 40 పెద్దపెద్ద సిని మాలను పైరసీ చేసినట్లు నిందితుడు అంగీకరిం చాడు. వాటిల్లో తెలుగు,తమిళ సినిమాలు ఉన్నాయి. ఇప్పటివరకూ 65 సినిమాలను రికార్డు చేసినట్లు కిరణ్ కుమార్ పేర్కొన్నారు. వన్ తమిళ్‌బ్లాస్టర్, వన్ తమిళ్‌ఎమ్‌వీ, 5 మూవీరూల్జ్, వెబ్ సైట్లకు ఈ పైరసీ సినిమాలను విక్రయించినట్లు తెలు స్తోంది. తండేల్, సింగిల్, కిస్మత్ (హిందీ), రోమాం టిక్, గేమ్ ఆన్, పెళ్లి కానీ ప్రసాద్, రాజధాని ÷ల్స్, ప్రతిరోజు పండుగే చిత్రాలు అతడు పైరసీ చేసిన జాబితాలో ఉన్నాయి. సినిమా హాళ్లకు వెళ్లి అనువైన చోట టిక్కెట్ బుకింగ్ చేసుకుని పైరసీకి ప్లాన్ చేసాడని గుర్తించారు.

# పైరసీపై కఠిన చర్యలు

## ఎఫ్‌డీసీ ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు.. ఎఫ్‌డిసి చైర్మన్ దిల్ రాజు



**హైదరాబాద్- నేటి ప్రభాత సూర్య :**

సినీ పరిశ్రమలో పైరసీని అరికట్టేందుకు కఠిన చర్యలు చేపడుతున్నామని, ఇందుకోసం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు ఫిల్మ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజు తెలిపారు. గురువారం ఎఫ్‌డీసీ ఎండీ సిహెచ్ ప్రియాంకతో కలిసి సమాచార శాఖ ఎఫ్‌డీసీ బోర్డు రూమ్ లో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇప్పటికే ఉప ముఖ్యమంత్రితో పలు కీలక సమావేశాలు నిర్వహించామని, సినిమా ఇండస్ట్రీ ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సమగ్ర కార్యాచరణను సిద్ధం చేస్తున్నామని ఆయన తెలిపారు. అవసరమైతే నూతన నిబంధనల రూపకల్పన కూడా చేస్తామని అయన వెల్లడించారు. ఎఫ్‌డీసీ నోడల్ ఏజెన్సీగా , ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ సైబర్ సెల్, పోలీస్ శాఖల ప్రతినిధులతో కమిటీ ఏర్పాటు చేసి, సినిమా షూటింగ్‌లకు ఆన్‌లైన్ అనుమతుల ప్రాసెస్‌తో పాటు వీడియో పైరసీ నియంత్రణకు కఠిన చర్యలు తీసుకుంటామని దిల్ రాజు పేర్కొన్నారు. సినీ పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, అందరం కలిసి ఈ రంగాన్ని ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని ఆయన ఈ సందర్భంగా కోరారు. ఫ్‌డీసీ ఎండీ సిహెచ్. ప్రియాంక మాట్లాడుతూ సినిమా జర్నలిస్టుల అక్రిడిటేషన్ అంశంపై సమీక్ష జరిపి, సాధ్యసాధ్యాలపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఇండస్ట్రీ సమస్యలపై ఎవరైనా తమ దృష్టికి తీసుకువస్తే, వాటి పరిష్కారానికి తప్పకుండ తాము కృషి చేస్తామని ఆమె హామీ ఇచ్చారు.

# బెడిసికొట్టిన పసికందు అమ్మకం వ్యవహారం

## డబ్బుల దగ్గర తేడా రావడంతో పోలీసులకు తల్లి ఫిర్యాదు

**నిజామాబాద్- నేటి ప్రభాత సూర్య :**

నవ మాసాలు మోసి పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చిన ఓ తల్లి ఆ పసి కందును అమ్మకానికి పెట్టింది. పురిటి నొప్పుల బాధ తగ్గక ముందే ఆ పసి కందును తన పొత్తిళ్లు దూరం చేసింది. కానీ బేరం బెడిసి కొట్టడంతో కన్న తల్లి ఎదురు తిరిగింది. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సాక్షిగా సాగిన పసికందు అమ్మకం గుట్టును రట్టు చేసిం ది. తల్లి ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన పోలీసులు కొద్ది గంటల వ్యవధిలో కథకు సుఖాంతం ఇచ్చారు. మొత్తం ఈ వ్యవహా రంలో ప్రియుడు కీలక పాత్ర పోషించినట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో వెల్లడైం ది. నిజామాబాద్‌లోని నాగారం మూడువం దల క్వార్టర్స్‌లో ఉండే ఓ మహిళ డెలివరీ కోసం నిజామాబాద్ జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చేరింది. మూడు రోజుల క్రితం పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది. ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయి ఇంటికి వెళ్ల డానికి కొద్దిగంటల ముందే నవ మాసాలు మోసిన తల్లి ప్రియుడి ఒత్తిడితో కర్కషంగా మారింది. ఆ పసికందును అమ్మడానికి సిద్ధ మైంది. ఓ ముఠాతో 2లక్షల రూపాయల కు విక్రయించడానికి ఒప్పందం చేసుకుం ది. ఆమె ప్రియుడు నజీర్ మధ్యవర్తిత్వం వహించాడు. పూలాంగ్‌కు చెందిన భార్యభ ర్తలు పసికందును కొనుగోలు చేశారు. అయితే 2 లక్షలు ఇస్తామని నమ్మబలికిన ముఠా లక్ష ఇచ్చి చేతులేత్తేసింది. దీంతో ఆ తల్లి ఎదురు తిరిగి జనరల్ ఆస్పత్రిలో సాగిన పసికందు అమ్మకం గుట్టును రట్టు చేసింది. నేరుగా సమీపంలోని ఒకటవ టౌన్ పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసింది. జరిగిన తతంగాన్ని చెప్పి తన బిడ్డను తిరిగి ఇప్పించాల్సిందిగా కన్నీరుము న్నీరుగా విలపించింది. దీంతో హుటాహు టిన దిగిన పోలీసులు హైమదీబజార్‌కు చెందిన ముఠాతోపాటు పసికందును కొను గోలు చేసిన వారిని సైతం అదుపులోకి తీసుకుంది. కొద్ది గంటలోపే కన్న తల్లి ఒడికి చేర్చారు.



# రోడ్డు ప్రమాదంలో ఎస్ఐ మృతి

**సిద్ధిపేట - నేటి ప్రభాత సూర్య :**

సిద్ధిపేట జిల్లాలోని చేర్యాల గేటు వద్ద బుధవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఫిల్మ్‌నగర్ ఎస్ఐ రాజేశ్వర్ మృతి చెందాడు. అర్ధరాత్రి లారీ, కారు ఢీకొన్న ప్రమాదంలో ఫిల్మ్‌నగర్ ఎస్సై రాజేశ్వర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అనంతరం ఆయన్ను ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. బల్కంపేట ఎల్లమ్మ ఆలయం వద్ద బందోబస్తు ముగించుకొని వస్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఎస్సై రాజేశ్వర్ స్వస్థలం సంగారెడ్డిలోని చాణక్యపురి కాలనీ. వారం రోజుల క్రితమే హైదరాబాద్‌లోని ఫిల్మ్‌నగర్ పోలీసు స్టేషన్‌లో ఎస్సైగా బాధ్యతలు స్వీకరించారు. రాజేశ్వర్‌కు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. 1990లో ఆయన పోలీసు శాఖలో ఉద్యోగంలో చేరారు. ఈ ఘటనతో స్థానిక పోలీసులు తీవ్ర విచారం వ్యక్తం చేశారు.




# అసంతృప్త ఎమ్మెల్యేలతో ఖర్గే భేటీ

## మంత్రి పదవులు రానందుకు చింతవద్దని హితవు

**హైదరాబాద్- నేటి ప్రభాత సూర్య :**

రేవంత్ రెడ్డి కేబినెట్‌లో చోటు దక్కని అసంతృప్త ఎమ్మెల్యేలను ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే బుజ్జగించే పనిలో నిమగ్నమయ్యారు. గురువారం రాత్రి తాజ్ కృష్ణా హోటల్‌లో ఖర్గేను ఎమ్మెల్యేలు ప్రేమసాగర్ రావు, మల్‌రెడ్డి రంగారెడ్డి, బాలు నాయక్ తదితరులు విడివిడిగా కలిశారు. ఈ సందర్భంగా తాము మంత్రి పదవులపై ఆశలు పెట్టుకున్నామని పార్టీ అధినేత ఖర్గేకు వివరిం చారు. ఈ సందర్భంగా వారితో కీలక వ్యాఖ్యలు చేసినట్లు తెలుస్తుంది. ఆ క్రమంలో తొలుత ప్రేమ సాగర్ రావు.. ఖర్గేతో సమావేశమయ్యారు. కేబినెట్‌లో ఆయనకు చోటు కల్పించలేమంటూ ప్రేమ సాగర్ రావుకు ఖర్గే స్పష్టం చేశారు. అయితే చీఫ్ విప్ హోదా కల్పిస్తామని పేర్కొన్నారు. ఈ ఆఫర్‌ను ఆయన తిరస్కరించారు. అనంతరం అక్కడి నుంచి ప్రేమ సాగర్ రావు అలిగి వెళ్లిపోయారు. దీంతో ఆయనను బుజ్జగించేందుకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క రంగంలోకి దిగారు. మరోవైపు రెడ్ల సామాజిక వర్గానికి మంత్రివర్గంలో స్థానం ఉండక పోవచ్చని పలువురు ఎమ్మెల్యేలకు ఖర్గే స్పష్టం చేసినట్లు తెలుస్తుంది. దీంతో మల్ రెడ్డి రంగారెడ్డి, పరిగి రామ్మోహన్ రావులు అసంతృప్తిగా బయటకి వెళ్లిపోయారు. అలాగే మంత్రివర్గంలో సీనియర్లకు అవకాశం కల్పించాలని ఖర్గేను సుదర్శన్ రెడ్డి కోరారు. దీంతో ఆయనకు సైతం ఖర్గే సమాధానం ఇచ్చినట్లు సమాచారం. ఇంకోవైపు బంజారాలకు మంత్రివర్గంలో అవకాశం కల్పించమని ఎమ్మెల్యే బాలు నాయక్ కోరారు. దీనిపై ఖర్గే స్పందిస్తూ.. కష్టపడితే అవకాశాలు ఉంటాయని బాలు నాయక్‌తో ఖర్గే తెలిపారు. ఇక తనకు ముందస్తు కార్యక్రమం కారణంగా.. ఈ సమావేశానికి రాలేక పోతున్నట్లు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పార్టీ సీనియర్లకు తెలిపారు. అయితే తనకు ఫోన్ కాల్ రాలేదని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి వెల్లడించారు. ఇక ఖార్గేతో భేటీ అనంతరం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ.. ఖర్గే తమకు సమయం ఇచ్చి.. మాట్లాడారన్నారు. ఒక్కొక్కరిని విడివిడిగా మాట్లాడారని చెప్పారు. తాము చెప్పిన మాటలు ఖర్గే శ్రద్ధగా విన్నారని తెలిపారు. ఉమ్మడి 10 జిల్లాకు ఒక మంత్రి పదవి ఇవ్వాలని డిమాండ్ చేశామన్నారు. ఇచ్చిన జిల్లాకే మంత్రులు ఇస్తే బాగోదని తాము సూచన చేశామన్నారు. రాష్ట్ర జనాభాలో 45 శాతం జనాభా ఉన్న హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలకు మంత్రి పదవి ఇవ్వలేదని గుర్తు చేశామన్నారు. సగం స్టేట్‌కి ఒక్క మంత్రి పదవి కూడా ఇవ్వలేదని పరిస్థితిని ఖార్గేకు వివరించామన్నారు.



# ఆలయాల్లో విగ్రహాలు, ఆభరణాల చోరీ

- వరుస దొంగతనాలపై పోలీసుల నజర్
- వల పన్ని ఇద్దరిని పట్టుకున్న పోలీసులు

**హైదరాబాద్- నేటి ప్రభాత సూర్య :**

ఆలయాల్లో విగ్రహాలను, ఆభరణాలను చోరీ చేసే ముఠాను పట్టుకున్నారు. అక్కడ ఉన్న పంచలోహ విగ్రహాలు.. బంగారు ఆభరణాలువీరు చోరీ చేస్తారు. పోలీసులకు దొరక కుండా తప్పించుకుని వెళ్లిపోతారు. ఇలా చోరీ చేసిన విగ్రహాలను ముంబై, చెన్నై స్మగ్లర్లకు అమ్మేస్తున్నారు. వరుసగా చోరీలు జరుగుతుండడంతో సీరియస్‌గా తీసుకున్న పోలీసులు దర్యాప్తు చేయడంతో నిందితులు పట్టుబడ్డారు. హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో ఉన్న ఆలయాల్లో వరుసగా జరుగుతున్న చోరీల కేసును పోలీసులు ఎట్టకేలకు ఛేదించారు. దాదాపు ఫిబ్రవరి నుంచి నిన్న మొన్నటి వరకు ఆలయాల్లో జరుగుతున్న చోరీలు పోలీసులను కలవరపాటుకు గురిచేశాయి. ఎంతగా దర్యాప్తు చేస్తున్నా.. దొంగలు పట్టుబడలేదు. కానీ సాంకేతిక ఆధారాలు, ఇతర అంశాలను ఆధారం చేసుకుని చివరకు కేసును ఛేదించారు.. ఈ కేసులో ఇద్దరు దొంగలను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.5,36,300 విలువైన పంచలోహ విగ్రహాలు, ఇతర బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. వరుసగా దేవాలయాల్లో చోరీలు పాల్పడుతున్న నిందితులను ఆంధ్రకు చెందిన పాత నేరస్తులని అధికారులు తేల్చారు. ఈ దొంగలు ఇద్దరిని కే. శివానంద, షేక్ హమ్ షరీఫ్‌గా పోలీసులు గుర్తించారు. నిందితులు కర్నూల్, ప్రకాశం జిల్లాలకు చెందిన వలస కార్మికులని చెబుతున్నారు. ఎలాగైనా డబ్బు సంపాదించాలని ఆలయాలపై చోరీలకు పాల్పడ్డట్లు తెలిపారు. శివానందపై గతంలో కాజీపేట్, మీర్‌పేట్, నాగోల్ పోలీస్ స్టేషన్లలో ఐదు కేసులు నమోదై ఉన్నాయి. ఫిబ్రవరి 27 నుండి జూన్ 30 మధ్య కాలంలో యాచారం, ఇబ్రహీంపట్నం, అబ్దుల్లాపూర్‌మెట్ పరిధిలోని ఆరు ఆలయాల్లో చోరీలు చేశారని విచారణలో తేలింది. దొంగతనం చేసిన తర్వాత విగ్రహాలను ఉప్పల్‌కు చెందిన స్క్రాప్ వ్యాపారి శివకుమార్‌కు అమ్మేశారు.. నిందితులిద్దరినీ రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. మరోవైపు ఆలయాల నుంచి దొంగిలించిన పంచలోహ విగ్రహాలను చెన్నై, ముంబైలోని స్మగ్లర్లకు అమ్మేస్తున్నట్లు తెలుస్తోంది. అటు నుంచి విదేశాలకు కూడా ఈ పంచలోహ విగ్రహాలు వెళ్తున్నాయని పోలీసులు అనుమానిస్తున్నారు.

# సంపాదకీయం

## పరిశ్రమల్లో ఎమర్జెన్సీ సేఫ్టీ ఆడిట్ జరగాలి

పారిశ్రామిక వాడల్లో ప్రమాదాలు కలవరపెడుతున్నాయి. ఇది ఒక్క పాశమైలారం గురించే కాదు... దేశమంతా ఇదే దుస్థితి నెలకొంది. ప్రధానంగా ప్రమాదం జరిగినప్పుడు హడావిడి చేస్తున్న ప్రభుత్వం, అధికారులు వ్యవహారం సద్దుమణిగాక పట్టించుకోవడం లేదు. ఎందుకంటే ప్రమాదాల్లో ఎంతమంది మరణించారో కూడా లెక్కలు తెలియడం లేదు. సరికదా తెలుసుకునే ప్రయత్నాలు చేయడం లేదు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, అధునాతన సాంకేతిక పరిజ్ఞానం గురించి నిత్యం వల్లెవేసే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికైనా భారీ పరిశ్రమలన్నింటిలో రెగ్యులర్‌గా సేఫ్టీ ఆడిట్ చేయించాలి. పని పరిస్థితులను మెరుగుపరచాలి. పారిశ్రామిక ప్రమాదాలు తరచూ జరిగే పారిశ్రామిక వాడలు ఉన్న ప్రాంతాల్లో వంద పడకల బర్న్స్ వార్డులతో కూడిన ఆసుపత్రులు నిర్మించాలి. ప్రతి నెలా అన్ని పరిశ్రమల్లోనూ తనిఖీలు నిర్వహించి, భద్రతా ప్రమాణాలు పాటించేలా చర్యలు చేపట్టాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వీటిని అనుసరించేలా ఒత్తిడి తేవాలి.

ఇప్పటికే పాశమైలారంనకు సంబంధించి అనేకమంది బాధితులు ఆస్పత్రి ముందు వచ్చి రోదిస్తున్నా.. స్పందించడం లేదు. మావారు ఏమయ్యారన్న ప్రశ్నలకు సమాశానం రావడం లేదు. ప్రమాదం జరిగిన సోమవారం నాడు పరిశ్రమలోకి ఎంతమంది వెళ్లారనడానికి సరైన లెక్కలు లేవు. దీనికి కూడా కారణం ఉంది. మనుషులతో పాటు, రికార్డులు కూడా బుగ్గికావడమే ఇందుకు నిదర్శనం. తెలంగాణ చరిత్రలోనే అతి పెద్ద పారిశ్రామిక ప్రమాదంగా సంగారెడ్డి జిల్లా పాశమైలారం పారిశ్రామిక వాడలోని సిగాచీ ఇండిస్ట్రీస్ లిమిటెడ్ దుర్ఘటన నిలిచిపోయింది. ఇప్పటికి **40** మంది కార్మికులు మరణించగా, మరో **37** మంది తీవ్రంగా గాయపడినట్టు గుర్తించారు. ఆ సమయంలో విధుల్లో ఉన్న **147** మందిలో మిగిలిన వారి కోసం రెండు రోజులుగా గాలింపు కొనసాగుతూనే ఉంది. కొందరి గుర్తింపు భారంగా మారింది. డిఎన్ఎ టెస్టులు కూడా కష్టంగానే మారాయి. బూడిదకుప్పల నుంచి డిఎన్ఎ టెస్టు చేయడం సాధ్యం కావడం లేదని సమాచారం. ఇకపోతే ఉద్యోగానికి వెళ్లిన వారెంతమంది అన్నది ప్రాథమికంగా తేల్చాలి. అప్పుడే ఎంతమంది చనిపోయారన్నది తెలుస్తుంది. ఎందుకంటే నవ్వుతూ ఉద్యోగానికి వెళ్లిన కార్మికులు బూడిద కుప్పలుగా మారారు. డిఎన్ఎ ఆధారంగా వారి అవశేషాలను గుర్తించాల్సిన దుస్థితి కనిపిస్తోంది. ఎందుకంటే తమవారు ఏరీ అని అడిగే వారి కుటుంబాలకు సమాధానం చెప్పుకోలేని దుస్థితిలో ప్రభుత్వం, అధికారులు, సంస్థ ప్రతినిధులు ఉన్నారు. కార్మికుల భద్రతను గాలికి వదిలేసిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్వాకమే హైదరాబాద్ శివారు ఔషధ పరిశ్రమలో చోటు చేసుకున్న భారీ విస్ఫోటనంగా చెప్పుకోవాలి.

హైదరాబాద్ శివారులోని పరిశ్రమల్లోనే గత రెండు మూడు నెలల్లో నాలుగైదు ప్రమాదాలు జరిగాయి. ఆంధ్రప్రదేశ్ కూడా అందుకు మినహాయింపు ఏమీ కాదు. విశాఖలో **2020** నాటి ఎల్‌జి పాలిమర్స్ ప్రమాదం **12** మంది కార్మికులను బలిగొంటే, చుట్టుపక్కల ప్రాంతాలన్నింటినీ విషతుల్యంగా మార్చి, వందలమందిని ఆసుపత్రుల పాలు చేసింది. ఆ తరువాత అచ్యుతాపురం సెజ్‌లో **2022** జూన్, ఆగస్టులో **500** మందికిపైగా మహిళలు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఆ ప్రమాదంపై నివేదిక అమలు మాట అటుంచి వెలుగుచూసిన పాపానే పోలేదు. గత ఏడాది అచ్యుతాపురం సెజ్ ఎసెన్షియా ఫార్మాలోనే **17** మంది మరణించగా, **38** మంది గాయపడ్డారు. ఈ ఏడాది ఆరు నెలల్లోనే అనకాపల్లి జిల్లాలో జరిగిన **11** ప్రమాదాల్లో ఐదుగురు మరణించగా, ఎనిమిదిమంది తీవ్ర గాయాలతో మంచంపట్టారు. పరవాడ ఫార్మాసిటీలో గత ఏడాది విషవాయువుల లీకేజిసహా పలు ప్రమాదాల్లో **10** మంది మరణించగా, **40** మంది తీవ్రంగా గాయపడ్డారు. ప్రాణాలకు తెగించి ప్రాణాంతక పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికుల పక్షాన నిలవకుండా, లాభం కోసం భద్రతను గాలికొదిలేసి ప్రాణాలను బలిగొంటున్న పరిశ్రమల అధిపతుల పక్షాన కేంద్ర, రాష్ట్ర పాలకులు నిలవడం మరింత విషాదం. దేశవ్యాప్తంగా పారిశ్రామిక ప్రమాదాల్లో రోజూ కనీసం ముగ్గురు కార్మికులు మరణిస్తున్నారు. తనిఖీలను తగ్గించి, స్వీయ ధ్రువీకరణలను అనుమతించడం ద్వారా భద్రతాపరమైన నియంత్రణలను బలహీనపరచడమే భారీ ప్రమాదాలకు కారణమన్న అంతర్జాతీయ కార్మిక సంస్థ హెచ్చరికలను ఇప్పటికైనా గుర్తించి, కఠిన చర్యలకు ఉపక్రమించాలి. యాజమాన్యాలు అత్యాశతో రసాయన, ఔషధ పరిశ్రమలుసహా వివిధ పరిశ్రమల్లో అత్యంత కీలకమైన స్థానాల్లో అతి తక్కువ వేతనాలకు పనిచేసే తగిన నైపుణ్యం, విద్యార్హత లేని వారిని, ఇతర రాష్ట్రాల వారిని కాంట్రాక్ట్, డైలీవేజ్ ప్రాతిపదికన నియమిస్తున్నాయి. కాలం చెల్లిన రియాక్టర్లు, యంత్రాలను వినియోగించడం తోపాటు వాటికి దగ్గరగా వెల్డింగ్, షోల్డరింగ్ చేయడం, యంత్రాలు, వాల్వులపై పర్యవేక్షణ లేకపోవడం, సిబ్బందికి భద్రతాపరమైన పరికరాలు, తగిన శిక్షణ ఇవ్వకపోవడం, భద్రతా తనిఖీలు జరగకపోవడం పలు రసాయనాలను దగ్గరగా నిల్వచేయడం తదితర కారణాల వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని పలు నివేదికలు ఘోషిస్తు న్నాయి. కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చేసి, తమకు జరిగిన అన్యాయాన్ని,యాజమాన్యా ల దుర్మార్గాన్ని ప్రశ్నించలేని స్థితికి కార్మికులను నెట్టేసిన తీరు పాలకుల నిరంకుశ విధానాలకు నిదర్శనంగా చూడాలి. కార్పొరేట్లకు కొమ్ముకాయడం మాని, సేఫ్టీ వర్క్ లాంటి కార్మిక అనుకూల నినాదాలను తీసుకోవడం తక్షణ అవసరం. కార్మికుల సంక్షేమం ద్వారానే సంస్థలు బలపడాలి తప్ప, కార్మికులను పొట్టన పెట్టుకుని ముందుకు సాగాలన్న విధానాలకు పాతరేయాలి. ముందుగా తెలంగాణ, ఎపిల్లో ఉన్న పారిశ్రామిక వాడల్లో ఎమర్జెన్సీ సేఫ్టీ ఆడిటింగ్ చేపట్టాలి. ఆయా పరిశ్రమల్లో నాణ్యతాపరమైన, భద్రతాపరమైన ఏర్పాట్లు ఉన్నాయా లేదా అన్నది విశ్లేషించాలి. అప్పుడే ప్రమాదాలకు అడ్డుకట్ట వేయగలం.

# ఇవిఎంలపై అనేక అనుమానాలు


- 2024 ఎన్నికలపై అనుమానాలు నివృత్తి చేయండి
- వచ్చే ఎన్నికలు బ్యాలెట్ పద్ధతిలో నిర్వహించండి
- ఇసిని కలిసి అనుమానాలు వెల్లడించిన వైకాపా నేతలు



**న్యూఢిల్లీ :** 2024 ఎన్నికల్లో ఈవీఎంలపై ఎన్నో అనుమానాలు ఉన్నాయని, రానున్న ఎన్నికలు బ్యాలెట్ విధానంలోనే ఎన్నికలు నిర్వహించాలని కేంద్ర ఎన్నికల సంఘంను వైకాపా ఎంపీ వైవీ సుబ్బారెడ్డి కోరారు. ఎన్నికల నిర్వహణపై ఈసీ పునరాలోచించాలన్నారు. సాయంత్రం 6 తర్వాత ఏపీలోని ఎన్నో నియోజకవర్గాల్లో పోలింగ్ శాతం పెరిగిందని, నాలుగు కోట్ల ఓట్లలో 51 లక్షల ఓట్లు సాయంత్రం 7 తర్వాతే పోలయ్యాయన్నారు. సాయంత్రం 6 తర్వాత పెరిగిన ఓట్లపై ఈసీని విచారణ అడిగాం అని వైవీ సుబ్బారెడ్డి చెప్పారు. ఈవీఎంలపై అనుమానాలను వ్యక్తం చేస్తూ ఎంపీలు వైవీ సుబ్బారెడ్డి, మిథున్ రెడ్డిలు ఈసీని కలిశారు. ఈసీ సమావేశం అనంతరం ఎంపీ వైవీ సుబ్బారెడ్డి మీడియాతో మాట్లాడారు. 'ఈవీఎంలపై ఎన్నో అనుమానాలు ఉన్నాయి. రానున్న ఎన్నికలు బ్యాలెట్ విధానం లోనే నిర్వహించాలి. కేంద్ర ఎన్నికల సంఘం ఎన్నికల నిర్వహణపై పునరాలోచించాలి. ఎన్నికల సంఘం పిలుపు మేరకు ఎన్నికల నిర్వహణ, ఈవీఎంలు, ఓటర్ లిస్టుల విషయంలో చర్చ జరిగింది. 2024 ఎన్నికలకు సంబంధించి అనుమానాల నివృత్తిపై సమావేశం నిర్వహించాం. 2024 ఎన్నికల్లో ఈవీఎంల తీరుపై అనుమానాలు ఉన్నాయని, వాటిని నివృత్తి చేయాలని కోరాం. ఈవీఎంలకు, వీవీప్యాట్‌లను కంపారిజన్ చేయమని అడిగాం. బ్యాటరీ చార్జింగ్ విషయంలో కూడా మా అనుమానాలను అడిగాం. పోలింగ్ మొదలైనప్పటి నుంచి చివరి వరకు బ్యాటరీ చార్జింగ్‌లో మార్పులను కూడా ప్రశ్నించాం. సాయంత్రం 6 తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నో నియోజకవర్గాల్లో పోలింగ్ శాతం పెరిగింది. నాలుగు కోట్ల ఓట్లలో 51 లక్షల ఓట్లు సాయంత్రం 7 తర్వాతే పోలయ్యాయి. సాయంత్రం 6 తర్వాత పెరిగిన ఓట్లపై విచారణ అడిగాం. వీవీప్యాట్‌ల విషయంలో కౌంటింగ్ చేయడానికి వీలులేదని ఎన్నికల సంఘం నిర్బంధంగా చెబుతోంది. బ్యాటరీ చార్జింగ్ విషయంలో రీఛార్జిబుల్ బ్యాటరీలు అని చెప్పారు. ఎక్కువ శాతం పెరిగిన ఓట్లపై పరిశీలిస్తామని ఎన్నికల అధికారులు చెప్పారని వైవీ సుబ్బారెడ్డి తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా కొన్ని నియోజకవర్గాల్లో ఓటర్ సంఖ్య గణనీయంగా పెరిగింది. రాయచోటి నియోజకవర్గంలో ఓట్ల సంఖ్య పెరిగింది. ఓటర్స్ డేటా తెప్పించి చూస్తామని చెప్పారు. బీహార్లో లాగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్.. ఆంధ్రప్రదేశ్‌లో చేయడానికి కేంద్ర ఎన్నికల సంఘం ఒప్పుకుంది. ఈవీఎంలపై టెక్నికల్ డౌట్స్ ఉన్నాయని ఆధారాలతో అడిగాం. హిందూపూర్‌లో పోలింగ్ బూతుల వివరాలతో సహా కేంద్ర ఎన్నికల సంఘానికి వివరించాం. క్షుణ్ణంగా పరిశీలిస్తామని చెప్పారు. ఓడిపోయామని ఈవీఎంలపై నేపం చూపెట్టట్లేదు. ప్రాక్టికల్‌గా మా వద్ద ఉన్న ఆధారాలను కేంద్ర ఎన్నికల సంఘం ముందు పెట్టాం. వైసీపీకి పార్లమెంట్లో 472 ఓట్లు వస్తే.. అసెంబ్లీలో ఒక ఓటు మాత్రమే వచ్చింది. కాంగ్రెస్ పార్టీకి పార్లమెంట్లో ఒక ఓటు వస్తే.. అసెంబ్లీకి 464 ఓట్లు వచ్చాయి. టీడీపీకి పార్లమెంట్లో 8 ఓట్లు వస్తే.. అసెంబ్లీకి 95 ఓట్లు వచ్చాయి. ఏపీలో కాంగ్రెస్ పరిస్థితి ఎలా ఉందో అందరికీ తెలుసు. పార్లమెంటుకు అసెంబ్లీకి ఓటింగ్ ప్యాట్రన్లో చాలా వ్యత్యాసం వచ్చింది. ప్రపంచంలో ఉన్న అభివృద్ధి దేశాల్లో యూస్, జర్మనీ, యూరప్ లాంటి దేశాల్లో బ్యాలెట్ ద్వారానే ఎన్నికలు జరుగుతున్నాయి . భారతదేశంలో కూడా పునరాలోచించాలని వైవీ సుబ్బారెడ్డి చెప్పుకొచ్చారు.

# గాజాపై ఇజ్రాయెల్ బీకర దాడులు

(నేటి ప్రభాత సూర్య-జనరల్ డెస్క్)




ఇజ్రాయెల్ ఇంకా తన దారి మార్చుకోలేదు. గాజాపై మరోసారి దాడిచేసింది. దీంతో గాజా మరోసారి రక్తమోడింది. అక్కడ ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడులు, కాల్పుల్లో 100కు పైగా పాలస్తీనియన్లు మరణించారు. వీరిలో అత్యవసర సహాయం కోసం ఎదురు చూస్తున్న 45 మంది కూడా ఉన్నారని గాజా ఆరోగ్య మంత్రిత్వ శాఖ గురువారం తెలిపింది.ఈ దాడులపై ఇజ్రాయెల్ సైన్యం వెంటనే స్పందించలేదు. గాజా స్ట్రిప్‌లోని ప్రజలకు ఆహారం అందించడానికి ఇజ్రాయెల్ మద్దతుతో కొత్తగా ఏర్పాటైన గాజా హ్యుమానిటేరియన్ ఫౌండేషన్ వెలుపల ఐదుగురు చనిపోయారు. సహాయం కోసం వేచి చూస్తున్న మరో 40 మంది గాజా స్ట్రిప్‌లోని ఇతర ప్రాంతాల్లో మరణించారు.గురువారం ఉదయం వరకు జరిగిన వైమానిక దాడుల్లో అనేక మంది మరణించారు. మువాసి ప్రాంతంలో టెంట్లలో ఆశ్రయం పొందుతున్న 15 మంది కూడా మరణించారు. గాజా నగరంలోని ఒక పాఠశాలపై జరిగిన దాడిలో 15 మంది చనిపోయారు. అక్టోబర్ 7, 2023 నుండి గాజాలో మరణించిన పాలస్తీనియన్ల సంఖ్య 57,000 దాటిందని, తప్పిపోయిన వారిలో 223 మందిని చనిపోయినట్లు ప్రకటించారని గాజా ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. మరణించిన వారిలో సగం మంది మహిళలు, పిల్లలేనని పేర్కొంది. అయితే, ఈ లెక్కల్లో పౌరులు, సైనికుల వివరాలు వేర్వేరుగా లేవని తెలిపింది. ఇజ్రాయెల్, హమాస్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరే అవకాశం ఉన్న సమయంలో ఈ మరణాలు సంభవించాయి. చర్చలు సఫలమైతే 21 నెలల యుద్ధానికి ముగింపు పలికే అవకాశం ఉంది. ఇజ్రాయెల్ 60 రోజుల కాల్పుల విరమణకు అంగీకరించిందని, పరిస్థితులు దిగజారకముందే హమాస్ ఈ ఒప్పందాన్ని అంగీకరించాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మంగళవారం అన్నారు. అయితే, యుద్ధం ముగియాలనే డిమాండ్‌ను హమాస్ నొక్కి చెప్పడంతో తాజా ప్రతిపాదన కార్యరూపం దాల్చుతుందా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

# వారసుడి ఎంపిక.. దలైలామా ఇష్టమే

- అందులో ఎవరి జోక్యం కూడా సహించం
- చైనా ప్రకటనకు కేంద్రమంత్రి జవాబు

**న్యూఢిల్లీ :** టిబెట్ బౌద్ధమత అత్యున్నత గురువు దలైలామా వారసుడి ఎంపికకు కచ్చితంగా తమ ఆమోదముద్ర కావాలంటూ చైనా చేసిన డిమాండ్‌ను భారత్ తోసిపుచ్చింది. 15వ దలైలామాను ఎన్నుకునే అధికారం పూర్తిగా ప్రస్తుత దలైలామా చేతుల్లోనే ఉంటుందని, ఆ అధికారం ఇంకెవరికీ లేదని స్పష్టంచేసింది. కేంద్రమంత్రి కిరణ్ రిజిజు ఈమేరకు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 'దలైలామా వారసుడిని నిర్ణయించే అధికారం, అందులో జోక్యం చేసుకొనే హక్కు ఎవరికీ లేదు. ఆ నిర్ణయం పూర్తిగా ఆయన చేతుల్లోనో లేదా ఆ సంస్థ మాత్రమే చేస్తుంది. దలైలామా స్థానం టిబెటన్లకు మాత్రమే కాదు.. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆయన అనుచరులందరికీ ఎంతో ముఖ్యమైనది' అని రిజిజు పేర్కొన్నారు.దలైలామా 90వ పుట్టిన రోజు కార్యక్రమాలు బుధవారం హిమాచల్‌ప్రదేశ్‌లోని ధర్మశాల సుగ్లాగ్‌ఖాంగ్ ఆలయంలో ప్రారంభమయ్యాయి. దీనికి భారత్ తరపున కిరణ్ రిజిజు, జనతాదళ్ (యునైటెడ్) నాయకుడు లల్లన్ సింగ్‌లు హాజరుకానున్నారు. తన వారసుడి ఎంపిక ప్రక్రియ కొనసాగుతుందని బుధవారం దలైలామా సోషల్ మీడియాలో పోస్టు ద్వారా తెలిపారు.భవిష్యత్తు గురువును గాడెన్ ఫోడ్రాంగ్ ట్రస్టు మాత్రమే గుర్తిస్తుందని, మరెవరికీ ఈ విషయంలో జోక్యం చేసుకునే అధికారం లేదని పరోక్షంగా చైనాకు తేల్చి చెప్పారు. ఈ ప్రకటన చేసిన కొన్ని గంటల్లోనే చైనా దీనిపై స్పందించింది. తర్వాత దలైలామా ఎంపికకు తమ ఆమోదముద్ర ఉండాల్సిందేనని డిమాండ్ చేసింది. వారసుడి గుర్తింపు కార్యక్రమాన్ని చైనా విధానాలను అనుసరించి నిర్వహించాలని పేర్కొంది. 1950లో టిబెట్‌ను చైనా ఆక్రమించిన విషయం తెలిసిందే. ఆ తర్వాత నుంచి భారత్‌లోని ధర్మశాలలో దలైలామా ఆశ్రయం పొందుతున్నారు. టిబెట్‌ను గుప్పిట పెట్టుకోవడానికి తమ చెప్పుచేతల్లో ఉండే దలైలామాను వారసుడిగా ఎంపిక చేయాలని బీజింగ్ ఎప్పటినుంచో ప్రయత్నిస్తుంది. చైనా ఎత్తుగడలను గమనించిన దలైలామా వారసుడిని ఎంపిక చేసే ప్రక్రియ తమదేనని తేల్చిచెప్పారు.

# వ్యాక్సిన్‌లపై సిద్ధరామయ్య వ్యాఖ్యలు అసత్యం




**న్యూఢిల్లీ :** హసన్ జిల్లాలో ఇటీవల చోటుచేసుకున్న మరణాలకు కొవిడ్ టీకాల ప్రభావమే కారణం కావొచ్చని కర్ణాటక సీఎం సిద్ధరామయ్య వ్యక్తం చేసిన అనుమానాలను తాజాగా బయోకాన్ చీఫ్ కిరణ్ మంజుదార్ షా తోసిపుచ్చారు. సిద్ధరామయ్య వ్యాఖ్యలపై ఆమె స్పందించారు. సిద్ధరామయ్య అనుమానాలను తోసిపుచ్చిన ఆమె.. సీఎం వ్యాఖ్యలు తప్పుదోవ పట్టించేవిగా ఉన్నాయ న్నారు. 'భారత్‌లో అభివృద్ధి చేసిన కొవిడ్-19 వ్యాక్సిన్‌లు అత్యవసర వినియోగ అధికార చట్టం కింద ఆమోదించడం జరిగింది. భద్రత, సమర్థత కోసం ప్రపంచ ప్రమాణాలకు అనుగుణంగానే ఇది తయారైంది. ఈ వ్యాక్సిన్‌లపై తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేయొద్దని కూడా సూచించారు. ఇవి లక్షల మంది ప్రాణాలను కాపాడాయి. ప్రజలపై దుష్పరిణామాలు సంభవించిన కేసులు చాలా అరుదుగా చోటుచేసుకున్నాయి. ఈ వ్యాక్సిన్లపై నిందలు వేయడం మానేసి దాని అభివృద్ధి వెనక ఉన్న సైన్స్‌ను గుర్తించడం చాలా ముఖ్యం అని ఆమె తెలిపారు. ఇదిలాఉండగా.. యువత ఆకస్మిక మరణాలకు జీవనశైలి, ముందస్తు ఆరోగ్య సమస్యలే కారణం తప్ప, కొవిడ్ వ్యాక్సిన్ కాదని బుధవారం కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ స్పష్టం చేసింది. భారతీయ వైద్య పరిశోధన మండలి (ఐసీఎంఆర్), ఢిల్లీ ఎయిమ్స్ నిర్వహించిన అధ్యయనాల్లో ఈ విషయం తేలిందని పేర్కొంది. దేశీయంగా తయారైన కొవిడ్ వ్యాక్సిన్లు సురక్షితంగా, సమర్థంగా పనిచేస్తున్నాయని, తీవ్ర దుష్పరిణామాలు సంభవించిన ఉదంతాలు అత్యంత అరుదుగా కనిపించాయని ఐసీఎంఆర్, జాతీయ రోగ నియంత్రణ కేంద్రం (ఎన్‌సీడీసీ) అధ్యయనాలు వెల్లడించినట్లు వివరించింది. అయితే గత నెలలో హసన్ జిల్లాలో గుండెపోటుతో 20 మందికి పైగా మరణించడంపై సిద్ధరామయ్య ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మరణాలకు కచ్చితమైన కారణాన్ని గుర్తించి పరిష్కారాలు కనుగొనేందుకు ఒక కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పది రోజుల్లో దీనిపై నివేదిక సమర్పించాలని ఆదేశించారు. కొవిడ్ వ్యాక్సిన్లను ప్రజలకు తొందరపాటుగా ఆమోదించడం, పంపిణీ చేయడం కూడా మరణాలకు కారణం కావొచ్చని అనుమానం వ్యక్తంచేశారు. ఇటీవల పలు అధ్యయనాలు ఈ వ్యాక్సిన్లతో గుండెపోటు పెరుగుదలకు కారణమవుతాయని వెల్లడించాయన్నారు. దీనిపై కూడా సమగ్ర అధ్యయనం చేయాలని కమిటీని ఆదేశించినట్లు తెలిపారు.

# అలా మరణిస్తే బీమా చెల్లించక్కర్లేదు

## సుప్రీంకోర్టు సంచలన తీర్పు

(నేటి ప్రభాత సూర్య-జనరల్ డెస్క్)

నిర్లక్ష్యంగా వాహనం నడిపి ప్రమాదానికి కారణమైతే బీమా పరిహారం చెల్లించాల్సిన అవసరం లేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. రవీష్ అనే వ్యక్తి అతివేగంగా వాహనం నడుపుతూ మరణించగా అతడి కుటుంబం బీమా పరిహారం కోసం కోర్టులో పిటిషన్ వేసింది. కానీ, పరిహారం చెల్లించేందుకు కోర్టు నిరాకరించింది. ప్రమాదం మృతుడి నిర్లక్ష్యం వల్లే జరిగిందని తేల్చింది. బీమా పాలసీలో కవరేజ్ ఉన్నప్పటికీ, నిర్లక్ష్యంగా నడిపితే పరిహారం పొందలేరని కోర్టు తేల్చి చెప్పింది. ప్రమాదంలో మరణించిన వ్యక్తికి రూ.80 లక్షలు చెల్లించాలంటూ బీమా కంపెనీపై దాఖలైన పిటిషన్ విచారణలో సుప్రీంకోర్టు ఈ మేరకు తీర్పు చెప్పింది. ఇదిలావుంటే. జూన్ 2014 జూన్లో కర్ణాటకకు చెందిన రవీష్ అనే కాంట్రాక్టర్, అతి వేగంగా, నిర్లక్ష్యంతో కారు నడిపి ప్రాణాలు కోల్పోయాడు. దీంతో బీమా కోసం అతడి కుటుంబం ఇన్సూరెన్స్ కంపెనీని సంప్రదించి.. బీమా చెల్లించాలని కోరింది. రవీష్ నెలకు రూ.3 లక్షలు సంపాదించేవాడని, కానీ అతడు మరణంతో కుటుంబం ఆర్థికంగా నష్టపోయిందని, తమకు రూ.80 లక్షలు బీమా చెల్లించాలని డిమాండ్ చేసింది. అయితే, అందుకు బీమా సంస్థ నిరాకరించడంతో కర్ణాటక హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ చేపట్టిన కర్ణాటక హైకోర్టు.. రవిషా నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదం జరిగినట్టు తేల్చింది. ట్రాఫిక్ నిబంధనలు పాటించలేదని నిర్ధారించింది. దీంతో నిర్లక్ష్యంగా వాహనం నడిపి మరణిస్తే, వారి కుటుంబ సభ్యులు ఇన్సూరెన్స్ క్లెయిమ్ చేసుకోలేరంటూ తీర్పు వెలువరించింది. ఈ నేపథ్యంలో బాధిత కుటుంబం హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. కానీ, అక్కడ కూడా వారికి చుక్కెదురయ్యింది. రవిషా కుటుంబం పిటిషన్‌పై న్యాయమూర్తులు జస్టిస్ పీఎస్ నరసింహా, ఆర్ మహాదేవన్లతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది.




# అమెరికాలో మళ్లీ కాల్పుల కలకలం

## దుండగుల కాల్పుల్లో నలుగురు హతం



**న్యూయార్క్ :** అమెరికాలో మళ్లీ కాల్పుల కలకలం రేగింది. బుధవారం చికాగోలోని రివర్ నార్త్ ప్రాంతంలోగల ఆర్టిస్ లాంజ్ అనే నైట్ క్లబ్ వద్ద కొందరు గుర్తు తెలియని వ్యక్తులు కాల్పులకు తెగబడ్డారు. ఈ ఘటనలో నలుగురు మృతి చెందగా సుమారు 14 మంది గాయపడ్డారు. రాత్రి సుమారు 11 గంటల సమయంలో వాహనంలో క్లబ్ ముందు నుంచి వెళ్లిన కొందరు అక్కడున్న జనాలపై కాల్పులు జరిపి పారిపోయారు. ఈ ఘటనలో నలుగురు మృతి చెందినట్టు చికాగో పోలీసులు ధ్రువీకరించారు. సుమారు 25 ఏళ్ల వయసున్న ఇద్దరు యువకులు, మరో ఇద్దరు యువతులు మృతిచెందినట్టు తెలిపారు. గాయపడ్డ వారిని వెంటనే ఆసుపత్రికి తరలించారు. వీరిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్టు పోలీసులు చెప్పారు. ఈ ఘటనకు సంబంధించి ఇంకా ఎవరినీ అరెస్టు చేయలేదని పోలీసులు తెలిపారు. నిందితుల కోసం విస్తృతంగా గాలిస్తున్నామని అన్నారు. అనుమానితుల సమాచారం తెలిసిన వారు వెంటనే తమను సంప్రదించాలని కూడా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఇక కాల్పులకు కారణమేంటో కూడా ఇంకా తెలియరాలేదు. అసలు ఏం జరిగిందో తెలుసుకునేందుకు పోలీసులు ఘటనాస్థలం సమీపంలోని సీసీటీవీ కెమెరాల ఫుటేజీని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ప్రత్యక్ష సాక్షుల కథనాల ఆధారంగా ఘటన మూలాలను తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇక నైట్‌లైఫ్‌కు ప్రసిద్ధి గాంచిన రివర్ నార్త్ ప్రాంతంలో తాజా కాల్పుల ఘటన కలకలానికి దారి తీసింది. నగరంలో పెరుగుతున్న గన్ కల్చర్‌పై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# మాలిలో ముగ్గురు భారతీయులు కిడ్నాప్

**న్యూఢిల్లీ :** మాలిలో ముగ్గురు భారతీయులు కిడ్నాప్‌కు గురయ్యారు. ఈ విషయాన్ని భారత విదేశాంగశాఖ గురువారం ధ్రువీకరించింది. పశ్చిమ మాలిలోని కాయెస్ ప్రాంతంలోని డైమెండ్ సిమెంటు ఫ్యాక్టరీలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈనెల 1న ఈ ప్రాంతంలో సాయుధ దుండగులు దాడి చేసి.. అక్కడి కార్మికులను బందీలుగా తీసుకెళ్లారు. వారిలో భారత్‌కు చెందిన ముగ్గురు కార్మికులు ఉన్నారు. అల్‌ఖైదా అనుబంధ సంస్థ జమాత్ నుస్రత్ అల్ ఇస్లాం వాల్ ముస్లిమిన్ ఈ దాడిని తామే చేశామని ప్రకటించింది. కిడ్నాప్‌కు గురయిన వారి వివరాలను విదేశాంగశాఖ వెల్లడించలేదు. మాలి రాజధాని బమాకోలోని భారత రాయబార కార్యాలయం స్థానిక అధికారులు, పరిశ్రమ యాజమాన్యంతో నిరంతరం సంప్రదింపులు జరుపుతుందని విదేశాంగశాఖ తెలిపింది. ఘటనను భారత్ తీవ్రంగా ఖండించింది. బందీలను సురక్షితంగా, త్వరగా విడుదల చేయడానికి మాలీ ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరింది. ఈసందర్భంగా మాలిలోని భారతీయ పౌరులందరూ అప్రమత్తంగా ఉండాలని పేర్కొంది. సాయం కోసం మన రాయబార కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించింది.



## హామీలన్నీ అందుతున్నాయనడం అవివేకం



**ప్రొద్దుటూరు నేటి ప్రభాత సూర్య జూలై 3 :**
కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అయ్యింది కానీ ఇచ్చిన హామీలను అమలు చేయకపోగా అన్నీ ఇచ్చేశాం అనడం ప్రజలను మోసగించడమే అని మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివ ప్రసాద్ రెడ్డి తెలిపారు. గురువారం ఉదయం ఆయన నివాసం లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సుపరిపాలన లో తొలి అడుగు పేరిట ఇంటింటికీ తిరిగే తెలుగు దేశం పార్టీ నాయకులకు పలు సవాళ్లు విసిరారు. ఇచ్చిన హామీలలో పింఛన్ మాత్రమే సజావుగా ఇస్తున్నారని ఈ విషయంలో అభినందిస్తున్నానన్నారు. గ్యాస్ సిలిండర్ పథకం కూడా 30 శాతం మందికి మాత్రమే వచ్చిందన్నారు. ఇంకా రైతు భరోసా, మహిళలకు ఉచిత బస్సు ఇవ్వకపోయినా అమలు చేస్తున్నామని తెలుగు దేశం పార్టీ నాయకులు చెప్పుకోవడం సిగ్గుచేటు అన్నారు. ఎన్నికల ముందు ఇటువంటి అబద్దాలు, మోస పూరితమైన మాటలు ప్రజలకు నమ్మబలికి నా ఓటమికి కారణమయ్యారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇది చంద్రబాబు కు తొలి అడుగు కాదని ఇదే చివరి అడుగులని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ లక్ష్మి దేవి, కౌన్సిలర్ లు సత్యం, అరుణ, సుబ్బారెడ్డి, వంశీధర్ రెడ్డి, పోరెడ్డి నరసింహా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న కడప ప్రొద్దుటూరు ఎంఈఓలోను సస్పెండ్ చేయాలి

**జిల్లా విద్యాశాఖ అధికారి డీఈవో శంషుద్దీన్‌కు వినతి**




**కడప బ్యూరో నేటి ప్రభాత సూర్య జూలై 3:**
ప్రొద్దుటూరు మండల విద్యాశాఖ అధికారిణి ఎంఈఓ సావిత్రి, కడప మండల విద్యాశాఖ అధికారి ఎంఈఓ గంగిరెడ్డిలు అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారని విచారణ జరిపి సస్పెండ్ చేయాలని కోరుతూ గురువారం పిడియస్ యు ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖధికారి డీఈఓ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టి అనంతరం జిల్లా విద్యాశాఖ అధికారి డిఇఓ శంషుద్దీన్ కు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా పిడిఎస్ యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.అంకన్న మాట్లాడుతూ ప్రొద్దుటూరు ఎంఈఓ సావిత్రి, కడప ఎంఈఓ గంగిరెడ్డిలు కార్పొరేట్ ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలకు తొత్తుగా మారిపోయారని అందుకే ప్రొద్దుటూరు పట్టణం కడప నగరంలో ప్లే స్కూల్స్ అనుమతి లేకపోయినప్పటికీ అనధికారికంగా అనుమతులు మంజూరు చేస్తూ ప్రతినెల మామూలు తీసుకుంటున్నారని, కొత్తగా కార్పొరేట్,ప్రైవేట్ ప్రాథమిక పాఠశాలల అనుమతి విషయంలో లక్షలాది రూపాయలు తీసుకొని కనీస సౌకర్యాలు లేకుండా యాజమాన్యాల దగ్గర లక్షల రూపాయలు తీసుకొని వాళ్లకు మంజూరు చేశారన్నారు, మరో వైపు ఫీజుల దోపిడీకి గురి చేస్తున్న కార్పొరేట్ ప్రైవేట్ పాఠశాలలు ఏ రోజు కూడా ఆకస్మిక తనిఖీ చేసిన దాఖలు లేవన్నారు. ఏదైనా కార్పొరేట్ ప్రైవేట్ పాఠశాలల విషయంలో ఎంఈఓలకు ఫిర్యాదు చేస్తే వారికి అన్ని సౌకర్యాలు ఉన్నట్లు తెలుపుతున్నారని, ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ కోసం వాళ్లు కృషి చేయడం లేదని అందుకు నిదర్శనమే ఇటీవల ఉపాధ్యాయుల బదిలీల కౌన్సిలింగ్ లో లక్షలాది రూపా యలు తీసుకొని నిబంధనలకు విరుద్ధంగా ప్రిఫరెన్షియల్ కేటగిరిలో కేటాయించాల్సిన స్థానాల కంటే అధికంగా కేటాయించడం వల్ల జనరల్ కేటగిరి లో ఉన్న ఉపాధ్యా యులకు తీవ్ర అన్యాయం చేశారనిమండిపడ్డారు.పాఠశాల విద్యాశాఖ ఆర్జెడి శామ్యూ ల్ స్పందించకపోవడం వెనక ఆంతర్యం ఏమిటని వారు ప్రశ్నించారు ఈ అంశాలన్నీ విచారణ జరిపి ప్రొద్దుటూరు, కడప ఎంఈఓ సావిత్రి, గంగిరెడ్డిలను సస్పెండ్ చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పిడియస్ యు జిల్లా నాయకుడు మహేష్,పిడియస్ యు నగర నాయకులు కార్తీక్, యశ్వంత్, జోసెఫ్ ఆకాష్ కుమార్, అబూబకర్ సిద్ధిక్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలి

**- సంక్షేమ వసతి గృహాలను తనిఖీ చేసిన ఎస్సీఈడీ చాతరాజుల దుర్గాప్రసాద్**



**మందమర్రి.నేటి ప్రభాత సూర్య ప్రతినిధి జులై 3.**
తెలంగాణ సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో ఉంటూ చదువుకుంటున్న విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని సాంఘీక సంక్షేమ శాఖ ఈడి చాతరాజుల దుర్గాప్రసాద్ అన్నారు. మందమర్రి పట్టణంలోని పాత బస్టాండ్ లో గల సాంఘిక సంక్షేమ బాలికల కళాశాల వసతి గృహాన్ని, భాగ్యనగర్ కాలనీలో గల సాంఘిక సంక్షేమ బాలుర కళాశాల వసతి గృహాన్ని, శ్రీపతి నగర్ లో గల సాంఘిక సంక్షేమ బాలుర పాఠశాల వసతి గృహాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరు రికార్డులను, విద్యార్థులకు అందిస్తున్న భోజన వివరాలను ఆయన పరిశీలించారు. సంక్షేమ వసతి గృహాలలో చదువుకునే విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలను అందించాల్సిన బాధ్యత హాస్టల్ వార్డెన్ లదేనని తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని  వంట గది, హాస్టల్ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని విద్యార్థులకు ఆరోగ్యపరంగా ఎలాంటి ఇబ్బందులు కలగవద్దని ఆయన సూచించారు. నిత్యం విద్యార్థులతో మమేకమై వారి బాగోగులు చూడాలని అన్నారు. వీరి వెంట ఏ.ఎస్.ఓ రవీందర్, వార్డెన్ లు తిరుమల, కిషోర్, శ్రీనివాస్ లు ఉన్నారు.

## స్వాతంత్ర్యోద్యమ కాలం నాటి పాఠశాల శ్రీ పాండురంగ విద్యాలయం మూత






**గుంటూరు నేటి ప్రభాత సూర్య జూలై 3:**
స్వాతంత్ర్యోద్యమ కాలంలో 1938 సంవత్సరంలో గుంటూరు 6/5 బ్రాడీపేటలో దివంగత కొండపాలూరి లక్ష్మీనరసింహారావు స్థాపించిన ఎయిడెడ్ పాఠశాల శ్రీ పాండురంగ విద్యాలయం మూతపడింది. గడచిన 87 ఏళ్ల కాలంలో ఈ పాఠశాల వేలాది మంది బాలబాలికలను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దింది. వయో వృద్ధ భారంతో ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగలేక అన్నింటిమించి తగినంత మంది విద్యార్థులు లేక ప్రస్తుతం ఉన్న సిబ్బంది విద్యార్థులను విద్యాశాఖకు అప్పగించడం జరిగిందని పాఠశాల కరెస్పాండెంట్ మేనేజర్ కెఎస్‌బి తిలక్ తెలిపారు. వీరు గతంలో 20 ఏళ్ల పాటు ఆంధ్రపత్రిక లో సబ్ ఎడిటర్ గా పని చేశారని వీరి మేనమామ భద్రరాజు కృష్ణమూర్తి హైదరాబాద్ సెంట్రల్ వర్సిటీ లో సుదీర్ఘ కాలం వైస్ ఛాన్సలర్‌గా పని చేశారని ఆ విద్యాసంస్థ తో నాలుగు దశాబ్దాలు పైగా సాన్నిహిత్యం కల్గిన సీనియర్ జర్నలిస్ట్ నిమ్మరాజు చలపతిరావు తెలిపారు. ఆంధ్రపత్రిక లో పనిచేస్తూనే 1984 - 86 మధ్య కాలంలో ప్రకాశం జిల్లా మొగిలిచర్ల జిల్లా పరిషత్ హైస్కూల్ లో తెలుగు పండిట్ గా పని చేసిన తనకు ప్రభుత్వ, ఎయిడెడ్, అన్ ఎయిడెడ్ విద్యా సంస్థల పని తీరు, స్థితిగతులు తనకు బాగా తెలుసని ఈ సందర్భంగా నిమ్మరాజు తెలిపారు. ప్రస్తుత పోటీతత్వాన్ని ఎదుర్కోలేక క్రమేణ మూత బడుతున్నాయని అన్నారు. ప్రధానంగా ఏళ్ల తరబడి సిబ్బంది ఖాళీల భర్తీ లేకపోగా కనీసం మెయింటెనన్స్ ఖర్చులు కూడా ప్రభుత్వం ఇవ్వడం లేదన్నారు.

## 303వ రక్త దానం శిబిరం విజయవంతం

**రక్త కొరత లేని సమాజం నిర్మిచాలి**

**రక్త దానము చెయ్యండి ప్రాణాలు కాపాడండి**

**హెల్పింగ్ హాండ్స్ బ్లడ్ ఆర్గనైజషన్**

**నేషనల్ బ్లడ్ ప్రమోటర్**

**డాక్టర్ సయ్యద్ మైనుద్దీన్**



**రాయచోటి నేటి ప్రభాత సూర్య జూలై 3:**
ప్రాణాపాయ స్థితిలో వున్న వారికి స్వచ్ఛందంగా రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని డాక్టర్ సయ్యద్ మైనుద్దీన్ తెలిపారు. అన్నమయ్య జిల్లా రాయచోటి పట్టణం దీపా బ్లడ్ బ్యాంక్ నందు రాయచోటి కి చెందిన యువత ఆధ్వర్యంలో రక్తదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ సయ్యద్ మైనుద్దీన్ ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. వారికి నిర్వహకులు ఘనస్వాగతం పలికి ఘనంగా సన్మానించారు. అనంతరం రక్తం నిల్వలు తదితర అంశాలపై దీప బ్లడ్ బ్యాంక్ నిర్వాహకులను అడిగి తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంతో మందికి సరైన సమయాలలో రక్తం దొరకక అవస్థలు పడుతూ ప్రాణాలు కోల్పోవాల్సిన దుస్థితి ఉందన్నారు. ఇటువంటి సందర్భంలో ఎంతో మంది యువకులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయడం చాలా హర్షణీయమన్నారు. అదే విధంగా బ్లడ్ బ్యాంక్ ఏర్పాటు చేసి రక్తాన్ని నిల్వ ఉంచి అవసరం అయ్యే వారికి రక్తం అందజేస్తున్న బ్లడ్ బ్యాంక్ వారిని సంస్థ ప్రతి నిధులు అభినందనలు తెలిపారు. 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరూ రక్తదానం చేయవచ్చన్నారు. రక్తం దానం చేయడం వల్ల ఇంకా ఆరోగ్యవంతులుగా ఉంటారన్నారు ఇటువంటి సేవా కార్యక్రమాలు చేసి ప్రజల మన్ననలను పొందాలని వారు ఆకాక్షించారు. ఈకార్యక్రమంలో ప్రముఖ సంఘ సేవకులు డాక్టర్ సయ్యద్ మైనుద్దీన్, అమానత్ సంస్థ ప్రెసిడెంట్ షైక్ అతాఉల్లా షాబుద్దీన్, మహమ్మద్, షైక్ అజ్జాస్, సమీర్, సమీర్  తదితరులు పాల్గొన్నారు.

## తరగతులు నిర్వహించకున్న బి.ఎడ్, లా పరీక్షలా!

**ఆర్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు డి. యం. ఓబులేసు యాదవ్**




**కడప నేటి ప్రభాత సూర్య జూలై 3:**
యోగివేమన విశ్వవిద్యాలయం పరిధిలో తరగతులు నిర్వహణ లేకుండానే, ప్రస్తుతం జరిగే బి.ఎడ్, లా పరీక్షలను బాగా నిర్వహిస్తున్నామని వైవియు రిజిస్ట్రార్ పద్మా , అధికారులు పరీక్ష కేంద్రాలను పర్యవేక్షణ చేస్తుండడం హాస్యాస్పదంగా ఉందని ఆర్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు డి.యం. ఓబులేసు యాదవ్ అన్నారు. గురువారం ఆర్ ఎస్ ఎఫ్ ఆఫీస్‌లో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ వైవియు పరిధిలోని బి. ఎడ్, లా కళాశాలలు ఏ ఒక్కటి కూడా అధ్యాపకులు లేకుండా, లైబ్రరీ లు లేకుండా, బి. ఎడ్ ల్యాబ్ లు, తరగతి గదులు లేకుండా, అసలు కొన్ని బి. ఎడ్ కళాశాలకు అయితే బిల్డింగ్ లు కూడా వుండవు, ఇక కొన్ని కళాశాలలైతే యూనివర్సిటీ రికార్డు ల్లో మాత్రమే బి. ఎడ్ కళాశాల పేర్లు ఉంటాయి, కనీసం కాలేజీ ల పేర్లు గల బోర్డులు కూడా ఉండవన్నారు. కానీ ఆయా బి. ఎడ్ కళాశాలలు ఏదొక రూముల్లో రికార్డులు పెట్టుకొని, అడ్మిషన్స్ సమయంలో విద్యార్థుల సర్టిఫికెట్స్ పెట్టుకొని వారితో భారీ ఫీజులు వసూల్ చేసుకొని పరీక్షల సమయంలో మాత్రమే వైవియు అధికారులతో  మిలాకత్ అయ్యి హాల్ టికెట్స్ జారీ చేసుకొని విద్యార్థులకు పరీక్షలను అనుమతిస్తున్నారు. అదే విధంగా బసవతారక లా కళాశాల, బసిరెడ్డి లా కళాశాలలలో కూడా అధ్యాపకులు వుండరు, తరగతులు నిర్వహించరు, కానీ  అడ్మిషన్స్ సమయంలో  లా విధార్థులతో భారీగా ఫీజుల దోపిడీ చేస్తున్నారన్నారు. ఇవన్నీ వైవియు అధికారులకు కనపడవా అని వారు ప్రశ్నించారు. తరగతులే నిర్వహించని కళాశాల విద్యార్థులను ఎలా పరీక్షలకు అనుమతిస్తారు, ఇంకా దారుణ్ణంగా పరీక్షలను వర్సిటీ రిజిస్ట్రార్ పద్మ కంట్రోలర్ అఫ్ ఎగ్జామ్స్ కృష్ణారావు దగ్గరుండి ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. వీటి పై ఆర్ ఎస్ ఎఫ్ ఆందోళన చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎఫ్ నాయకులు సిద్ధిక్, సల్మాన్, సాయి, శివ తదితరులు పాల్గొన్నారు.

## రైతులు పప్పు ధాన్యాల పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలి

**- ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ.**

**- కంది విత్తనాలు, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ**





**గన్నేరువరం– నేటి ప్రభాత సూర్య:**
రైతులు పప్పు ధాన్యాల పంటలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి వర్షాధార పంటలైన అపరాలను పండించాలని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ రైతులకు సూచించారు. గురువారం మండల కేంద్రంలోని రైతు వేదికలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు, కంది విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంప్రదాయమైన వారి పంట సాగుతూ భూములు బురదమయం అవుతున్నాయని, అప్పుడప్పుడు కొంత భాగం అపరాల పంటకు కేటాయించి ఇంటి అవసరాలు తీర్చుకోవాలని రైతులకు సూచించారు . ముఖ్యమంత్రి సహాయ నిధి నిరుపేదలకు వరం అని ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమానికి కృషి చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి కే. భాగ్యలక్ష్మి, ఏవో కిరణ్ మై, మార్కెట్ కమిటీ చైర్మన్ పులి కృష్ణ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముసుకు ఉపేందర్ రెడ్డి, యువజన కాంగ్రెస్ నాయకులు అల్లూరు శ్రీనాథ్ రెడ్డి, డైరెక్టర్లు ఒడ్నాల నరసయ్య, మాతంగి అనిల్, నాయకులు బొడ్డు సునీల్, దుడ్డు మల్లేశం, బుర్ర తిరుపతి  మార్గం మల్లేశం అధిక సంఖ్యలో కాంగ్రెస్ శ్రేణులు, రైతులు, సీఎం రిలీఫ్ ఫండ్ లబ్ధిదారులు పాల్గొన్నారు.

## చెన్నూరు పట్టణంలో పోలీసుల ఆకస్మిక వాహన తనిఖీలు



**మంచిర్యాల జిల్లా నేటి ప్రభాత సూర్య. ప్రతినిధి జులై 3.:**
చెన్నూరు పట్టణంలో గురువారం పోలీసులు ఆకస్మికంగా వాహన తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో సరైన ధ్రువ పత్రాలు లేకుండా తిరుగుతున్న వాహనాలను పోలీసులు సీజ్ చేసి స్టేషన్కు తరలించారు. ఈ సందర్భంగా చెన్నూరు సీఐ దేవేందర్ రావు మాట్లాడుతూ, వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. వాహనాలు నడిపేటప్పుడు డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీ, ఇన్సూరెన్స్, పొల్యూషన్ సర్టిఫికెట్ వంటి అవసరమైన పత్రాలు తప్పనిసరిగా కలిగి ఉండాలని హెచ్చరించారు. ప్రజల భద్రత కోసమే ఈ తనిఖీలు నిర్వహిస్తున్నామని, నిబంధనలు అతిక్రమించిన వారిపై చర్యలు తప్పవని అన్నారు.

## వర్షాకాల సీజన్‌కు సరిపడా ఎరువులు అందుబాటులో ఉన్నాయి

**జిల్లా వ్యవసాయ అధికారి కే భాగ్యలక్ష్మి**

**మండలంలోని ఎరువుల దుకాణాలు తనిఖీ**





**గన్నేరువరం– నేటి ప్రభాత సూర్య:**
కరీంనగర్ జిల్లా రైతులందరికీ వర్షాకాల సీజన్కు సరిపడే ఎరువులు అందుబాటులో ఉన్నాయని జిల్లా వ్యవసాయ అధికారి కే భాగ్యలక్ష్మి అన్నారు. గురువారం మండలంలోని వివిధ గ్రామాల లో నిర్వహిస్తున్న ఎరువుల దుకాణాలను ఏవో కిరణ్ మై తో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 12 వేల 43 మెట్రిక్ టన్నుల యూరియా, 2325 మెట్రిక్ టన్నుల డిఏపి, 34 86 మెట్రిక్ టన్నుల ఎన్ఓపి, 28,993 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువులు నిల్వ ఉన్నాయని అన్నారు. రైతులు తగిన మోతాదులో ఎరులను ఉపయోగించాలని, నానో యూరియా వినియోగంతో మంచి ఫలితాలు ఉంటాయని సూచించారు. విచ్చలవిడిగా రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి భూసారని కాపాడాలని అన్నారు. వీరి వెంట మండల వ్యవసాయ అధికారులు ఉన్నారు.

## మాజీ ప్రభుత్వ విప్ నల్లాల ఓదెలును పరామర్శించిన బిజెపి జిల్లా అధ్యక్షుడు



**మంచిర్యాల జిల్లానేటి ప్రభాత సూర్య. ప్రతినిధి జులై 3:**
మందమర్రి పట్టణంలో గల మాజీ ప్రభుత్వ విప్ నల్లాల ఓదెలు. ఇటీవల అనారోగ్యానికి గురైన చెన్నూరు మాజీ శాసనసభ సభ్యులు నల్లాల ఓదెలుని  గురువారం నాడు. వారి స్వగృహానికి వెళ్లి  మర్యాదపూర్వకంగా పరామర్శించిన బిజెపి మంచిర్యాల జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర గౌడ్  మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి అందుగుల శ్రీనివాస్  సీనియర్ నాయకులు దీవి దీక్షితులు  దేవర నేని సంజీవ రావు  మందమరి పట్టణ అధ్యక్షులు సప్పిడి  నరేష్  గిర్నాటి జనార్ధన్ ధారా రవి సాగర్ ఉపాధ్యక్షులు శనిగారపు శ్రీనివాస్ సంతోష్ సత్యంబాబు  ఆయనను పరామర్శించడం జరిగింది.

## హమనంతపల్లిలో ఘనంగా పోచమ్మ బోనాలు



**మంచిర్యాల జిల్లా నేటి ప్రభాత సూర్య ప్రతినిధి. జులై 3:**
లక్షెటిపేట మండలంలోని హమనంతపల్లి గ్రామంలో గురువారం పోచమ్మ బోనాలను గ్రామస్థులు ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పోచమ్మ ఆలయం నిర్మించి 12 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి, దేవతకు బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా మహిళలు రంగురంగుల బోనాలతో ఊరంతా ఊరేగింపు నిర్వహించగా, చిన్నా పెద్దా అందరూ ఉత్సాహంగా పాల్గొన్నారు. పాడి పంటలు పుష్కలంగా పండాలి, గ్రామస్థులందరూ ఆరోగ్యంగా సుఖసంతోషాలతో ఉండాలని కోరుతూ మొక్కులు చెల్లించారు. కుల మతాలకతీతంగా గ్రామస్థులందరూ ఈ బోనాల ఉత్సవంలో పాల్గొనడం విశేషం. గ్రామీణ సంస్కృతికి ప్రతిరూపంగా నిలిచే ఈ ఉత్సవం గ్రామంలో ఆనందాన్ని నింపిందని గ్రామ పెద్దలు తెలిపారు.

## బీఎస్పీ బలోపేతానికి కొత్త చేరికలు



**మందమర్రి నెటి ప్రభాత సూర్య. ప్రతినిధి :**
పట్టణంలో బహుజన సమాజ్ పార్టీ శక్తివంతంగా విస్తరిస్తోంది. పట్టణ అధ్యక్షుడు శంకర్ ఆధ్వర్యంలో గురువారం పలువురు కొత్త వారు బీఎస్పీలో చేరారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, సభ్యులను కండువాలు కప్పి పార్టీలోకి  ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బీఎస్పీని మండల స్థాయి నుంచి గ్రామ స్థాయికి విస్తరించాలని, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎక్కువ స్థానాలు గెలవడమే లక్ష్యంగా పార్టీ కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. పార్టీలో చేరిన వారంతా కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొనాలని సూచించారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం

- ఎల్ఓసి అందచేసిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్
- కృతజ్ఞతలు తెలిపిన లబ్ధిదారులు తోట అనిత



**షాద్ నగర్ నేటి ప్రభాత సూర్య జోన్ ఇంచార్జ్ (జూలై03):** షాద్ నగర్ నియోజకవర్గంలోని నందిగామ మండలం రంగాపూర్ గ్రామానికి చెందిన తోట అనితకు గురువారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ముఖ్యమంత్రి సహాయనిధి ద్వార మంజూరైన ఎల్ఓసిని అందజేశారు. కష్టకాలంలో ఆదుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి, సహకరించన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కి లబ్ధిదారులు మహిళ తోట అనిత ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జంగ నర్సింలు, మాజీ ఎంపీటీసీ దేపల్లె కుమార్ గౌడ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు నవపేట్ రవీందర్ గౌడ్, జింకల జంగయ్య యాదవ్, రంగాపూర్ కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఆకుల జ్ఞానేశ్వర్, మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు పాత్లావత్ శ్రీనునాయక్, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్ రావుకు శుభాకాంక్షలు

బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి



**షాద్ నగర్ నేటి ప్రభాత సూర్య జోన్ ఇంచార్జ్ (జూలై 03):** బిజెపి రాష్ట్ర అధ్యక్షులుగా నూతనంగా ఎన్నికైన సందర్భంగా రాంచందర్ రావు ని హైదరాబాదులోని తార్నాకలో వారి స్వగృహంలో కలిసి షాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేసిన బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి బిజెపి రాష్ట్ర అధ్యక్షులు శ్రీ రాంచందర్ రావు విష్ణువర్ధన్ రెడ్డి గారిని ఆత్మీయ ఆలిం గనం చేసుకొని పలకరించడం జరిగింది. విష్ణువర్ధన్ రెడ్డితో పాటు బిజెపి సీనియర్ నాయకులు విజయ్ బాస్కర్, ఇస్నాతి శ్రీనివాస్, మోహన్ సింగ్, పసుల నర్సింహా యాదవ్, చేగు సుధాకర్ అప్ప, బల్వంత్ రెడ్డి, మల్ రెడ్డి మహేందర్ రెడ్డి, కొత్తూరు, చౌదరి గూడ మండల అధ్యక్షులు అత్తాపురం మహేందర్ రెడ్డి, ఏదిర రాజు,శ్యామ్ సుందర్ రెడ్డి, రంగన్న గౌడ్, కరెడ్ల నరేందర్ రెడ్డి, బోయ అశోక్, కుమ్మరి మహేష్, అనిల్ కుమార్ గౌడ్, సుదీర్ పటేల్, గణేష్ నాయక్, భక్త వత్సల్ , చౌదం శ్రీనివాస్, రాజు నాయక్, తదితరులు ఉన్నారు.



## ఇబ్రహీంపట్నం కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్ష పదవికి నామినేషన్

**ఇబ్రహీంపట్నం- నేటి ప్రభాత సూర్య,జోన్ ఇన్చార్జ్ (జూన్ 3)**



ఇబ్రహీంపట్నం కాంగ్రెస్ పార్టీ మండల నూతన అధ్యక్ష పదవికి నామినేషన్ వెసిన ఇబ్రహీంపట్నం మండల్ వర్కింగ్ ప్రెసిడెంట్ కోడూరి రమేష్. ఇబ్రహీంపట్నం మండల అధ్యక్ష పదవికి పోటీ చేస్తున్న రమేష్ నామినేషన్ పత్రాలు ఏ బ్లాక్ అధ్యక్షులు పాండురంగారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్ రెడ్డి,పీసీసీ సభ్యులు, మాజీ జడ్పీటీసీ భూపతి గళ్ళ మహిపాల్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మంకాల కరుణాకర్ కు నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. ఈ సందర్బంగా ఇబ్రహీంపట్నం మండల్ వర్కింగ్ ప్రెసిడెంట్ కోడూరి రమేష్ మాట్లాడుతూ ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మాల్ రెడ్డి రంగారెడ్డి నా మీద నమ్మకం తో ఇబ్రహీంపట్నం మండల్ వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి ఇస్తే నమ్మకం తో బాధ్యతతో నిర్వర్తించాలని అని ఇప్పుడు కూడా ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు నా మీద నమ్మకం తో నాకు మండల అధ్యక్ష పదవి ఇస్తే మండల్ లో కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో వుంటానని ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలు ప్రజల్లో కి తీసుకెళ్తానని కాంగ్రెస్ పార్టీలో చేరిన తరువాత కాంగ్రెస్ పర్టీ అభివృద్ధికి కృషి చేశానని అన్నారు.ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ప్రజలకు ఏ సమస్య లు వున్నా ఎమ్మెల్యే రంగన్న సహకారం తో పరిష్కారం చేయడం జరిగింది. నా మీద నమ్మకం తో మండల అధ్యక్ష బాధ్యతలు అప్పగించాలి అని రమేష్ కోరారు .

## కదం తొక్కిన ఫార్మా రైతులు

- ● ఫార్మా రైతులకు న్యాయం చేసే వరకు పోరాటం
- ● కాంగ్రెస్ నాయకులు మాట నిలబెట్టుకోవాలి
- ● కురుమిద్ద నుండి మేడిపల్లి వరకు పాదయాత్ర
- ●పాదయాత్ర విజయవంతం





**యాచారం నేటి ప్రభాత సూర్య ( జులై 03):** రంగారెడ్డి జిల్లా, యాచారం మండలం లో ఫార్మాసిటీ వ్యతిరేక కమిటీ ఆధ్వర్యంలో మేడిపల్లి వరకు పాదయాత్ర ఫార్మాసిటీ రైతులు, రైతు కూలీలు, ప్రజలు పెద్ద ఎత్తున పాదయాత్రను నిర్వహించారు. గురువారం ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ పీపుల్స్ జేఏసీ జాయింట్ కన్వీనర్ కన్నెగంటి రవి, మానవ హక్కుల వేదిక విశ్రాంత శాస్త్రవేత్త డాక్టర్ బాబు, హైకోర్టు అడ్వకేట్ శ్రీకాంత్ ఈ పాదయాత్రకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు బట్టి విక్రమార్క, సీతక్క, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి ఫార్మా రైతులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఇక్కడ ఉన్న భూములను కాపాడుతామని, నమ్మించి మోసం చేయడమేనని వారు మండిపడ్డారు. భూములు ఇచ్చేది లేదని ఈ పాదయాత్రలో నేతలు మండిపడ్డారు. రైతులకు పంట రుణాలు, రైతు భరోసా ఇవ్వకుండా రైతులను భూములు ఇవ్వాలని కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పడం సిగ్గుమాలిన మాటలని ఎద్దేవైశారు. మా ప్రాణాలు పోయిన, ఫార్మాసిటీ రైతులు భూములు ఇచ్చేది లేదని ఈ పాదయాత్రనే కాంగ్రెస్ ప్రభుత్వానికి హెచ్చరికని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఫార్మా వ్యతిరేక కమిటీ కన్వీనర్ కవుల సరస్వతి, సర్పంచులు దంతుక పెద్దయ్య, దూసరి రమేష్, బందె రాజశేఖర్ రెడ్డి, కుందారపు నారాయణ, కానమోని గణేష్, మైపాల్ రెడ్డి, యుగంధర్ రెడ్డి, అనంత్ రెడ్డి, అనసూయ, శ్రీకాంత్ నాయక్, జక్కుల వెంకటేష్ ,ఆరే పల్లి లింగం, దే ఓ జి, పంగ వినోద్ రెడ్డి, జక్కుల వెంకటేష్, బర్ల మల్లేష్, భగవంతు రెడ్డి, అభిలాష్, పాపిరెడ్డి, విస్లావత్ రాజు, విస్లావత్ శంకర్, సామ నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

## పీర్జాదిగూడలో కొనసాగుతున్న 100రోజుల ప్రణాళిక



కమిషనర్ త్రిల్లేశ్వర్ రావు

**పీర్జాదిగూడ- నేటి ప్రభాత సూర్య (జూన్ 3)** "ఒక మార్పు అభివృద్ధికి మలుపు అను నినాదం" తో ప్రారంభమైన 100 రోజుల ప్రణాళిక 32వ రోజు విజయవంతంగా ముగిసినట్లు నగరపాలక సంస్థ కమిషనర్ టివస్ వివన్ త్రిల్లేశ్వరావు అన్నారు. గురువారం 32వ రోజు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి చెత్త సేకరణ, చెత్తను వేరుచేయు విధానం, వీధికుక్కల నియంత్రణ కార్యక్రమములపై అవగాహన, గోడలపై స్వచ్ఛతపై అవగాహన కల్పించే చిత్రాలను గీయుట, నాలాల పూడిక తీయుట, ట్రేడ్ లైసెన్స్ లేని షాపులను గుర్తించుట, భూవన్ సర్వే, మరియు సూచిక బోర్డులు ఏర్పాటు చేయుట, ప్రజలలో అవగాహన కల్పించేందుకు మైక్లో ప్రకటనలు చేయుట, ఇంటింటిక కరపత్రాలు పంపిణీ చేయుట, బ్యాంక్ కాలనీ, రామకృష్ణ నగర్ కాలనీలలో రోడ్లకిరువైపులా పొదలను శుభ్రం చేయుట, వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా సాయినగర్, శంకర్ నగర్ కాలనీలలో ఇంటింటికి మొక్కల పంపిణీ కార్యక్రమం చేయడం జరిగినది. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ కార్యక్రమం ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందని, ప్రజలందరు ఈ కార్యక్రమంలో భాగస్వాములై "స్వచ్ఛ పీర్జాదిగూడ"కు కలసి రావాలని కోరినారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ శోభశంకర్, డిప్యూటీ ఇ.ఇ జి.సాయినాథ్ గౌడ్, మేనేజర్లు క్రాంతి కుమార్, కిశోర్, ఎస్ఐ ప్రవీన్ కుమార్, ఇన్విరాన్మెంటల్ ఇంజనీర్ జి. బాలమురళికృష్ణ, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 5, 6 తేదీలలో జరుగు మహాసభలను జయప్రదం చేయండి



**షాద్ నగర్ నేటి ప్రభాత సూర్య జోన్ ఇంచార్జ్ (జూలై03):** తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రంగారెడ్డి జిల్లా 9వ మహాసభలు షాద్ నగర్ పట్టణం పెన్షనర్స్ భవనంలో నిర్వహించ తల పెట్టాము అధిక సంఖ్యలో వ్యవసాయ కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం బికెఎంయు జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్య మాట్లాడుతూ.. రంగారెడ్డి జిల్లాలో వ్యవసాయ కార్మికులకు పనులు దొరకడం లేదని వ్యవసాయ సీజన్ లో వలస కార్మికులు వచ్చి పనులు చేస్తున్నారని స్థానికంగా ఉన్న కార్మికులకు పనులు దొరుకుపోవంతో ఇక్కడున్న వారు సుదూర ప్రాంతాలకు వలసలు వెళ్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం గ్రామాలలో ఎన్ ఆర్ ఇ జి ఎస్‌లో అయినా పని చేసుకుని ఇంటి పట్టున ఉంటారని ఎంతో ప్రతిష్టాత్మకంగా 2005లో తీసుకొచ్చిన మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం మోదీ ప్రభుత్వం తేచ్చిన తర్వాత రోజురోజుకు నిర్వీర్యపరుస్తూ పేదలకు పనులు దొరకకుండా చేస్తుందని ఆయన మండిపడ్డారు. పథకానికి సరైన నిధులు కేటాయించక సరైన వసతులు కల్పించక లేక పోవడం మరియు సరిపడు ఉద్యోగులను కేటాయించకుండా పథకాన్ని నిరీవీర్య పరుస్తూ.. ఎత్తేసె ఆలోచనలు కేంద్ర ప్రభుత్వం చేస్తుంది అని ఆయన ఆరోపించారు. అదే జరిగితే గ్రామీణ ప్రాంత కూలీలకు తీవ్రమైన అన్యాయం జరుగుతుందని దాన్ని వ్యతిరేకించాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఆయన తెలియజేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఆరు గ్యారెంటీల హామీలతో అధికారంలోకి వచ్చిందని అధికారంలోకి వచ్చిన తర్వాత నత్త నడకన పథకాలను అమ లు పరుస్తుందని ఆయన విమర్శించారు. ఇందిరమ్మ ఇండ్లు ప్రతి ఊర్లో పునాదులు తీస్తున్నారని ఎస్సీ ఎస్టీలకు ఆరు లక్షల అని చెప్పి ఐదు లక్షల వరకే ప్రొసీడింగ్లు ఇచ్చారని ఇది ఎంతవరకు సమంజసం అని ఆయన ప్రశ్నించారు. అమలుకు సాధ్యంగాని హామీలు ఇచ్చిన తెలంగాణ కాం గ్రెస్ ప్రభుత్వం పథకాలు అమలు పరచడంలో చిత్తశుద్ధి లేకుండా పోయిందని ఆయన మండిపడ్డారు. ప్రజలకు అనేక రకమైన సమస్యలు ఉన్నాయని సమస్యలన్నిటిని కూడా ఈ మహాసభలో చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించి భవిష్యత్తు పోరాటాలకు రూపకల్పన చేయబోతున్నామని ఈ మా సభలకు ముఖ్య అతిథులుగా రాష్ట్ర అధ్యక్షులు కలకొండ కాంతయ్య సిపిఐ జిల్లా కార్య దర్శి పాలమాకుల జంగయ్య మిగతా రాష్ట్ర జిల్లా నాయ కులు జిల్లా వ్యాప్తంగా ప్రతినిధులు హాజరవుతున్నారు పెద్ద ఎత్తున వ్యవసాయ కార్మికులు పాల్గొని ఈ సభను జయప్రదం చేయాలని ఆయన కోరారు.

## కార్గే సభను విజయవంతం చేద్దాం

షాద్ నగర్ నియోజకవర్గం బి బ్లాక్ మహిళ అధ్యక్షురాలు జూలపల్లి అనసూయమ్మ



**షాద్ నగర్ నేటి ప్రభాత సూర్య జోన్ ఇంచార్జ్ (జూలై03):** నేడు జూలై 4వ తారీఖున ఎల్బీ స్టేడియంలో జరిగే కార్గే సభను విజయవంతం చేద్దాం కేశంపేట్ మండలంలో ప్రతి గ్రామం నుంచి మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని షాద్ నగర్ నియోజకవర్గం సీనియర్ మహిళా బి బ్లాక్ అధ్యక్షురాలు జూలపల్లి అనసూయమ్మ ముదిరాజ్ నేటి ప్రభాత సూర్యతో తెలిపారు.

## ఎల్బీ స్టేడియంలో జరిగే బహిరంగ సభను జయప్రదం చేయండి

కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మస్కు నరసింహా



**యాచారం నేటి ప్రభాత సూర్య ( జులై 03):** హైదరాబాదులో ఎల్బి స్టేడియంలో నేడు గ్రామస్థాయి నేతలతో జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మస్క్ నరసింహా ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగ పరిరక్షణ కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షులు సమ్మేళనానికి కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున కార్గే హాజరవుతున్నారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలు ప్రజల్లోకి ఎలా ముందుకు తీసుకెళ్లాలని అంశాలపై, పార్టీ విస్తరణ పై చర్చిస్తారని తెలిపారు. ప్రతి కాంగ్రెస్ పార్టీ నాయకుడు, కార్యకర్త మధ్యాహ్నం 2 గంటలకు హాజరుకావాలని కోరారు.

## మంత్రిని కలిసిన ఇబ్రహీంపట్నం నియోజకవర్గం పాస్టర్స్ అసోసియేషన్



**ఇబ్రహీంపట్నం- నేటి ప్రభాత సూర్య,జోన్ ఇంచార్జ్ (జూన్ 3)** ఇబ్రహీంపట్నం నియోజకవర్గం పాస్టర్లు అద్దూరి లక్ష్మణ్ కుమార్ తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల సంక్షేమ శాఖ మంత్రి కలిసిసమాధుల సమస్యలు క్రిస్టియన్ లు ఎదురుకుంటున్న సమస్యలు గురించి వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో క్రిస్టియన్ నాయకులు రాష్ట్ర కార్యదర్శి గొనె సొలొమోను రాజు, చెరుకూరి రాజు, చైర్మన్ దినకర్, సెక్రటరీ, దేవకుమార్, కరుణా కర్, రవికుమార్, జయకుమార్, క్రిస్థాపర్,క్రిష్ణపాల్ రమేష్, ఋశివా, తదితరులు పాల్గొన్నారు.

## విచారించి చర్యలు తీసుకోండి

**మీనాక్షి నటరాజన్‌ను కలిసిన కొండా దంపతులు**

**16 పేజీల నివేదిక**

**నేను కరెక్ట్ గానే ఉన్నా...కొండా సురేఖ**

**రాహుల్ ను ప్రధానిగా రేవంత్ ను మరో పదేళ్ళు సీఎంగా చూడాలనుందన్న కొండా మురళీ**

**(నేటి ప్రభాత సూర్య-పొలిటికల్ బ్యూరో)**

కాంగ్రెస్ పార్టీలో వరంగల్ పార్టీ విభేదాలు డైలీ సీరియల్ ను మంచి ఉత్కంఠను రేపుతున్నాయి. పరస్పర ఫిర్యాదులతో ఆ జిల్లా కాంగ్రెస్ పార్టీ రాజకీయం రంజుగా మారుతోంది. కొన్ని రోజులుగా జిల్లా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు వర్సెస్ మంత్రి కొండా సురేఖ దంపతులకు మధ్య వార్ కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఒకరికి వ్యతిరేకంగా ఒకరు సమావేశాలు నిర్వహించడం, పార్టీ అధిష్టానికి ఫిర్యాదులు చేయడం జరుగుతోంది. గత కొద్దిరోజులుగా ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ లో విభేదాలు కొనసాగుతున్న విషయం తెలిసిందే. ప్రభుత్వ సలహాదారు వేం నరేంద్ర రెడ్డి, జిల్లా ఇన్చార్జి మంత్రి పొంగులేని శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్ రెడ్డి, నాయిని రాజేంద్రనాథ్ రెడ్డి, గండ్ర సత్యనారాయణ, ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య, డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, మాజీ ఎంపీ ఆర్.సురేంద్రరెడ్డితో కొండా దంపతులు విభేదిస్తున్నారు. ఒక విధంగా చెప్పాలంటే జిల్లా కాంగ్రెస్ అంతా ఒకవైపు కొండా దంపతులు మరోవైపు అన్నట్లు పరిస్థితి మారిపోయింది. జిల్లాలోని కీలక నేతలు అయిన మంత్రి సీతక్క, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, సీనియర్ నేత బలరాం నాయక్ వంటివారు తటస్థంగా ఉండిపోయారు. ఈ పరిస్థితుల్లో పార్టీ నిలువునా రెండుగా చీలిపోయే ప్రమాదం ఉందన్న సమాచారంతో అధిష్టానం రంగంలోకి దిగింది. ఈ వివాదాన్ని పార్టీ రాష్ట్ర ఇన్చార్జి మీనాక్షి నటరాజన్ ఎలా చక్కదిద్దుతారనేది ఉత్కంఠ రేపుతోంది. ఇదిలావుంటే జిల్లా ఎమ్మెల్యేలపై మంత్రి సురేఖ భర్త సీనియర్ నేత కొండా మురళి వ్యాఖ్యలతో వివాదం మొదలైంది. దీనిపై ఎమ్మెల్యే నాయిని రాజేంద్రనాథ్ రెడ్డి నివాసంలో మిగిలిన నేతలు సమావేశమై కొండా తీరుపై పార్టీ పెద్దలకు ఫిర్యాదుచేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గత వారం పార్టీ క్రమశిక్షణ సంఘానికి ఎమ్మెల్యేలపై ఓ నివేదిక సమర్పించిన మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి, గురువారం పార్టీ రాష్ట్ర ఇన్ చార్జి మీనాక్షి నటరాజన్ ను కలిసి మరో నివేదిక సమర్పించారు. హైదరాబాద్ ఎమ్మెల్యే క్వార్టర్సులో పార్టీ రాష్ట్ర ఇన్చార్జి మీనాక్షి నటరాజన్ను కొండా దంపతులు ప్రత్యేకంగా కలిశారు. ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీలో జరుగుతున్న పరిణామాలపై సుమారు 16 పేజీలతో నివేదిక ఇచ్చారు. ఉమ్మడి జిల్లాలో ఉన్న మొత్తం 12 నియోజకవర్గాల్లో ఎక్కడ ఏం జరుగుతుందో ఆ నివేదికలో పొందుపరిచినట్లు సమాచారం. తమపై జిల్లా ఎమ్మెల్యేలు చేసిన ఫిర్యాదుపైనా మంత్రి కొండా సురేఖ దంపతులు వివరణ ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. తమపై వచ్చిన ఫిర్యాదులపై విచారణ జరిపి నిజాలు తెలుసుకున్న తర్వాత ఎవరిది తప్పుంటే వారిపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్చార్జి మీనాక్షి నటరాజన్ ను కోరినట్లు తెలుస్తోంది. అనంతరం బయటకు వచ్చిన కొండ దంపతులు ఎమ్మెల్యే క్వార్టర్స్ వద్దే మీడియాతో మాట్లాడారు. తనకు కేటాయించిన శాఖలకు న్యాయం చేస్తున్నానని, రూల్స్ ప్రకారమే నడుచుకుంటున్నానని మంత్రి



సురేఖ తెలిపారు. తను చూస్తున్న డిపార్టుమెంట్ల ఫైల్స్ అన్నీ చెక్ చేసుకోవచ్చని, మంత్రిగా తాను ఎలాంటి తప్పు చేయలేదని వివరించారు. నా మంత్రి పదవిపై ఎవరు మాట్లాడినా స్పందించాను. సుష్మితలో పారేది కొండా మురళీ, కొండా సురేఖ రక్తం. మా కూతురికి మా ఆలోచనలు వంశపారంపర్యంగా రావడంలో తప్పులేదని సురేఖ వ్యాఖ్యానించారు. కొండా మురళీ మాట్లాడుతూ తాను బీసీ కార్డు పట్టుకునే బతుకుతున్నట్లు చెప్పారు. అణగారిన వర్గాలు బలం ఉన్నవాడి దగ్గరికే వస్తారు. పేదల సమస్యలు తీర్చుతాను కాబట్టే జనం తన వద్దకు వస్తారని తెలిపారు. నాకు ప్రజా బలం ఉంది. పనిచేసే వారిపైనే బండలు వేస్తారు. నడిచే ఎద్దునే పొడుస్తారు. పార్టీ ఎవరికి టికెట్లు ఇచ్చిన గెలిపించే బాధ్యత నేను తీసుకుంటానని ఇన్చార్జి మీనాక్షి నటరాజన్ కు హామీ ఇచ్చినట్లు మురళీ తెలిపారు. 'కాంగ్రెస్ పార్టీని బతికించడమే నా ఉద్దేశం. రాహుల్ గాంధీని ప్రధాని చేయడం నా ఉద్దేశం. రేవంత్ రెడ్డిని ఇంకో పదేండ్లు ముఖ్యమంత్రిగా చూడడం నా ఉద్దేశం. పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్‌కు అండగా నిలుస్తా' అని కొండా మురళి స్పష్టం చేశారు.

## ప్రాణహిత నదికి జలకళ



**చెన్నూర్ నియోజకవర్గం నేటి ప్రభాత సూర్య. ప్రతినిధి జులై 3:** బోసిపోయిన ప్రవాహానికి పునర్జీవం లభించింది. చెన్నూరు వద్ద గత కొన్ని రోజులుగా నీటి తక్కువతో వెలితినీ కనిపించిన ప్రాణహిత నది ఇప్పుడు వరద ఉప్పెనతో జలకళను సంతరించుకుంది. మహారాష్ట్ర ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు నదిలోకి వరద నీరు ప్రవాహంగా వచ్చి చేరుతోంది. ప్రవాహం పెరుగుతున్న కారణంగా ప్రాణహిత నది ఇరువైపుల తీరాలను తాకుతూ మేడిగడ్డ బ్యారేజ్ దిశగా పరుగులు తీస్తోంది. ప్రాంతీయంగా వర్షాభావ వాతావరణం కొనసాగుతున్నప్పటికీ, ఎగువ ప్రాంతాల వర్షాలతో నది గర్భంలోకి నూతన జీవం పోసింది.ప్రస్తుతం నదిలో పెరుగుతున్న ప్రవాహం గోదావరి పరివాహక ప్రాంతాల ప్రజలకు కాస్త ఉపశమనం కలిగిస్తోంది. మేడిగడ్డ వద్ద నీటి మట్టం పెరుగుతున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు. వరద స్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నట్లు తెలుస్తోంది.

## ఉచిత కంటి వైద్య శిబిరం




**మంచిర్యాల జిల్లా నేటి ప్రభాత సూర్య ప్రతినిధి జులై 3.**
కాసిపేట,తెలంగాణ సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ గురుకుల పాఠశాల, కాసిపేటలో గురువారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో జనరల్ ఫిజీషియన్ డా. యశ్వంత్ చంద్ర వంశీ, నేత్ర వైద్య నిపుణుడు డా. అంజయ్య విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్యులు విద్యార్థుల కంటి ఆరోగ్యాన్ని పరిశీలించి, అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. విద్యార్థుల్లో విటమిన్-ఎ లోపం తలెత్తకుండా ఉండేందుకు పోషకాహారాన్ని ప్రతిరోజూ తీసుకోవాలని వైద్యులు సూచించారు. ఈ కార్యక్రమాన్ని పాఠశాల సిబ్బంది, లయన్స్ క్లబ్ సభ్యులు విజయవంతంగా నిర్వహించారు.వైద్య శిబిరం ద్వారా విద్యార్థులు మెరుగైన కంటి ఆరోగ్యంపై అవగాహన పొందారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు పేర్కొన్నారు.

## నిషేధిత ఆన్లైన్ గేమ్స్ ఆడడం చట్టరీత్యా నేరం

**మంచిర్యాల జిల్లా నేటి ప్రభాత సూర్య ప్రతినిధి.జులై 3.**



డీసీపీ ఎగ్గడి భాస్కర్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొంటూ, ప్రభుత్వం నిషేధించిన ఆన్లైన్ గేమ్స్ ఆడటం చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. ఈ తరహా గేమ్స్‌కి సంబంధించిన నిర్వాహకులపైతో పాటు, వాటిని ఆడిన వారిపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తల్లి దండ్రులు తమ పిల్లల ప్రవర్తనను, వినో దానికి వారు ఎంచుకుంటున్న మార్గా లను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండా లని సూచించారు. యువత గేమింగ్కు బానిసలవుతున్న ఘటనలు పెరిగి పోతున్నాయని, ఇది వారి బంగారు భవిష్యత్తుకు ఆటంకం కలిగిస్తోందని తెలిపారు. ఆన్లైన్ గేమ్స్ మాయజాలానికి యువత దూరంగా ఉండాలి అని డీసీపీ విజ్ఞప్తి చేశారు. నిర్బంధం కాకుండా, అవగాహన పెంచి, భవిష్యత్ లక్ష్యాలపై దృష్టి పెట్టే విధంగా విద్యార్థులను, యువతను మార్గనిర్దేశనం చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

## గుండాల జలపాతం అందాలు చూసొద్దామా..!



**దండేపల్లి మంచిర్యాల జిల్లా:నేటి ప్రభాత సూర్య ప్రతినిధి. జులై 3.**
ప్రకృతికి పుట్టినిల్లు అని గుర్తింపు పొందిన మంచిర్యాల జిల్లా పర్యాటక ప్రియుల అభిరుచులకు నందించిన ప్రాంతంగా వెలుగులోకి వస్తోంది. జిల్లాలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు దండేపల్లి మండలంలోని ప్రసిద్ధ గుండాల జలపాతం పరవళ్లు తొక్కుతోంది.ఎత్తయిన గుట్టలపై నుంచి ఎర్ర మట్టితో కలిసిన నీటి ప్రవాహం అడవిలోంచి జాలువారుతూ అందరికీ ఆహ్లాదాన్నిస్తుంది. ఈ ప్రకృతి సుందర దృశ్యాన్ని చూసేందుకు పర్యాటకులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. సెల్ఫీలు, ఫోటోషూట్లతో జలపాతానికి మరింత జవాలు చేకూరుతోంది. ప్రకృతి ప్రేమికులు, యువత అంతా ఈ జలపాతాన్ని తిలకిస్తూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలం వచ్చే ప్రతి సంవత్సరం ఇదే తరహా దృశ్యం చోటు చేసుకుంటోంది. అయితే, పెరిగిన నీటి ప్రవాహం వల పర్యాటకులు జాగతగా ఉండాలని స్థానికులు సూచిస్తున్నారు.

# క్యాతనపల్లి ప్రెస్ క్లబ్ కార్యవర్గం ఎంపిక



### - అధ్యక్షులుగా కలవల శంకర్

**మంచిర్యాల జిల్లానేటి ప్రభాత సూర్య ప్రతినిధి జులై 3.**
క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని క్యాతనపల్లి ప్రెస్ క్లబ్ కార్యవర్గ ఖరారైంది.డబ్ల్యూజెఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి పార్వతి రాజేష్, జిల్లా అధ్యక్షులు పార్వతి సురేష్, క్యాతనపల్లి ప్రెస్ క్లబ్ కో ఆర్డినేటర్ దుస్స శివప్రసాద్ లు కమిటీ వివరాలు ప్రకటించారు. అధ్యక్షులుగా కలవల శంకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ గా రామిల్ల శ్రీనివాస్ , ఉపాధ్యక్షులుగా తూముల భవిష్యత్, రామిడి సాయి సృజన్, కోశాధికారిగా పరికిపండ్ల రాజు, ప్రధాన కార్యదర్శిగా మేరుగు నారాయణ, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఎలకటూరి నరేష్, సంయుక్త కార్యదర్శిగా పోలుదాసరి శ్రీనివాస్, సహాయ కార్యదర్శులు గా కందుల ప్రవీణ్, నరెడ్ల వెంకన్న సలహాదారులుగా కనుకుంట్ల సుభాష్ ,సభ్యులుగా కరెడ్ల రఘు, దండు సదానందం, మామిడాల రవి, పినుమల్ల సుదర్శన్ లను ఏకగ్రీవంగా సభ్యులందరి సమక్షంలో ఎన్నుకున్నట్లు వారు ప్రకటించారు. ఈసందర్భంగా అధ్యక్ష , ప్రధాన కార్యదర్శులు మీడియాతో మాట్లాడుతూ, క్యాతనపల్లి ప్రెస్ క్లబ్ అభివృద్ధికి కృషి చేస్తామని, జర్నలిస్టులందరూ ఐక్యంగా ఉండా లని కోరారు. సంఘ సభ్యులందరిభవిష్యత్తుకోసంత్వరలోరాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు పొందినసంఘాలతో చర్చించనున్నట్లు చెప్పారు.

**ఐక్యత, నిజాయితీ ముఖ్యం: పార్వతి సురేష్.**
జర్నలిస్టులందరిలో ఐక్యత, నిజాయితీ ఎంతో ముఖ్యమని బిఎంఎస్ అనుబంధ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా మంచిర్యాల జిల్లా అధ్యక్షులు పార్వతి సురేష్ అన్నారు. నిజాయితీగా వార్తలు రాయడంతో పాటు ఇన్వెస్టిగేషన్ జర్నలిజం చేసినప్పుడే విలేకరికి సరైన గుర్తింపు వస్తుందని ఆ దిశగా అందరూ కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. స్వార్థపు అధికారులు , రాజకీయ నాయకులు జర్నలిస్టులలో అనైక్యతకు ప్రయత్నిస్తూ ఉంటారని అలాంటి వారి పట్ల జాగ్రత్తగా ఉండాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో డబ్ల్యుజెఐ జిల్లా కోశాధికారి దేగా ఆంజనేయులు, ఉపాధ్యక్షులు మామిడాల రవి, జిల్లా నాయకులు మాసు రాకేష్ లు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రపంచ మెకానిక్ డే దినోత్సవం

**మంచిర్యాల జిల్లా నేటి ప్రభాత సూర్య. ప్రతినిధి జులై 3.**
మందమర్రి పట్టణంలో ప్రపంచ మెకానిక్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతి సంవత్సరం జూలై 3న జరుపుకుంటారు. మందమర్రి పాత బస్టాండ్ ప్రాంతంలో మెకానిక్ యూనియన్ సభ్యులందరూ కలిసి జెండా ఎగరవేసి మిఠాయిలు పంచి పెట్టడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మందమర్రి యూనియన్ అధ్యక్షుడు చిరుత మల్లేష్, యూనియన్ జెండా ఆవిష్కరణ చేయడం జరిగింది.ఆయన మాట్లాడుతూ..ఈ రోజున, వాహనాలు, యంత్రాలు మరియు ఇతర సాంకేతిక పరికరాలను సరిచేయడంలో మరియు నిర్వహించడంలో నైపుణ్యం కలిగిన మెకానిక్ల కృషిని, ప్రాముఖ్యతను గుర్తిస్తారు. ఆ మెకానిక్స్ డేను జరుపుకోవడం యొక్క ప్రాముఖ్యత మెకానిక్ల పాత్రను గుర్తించడం.వాహనాలు,యంత్రాలు సజావుగా పనిచేయడానికి మెకానిక్ల కృషి ఎంతో అవసరం. ప్రపంచవ్యాప్తంగా ఉన్న మెకానిక్ల కృషిని గుర్తించి,అభినందించడానికి ఈ రోజున జరుపుకోవడం జరుగుతుందని మెకానిక్స్ రోజు అనేది సాంకేతిక పరిజ్ఞానం మరియు మెకానికల్ నైపుణ్యాల ప్రాముఖ్యతను తెలియజేస్తుంది.సమాజానికి సేవనందించే విధంగా మెకానిక్ సేవలు మన జీవితాలను సులభతరం చేస్తాయిని మన కృషి లేకుండా మనం వాహనాలను లేదా ఇతర యంత్రాలను




సరిగ్గా ఉపయోగించలేముని ఈరోజు మెకానిక్లకు అందరికీ ధన్యవాదాలు తెలుపుదాంఆని మన జీవితాలను సులభతరం చేయడానికి చేసే కృషిని గుర్తుంచుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు ఎర్రోజు బ్రహ్మం, ప్రధాన కార్యదర్శి ముత్యం పల్లి భాస్కర్, మర్రి రాము,మెరుగు కిషన్,కస్తూరి సత్యం, కుమార్,ఓ శ్రీనివాస్, తుమ్మల శ్రీనివాస్,సురేష్, మున్నా,ఓదెలు,శ్రీను, జగదీష్,శంకర్,తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు పుస్తకాలు పెన్నులు పంపిణీ చేసిన బీజేపీ నాయకులు



**మంచిర్యాల జిల్లా, నేటి ప్రభాతసూర్యప్రతినిధి.జులై, 3.**
మందమర్రి మండలం, అందుగులపేట ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాన్ని బీజేపీ రాష్ట్ర యువ నాయకుడు దారా రవి సాగర్ ఆధ్వర్యంలో నిర్వహించారు.జిల్లా బీజేపీ అధ్యక్షుడు నగనూరు వెంకటేష్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు పెన్నులు, బ్యాగులు, నోటుబుకులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యంగా భారతీయ జనతా పార్టీ పని చేస్తోందని, విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అవసరమైన మౌలిక వసతులు కల్పించడమే తమ ధ్యేయమని చెప్పారు.విద్యార్థుల అవసరాలపై స్పందించే విధంగా రవి సాగర్ వంటి యువ నాయకులు ముందుకు వచ్చి విద్యా సామ



గ్రిని పంపిణీ చేయడం అభినందనీయమని అన్నారు. భవిష్యత్తులో పాఠశాల లేదా విద్యార్థుల సంబంధిత ఏవైనా సమస్యలు ఉంటే వాటిని తమ దృష్టికి తీసుకురావాలని, పరిష్కారానికి ప్రయత్నిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీజేపీ నాయకుడు అందుగుల శ్రీనివాస్, మండలాధ్యక్షుడు జనార్ధన్, ఇంచార్జ్ సంజీవ రావు, కన్వీనర్ అక్కల రమేష్, పట్టణ అధ్యక్షుడు నరేష్, సంతు రామ్ నాయక్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# డిగ్రీలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ఘన సన్మానం



**చింతపల్లి-నేటి ప్రభాత సూర్య (జులై3)**

డిగ్రీ సెమిస్టర్ ఫలితాల్లో భారతి కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి యూనివర్సిటీ స్థాయిలో కళాశాల కు వారి తల్లిదండ్రులకు పేరు ప్రతిష్ట లు తీసుకురావడం ఎంతో గర్వించదగ్గ విషయమని చింతపల్లి మండలం వెంకటేశ్వర నగర్ (మాల్) భారతి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సూదినముని హనుమంత్ యాదవ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా గురువారం కళాశాల విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతి బహుమతి మెమొంటోల ను అందజేసి విద్యార్థులను వారి తల్లిదండ్రులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యనందుకొని వారి భవిష్యత్తుకు బాటలు వేసుకోవడంతోపాటు వారి జీవిత భవిష్యత్ ప్రణాళికను కూడా కళాశాలలోనే నిర్ణయించుకోవడం జరుగుతుందన్నారు. నేటి సమాజంలో ఎంతోమంది యువతీ యువకులు మధ్యలోనే విద్యకు స్వస్తి చెప్పి చెడు మార్గపు వైపు ప్రయాణించి వారి భవిష్యత్తు జీవితాలను కోల్పోతున్నారన్నారు. విద్యార్థుల యొక్క తల్లిదండ్రుల ఆశలను అడియాసలు చేస్తూ సమాజంలో తలెత్తుకోలేక పోతున్నారన్నారు. అలాంటి వారి పట్ల తెలివైన విద్యార్థులు అలాంటి వారి పట్ల తెలివైన విద్యార్థులు దూరంగా ఉండాలన్నారు. బి.కాం షేక్ రేష్మ రోషన్ 9.76/10 జిపిఏ, యూనివర్సిటీ స్థాయిలో మొదటి ర్యాంక్ సాధించడం జరిగిందన్నారు ఇ. బిందు శ్రీ 8.80/10, బి.వెంకటేష్ 8.76/10, వి.నిహారిక 8.50/10, పి.పవన్




8.40/10,పి.స్వాతి 8.40/10, పి భవాని 8.40/10 జిపి సాధించడం జరిగిందన్నారు. అదేవిధంగా ఎంపీసీఎస్ లో రౌతు. శిరీష 9.52/10, ఇ. చందన 8.60/10, వి.రోజా8.44/10, పి రాధిక,8.40/10 జిపిఏ సాధించారు. అదేవిధంగా బి జెడ్ సి లో గడల.స్వాతి 9.36/10, ఏ. రేణుక 8.84/10, ఎస్.కె. సానియా 8.40/10 జిపిఏ ఉత్తమ ఫలితాలు సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను వారి తల్లిదండ్రులను కళాశాల అధ్యాపక బంధం ప్రిన్సిపాల్ అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కదారి ఆంజనేయులు, డైరెక్టర్ ఎస్.ధనలక్ష్మి అధ్యాపక బృందం సాయి భవాని, నరసింహ, రాజు, పెద్దయ్య, శేఖర్, నరేష్, కిషన్, జబీర్, చందు విద్యార్థి విద్యార్థులు వారి తల్లిదండ్రులు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ప్రతిభ గుర్తించేందుకే పోలీస్ డ్యూటీ మీట్



**మంచిర్యాల జిల్లా నేటి ప్రభాత సూర్య ప్రతినిధి జులై 3.**
పోలీస్ వృత్తిలో మరింత నైపుణ్యం, సామర్థ్యం, ప్రతిభ పెంపొందించుకునేందుకు పోలీస్ డ్యూటీ మీట్ నిర్వహిస్తున్నట్లు రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ తెలిపారు. బుధవారం మంచిర్యాల పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పోలీస్ అధికారులకు జోన్ స్థాయి పోలీస్ డ్యూటీ మీట్ ను విజయవంతంగా నిర్వహించారు.
ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, “విధుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నేర దర్యాప్తులో శాస్త్రీయత, నూతన విధానాల అవగాహన, త్వరితగతిన స్పందన వంటి అంశాలపై పోలీసులు ఎప్పటికప్పుడు నైపుణ్యాన్ని అభివృద్ధి చేసుకోవాలి. అలాంటి అవకాశాలను అందించేందుకే ఈ డ్యూటీ మీట్” అని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీలు, డివైఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు సహా వివిధ స్థాయిల పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. పోటీతత్మకంగా నిర్వహించిన వివిధ విభాగాల్లో ప్రతిభ చూపిన అధికారులను గుర్తించి ప్రశంసించారు. పోలీసులు తమ విధుల్లో మరింత చురుకుగా, నైతిక విలువలతో పనిచేయాలని కమిషనర్ సూచించారు.

## 7న పాత వాహనాలకు వేలం



**మంచిర్యాల,నేటి ప్రభాత సూర్య. ప్రతినిధి జూలై 3:** మంచిర్యాలలోని ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో ఈనెల 7న పాత వాహనాల వేలం నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ (సీఐ) గురవయ్య బుధవారం తెలిపారు. గతంలో శాఖ చేపట్టిన వివిధ దాడుల సమయంలో స్వాధీనం చేసుకున్న 10 వాహనాలను వేలం ద్వారా విక్రయించనున్నారు.
వేలంలో పాల్గొనదలచిన ఆసక్తి గల వ్యక్తులు వాహన విలువలో 50 శాతం ఈఎండి (ఎర్నెస్ట్ మనీ డిపాజిట్) రూపంలో ముందుగానే చెల్లించాలి. వేలం ఉదయం 10:30 గంటలకు ప్రారంభమవుతుందని ఆయన తెలిపారు. పూర్తి వివరాల కోసం మంచిర్యాల ఎక్సైజ్ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.

## కార్మికుల సంక్షేమం ఐఎన్‌టియుసితోనే సాధ్యం



**మందమర్రి:నేటి ప్రభాత సూర్య. ప్రతినిధి జులై 3.**
కార్మికుల హక్కుల సాధన, సంక్షేమం కోసం ఐఎన్టీయూసీ (ఐఎన్‌టియుసి) పోరాటం కీలకమని సంఘం సీనియర్ వైస్ ప్రెసిడెంట్ సమ్మయ్య తెలిపారు.బుధవారం మందమర్రి ఏరియా కేకే-ఓసీపీలో జరిగిన కార్యక్రమంలో పలువురు కార్మికులు ఐఎన్టీయూసీలో చేరారు.ఈ సందర్భంగా సమ్మయ్య నూతన సభ్యులకు కండువాలు కప్పి యూనియన్ లోకి ఆహ్వానించారు. వర్క్‌షాపుల్లో కార్మికులుఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరించేందుకు సంఘంకృషిచేస్తోం దన్నారు. ప్రత్యేకంగా మారు పేర్ల సమస్య, పెరికైపై ఇన్కమ్ ట్యాక్స్ మాఫీ కోసం యూనియన్ జనరల్ సెక్రటరీ జనప్ర సాద్ అధ్వర్యంలో తీవ్రంగా చొరవ తీసుకుంటున్నారని తెలిపారు.

## ఘనంగా ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ జన్మదిన వేడుకలు

**చింతపల్లి- నేటి ప్రభాత సూర్య (జూన్ 3)**
దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ పుట్టినరోజు సందర్భంగా కర్మన్ ఘాట్ హనుమాన్ దేవాలయం మాజీ చైర్మన్ నల్ల రఘుమారెడ్డి కేక్ కట్ చేసి శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే బాలునాయక్ గురువారం సాయిరాం నగర్ కాలనీలోని నల్ల రఘుమారెడ్డి నివాసానికి వచ్చిన సందర్భంగా శుభాకాంక్షలు తెలిపినట్లు తెలిపారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో చింతపల్లి మాల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అలివేలు సంజీవరెడ్డి, ఎరుకల వెంకటయ్య గౌడ్, సుధాకర్ రెడ్డి ,మాజీ జెడ్పిటిసి హరినాయక్, చింతపల్లి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అంగిరేకుల నాగభూషణ్ ,సంజీవరెడ్డి, వెంకటయ్య, గౌతంరెడ్డి, నిష్కాంత్ రెడ్డి, బాలకృష్ణ, మేకలరాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.



నేటి ప్రభాత సూర్య
జాతీయ తెలుగు దిన పత్రిక


## బ్లూ డాన్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో 50 డ్యూయల్ డెస్క్‌లు అందజేత



**మందమర్రి. నేటి ప్రభాత సూర్య. ప్రతినిధి జులై 3.**
మందమర్రి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అభ్యాసంలో సౌకర్యం కల్పించే ఉద్దేశంతో బ్లూ డాన్ సంస్థ ఆధ్వర్యంలో 50 డ్యూయల్ డెస్క్‌లు స్థానిక ప్రభుత్వ పాఠశాల(ఒర్రెగడ్డ)కు అందజేశారు. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథిగా జిల్లా విద్యాధికారి యాదయ్య, పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "ఇటువంటి సేవా కార్యక్రమాలు ప్రభుత్వ విద్యా సంస్థల్లో విద్యా ప్రమాణాలను మెరుగుపరచడంలో ఎంతో సహాయపడతాయని, బ్లూ డాన్ సంస్థ విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని చూపిన సంఘసేవా దృక్పథం అభినందనీయం" అని పేర్కొన్నారు. బ్లూ డాన్ సంస్థ ప్రతినిధులు విదు మౌళి, శ్రీకాంత్‌లు మాట్లాడుతూ "ప్రతి పిల్లవాడికీ మరింత సౌకర్యవంతమైన వాతావరణంలో విద్యను అందించాలనే సంకల్పంతో ఈ డెస్క్‌లను అందించామని ఇది మా బాధ్యతగా భావిస్తున్నాం" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏరియా జనరల్ మేనేజర్ దేవేందర్, మున్సిపల్ కమిషనర్ రాయలింగు, ఎంఈఓ దత్తు మూర్తి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఐ. పద్మజ, పర్సనల్ మేనేజర్ శ్యామ్‌సుందర్, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి: ఎంపీడీవో రాజేశ్వర్



**మందమర్రి. నేటి ప్రభాత సూర్య. ప్రతినిధి. జులై 3.**
పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యతగా భావించి అందరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు మండల అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) రాజేశ్వర్. గురువారం మందమర్రి మండలం పొన్నారంలో ఇంటింటికీ ఆరు మొక్కలను ఉచితంగా పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ, "వాతావరణ మార్పుల నేపథ్యంలో ఆక్సిజన్ ఉత్పత్తి, పచ్చదనాన్ని పెంచేందుకు ప్రతి ఇంట్లో మొక్కలు నాటాలి. నాటిన మొక్కలు ఎదిగే వరకు నిరంతరం చూసుకోవాలి" అని సూచించారు. కార్యక్రమంలో పంచాయితీ స్పెషల్ ఆఫీసర్ సునీత, హౌసింగ్ ఏఈ జ్యోత్స్న, ఫీల్డ్ అసిస్టెంట్ గౌరవ అధ్యక్షుడు లింగయ్య తదితరులు పాల్గొన్నారు. ప్రజలంతా మొక్కలు నాటి వాటిని పెంచుతూ పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని అధికారులు ఆకాంక్షిస్తారు.


## ఇంటింటికీ ఎమ్మెల్యే మాధవి తొలి అడుగు



**కడప నేటి ప్రభాత సూర్య జూలై 3:**
ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రెడ్డప్పగారి మాధవి రెడ్డి మరియు టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు, కడప జిల్లా అధ్యక్షులు రెడ్డెప్పగారి శ్రీనివాసరెడ్డి ల ఆధ్వర్యంలో 'సుపరిపాలనలో తొలి అడుగు – ఇంటింటికి మన ప్రభుత్వం' కార్యక్రమం గురువారం కడప నగరంలోని 48వ డివిజన్ రామచంద్రపురం (కొట్టలు) ప్రాంతంలో విజయవంతంగా నిర్వహించబడింది. కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తైన సందర్భంగా ఎడాది కాలంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను, రాబోయే రోజుల్లో చేయబోయే అభివృద్ధి లక్ష్యాలను ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను నేరుగా విని పరిష్కారానికి కృషి చేస్తూనే, ప్రభుత్వం ఇచ్చిన హామీలను పూర్తి స్థాయిలో అమలు చేస్తామన్న అవగాహన ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు కల్పించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ఇంచార్జ్ శివ రెడ్డి, 32 బూత్ ఇంచార్జ్ సుబ్బరాయడు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, క్లస్టర్, యూనిట్, బూత్ ఇంచార్జ్‌లు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## పులివెందుల వాసి ముదిగుబ్బ సమీపంలో దారుణ హత్య

### మృతుడు ఓడీచెరువు మండలం గాజుకుంటపల్లి అల్లుడిగా గుర్తింపు



**ముదిగుబ్బ నేటి ప్రభాత సూర్య జూలై 3**
శ్రీ సత్యసాయి జిల్లా ముదిగుబ్బ మండలంలో దారుణ హత్య వెలుగు చూసింది. హత్యకు గురైన వ్యక్తి కడప జిల్లా పులి వెందుల ప్రాంతానికి చెందిన రామప్ప కుమారుడు విశ్వనాథ్‌గా గుర్తించారు. మృతుడు శ్రీ సత్యసాయి జిల్లా ఓడీచెరువు మండలం గాజుకుంటపల్లిలో పెళ్లి చేసుకున్నట్లు తెలుస్తోంది. ముదిగుబ్బ – కదిరి బైపాస్‌లోని పొలాల్లో అత్యంత కిరాతకంగా హతమార్చినట్లు గుర్తిం చారు. మృతుడు హత్యకు ముందు ముదిగుబ్బకు స్కూటీలో వస్తుండగా దారుణ హత్యకు గురైనట్లు తెలుస్తోంది. తల తెగనరికి వేరు చేశారు. మృతదేహం లోని సగభాగాన్ని కాల్చిన ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. గురువారం ఉదయం అటుగా వెళ్తున్న వారు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ముదిగుబ్బ పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలికి చేరుకొని పరిశీలించారు. అయితే మృతదేహం పూర్తిగా కుళ్లిపోయి గుర్తుపట్టడానికి వీలు లేకుండా ఉంది. రెండు భాగాలుగా నరికి కాల్చిన ఆనవాళ్లు కూడా ఉన్నాయి. అయితే ఈ హత్యకు పాల్పడింది ఎవరు, ఎందుకు ఇంత కిరాతకంగా హతమార్చారనే వివరాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది. హత్యకు గురైన వ్యక్తి శ్రీ సత్యసాయి జిల్లా తనకల్లు మండలం ఎర్రగుంటపల్లి వాసిగా పోలీసులు విచారణలో తేలింది. ప్రస్తుతం అతని కుటుంబం కదిరిలోని శివాలయం వీధిలో నివాసమంటున్నట్లు పోలీసులు కనుగొన్నారు. మంగళవారం ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి చివరకు రెండు రోజుల తరువాత ఇలా హత్యకు గురై ఉండగా పోలీసులు కనుగొన్నారు. హత్యకు గల కారణాలు ఆస్తి లేదా వివాహేతర సంబంధమే అయి ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు.

# ప్లాస్టిక్ పై సమరం

- వేషధారణతో పట్టణంలో ర్యాలీ అవగాహన
- ఒక మార్పు - అభివృద్ధికి మలుపు.
- ప్లాస్టిక్ వాడకం నిషేధిద్దాం స్వచ్ఛ దేవరకొండ గా మారుద్దాం.

**దేవరకొండ– నేటిప్రభాత సూర్య (జూన్ 3)**
దేవరకొండ మునిసిపాలిటీ పరిధిలో 100 రోజుల కార్యక్రమంలో భాగంగా అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్ రహిత దినోత్సవం సందర్భంగా ప్లాస్టిక్ కవర్స్ నిషేధించాలని కోరుతూ గురువారం దేవరకొండ పురపాలక కార్యాలయం నుండి పట్టణ పురవీధుల గుండా ప్లాస్టిక్ నిషేధించాలని కోరుతూ వేషధారణతో ఉన్న వ్యక్తి తో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ వై సుదర్శన్ మాట్లాడుతూ స్వచ్ఛ స్వచ్ఛ పురపాలక ధ్యేయంగా దశలవారీగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు ఈ సందర్భంగా మునిసిపల్



పారిశుద్ధ్య కార్మికులు వార్డ్ ఆఫీసర్స్ ఆర్పీలతో కలిసి ప్లాస్టిక్ వద్దు జ్యూట్ బ్యాగు లే ముద్దు అంటూ నినాదాలు చేస్తూ మీనాక్షి సెంటర్ నుండి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వై . సుదర్శన్, శానిటరీ ఇన్స్పెక్టర్ సురగి శంకర్, ఎన్విరాన్మెంట్ ఆఫీసర్ శక్రు నాయక్, మునిసిపల్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ హెల్పర్లకు తీపి కబురు

### ప్రమోషన్ గరిష్ట వయస్సు 45 నుంచి 50 ఏళ్లకు పెంపు

**మంచిర్యాల జిల్లా నేటి ప్రభాత సూర్య ప్రతినిధి జులై 3.**
అంగన్వాడీ హెల్పర్లకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త ప్రకటించింది. అంగన్వాడీ టీచర్లుగా పదోన్నతి పొందే గరిష్ట వయోపరిమితి 45 ఏళ్ల నుంచి 50 ఏళ్లకు పెంచుతూ మహిళా శిశు సంక్షేమ శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క సంబంధిత ఫైల్పై గురువారం సంతకం చేశారు.
ఈ నిర్ణయం వల్ల రాష్ట్రవ్యాప్తంగా 45 నుంచి 50 ఏళ్ల మధ్య వయస్సు గల సుమారు 4322 మంది అంగన్వాడీ హెల్పర్లకు టీచర్లుగా పదోన్నతి పొందే అవకాశం ఏర్పడనుంది. గతంలో 45 ఏళ్లు దాటిన తర్వాత ప్రమోషన్ కోసం అవకాశాలు లేకపోయినా, ఇప్పుడు వారికీ మళ్ళీ అవకాశం లభించనుంది. గరిష్ట వయో పరిమితిని పెంచాలని అంగన్వాడి హెల్పర్ యూనియన్ల విజ్ఞప్తి మేరకు సాధ్యసాధ్యాలను పరిశీలించాలని మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు.
అర్హతలు ఉన్న 50 ఏళ్ల లోపు హెల్పర్లకు టీచర్ పదోన్నతి ఇవ్వడంలో ఎలాంటి అడ్డంకులు లేవని అధికారులు నివేదిక సమర్పించారు. ఇటీవలే అంగన్వాడీ టీచర్ల రిటైర్మెంట్ వయసును 60 నుంచి 65 ఏళ్లకు పెంచిన నేపథ్యంలో.. 50 ఏళ్ల వయస్సులో టీచర్ గా పదోన్నతి పొందే హెల్పర్లు.. ఇంకా 15 ఏళ్లు విధులు నిర్వర్తించవచ్చని సూచించారు. 45 సంవత్సరాల వయస్సు దాటిన అర్హులైన హెల్పర్లకు ప్రమోషన్ ఇవ్వడంలో ఎలాంటి ఇబ్బంది లేదని అధికారులు స్పష్టం



చేయడంతో ఫైల్పై మంత్రి సీతక్క సంతకం చేశారు. దీంతో త్వరలో అధికారిక ఉత్తర్వులు వెల్లడి కానున్నాయి. ఈ నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా వేలాది అంగన్వాడీ హెల్పర్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మంత్రి సీతక్కకు కృతజ్ఞతలు తెలిపారు. గతంలో కేవలం వయస్సు కారణంగా తాము టీచర్లుగా ప్రమోషన్ కోల్పోతున్నామని బాధపడిన తమకు సీతక్క న్యాయం చేశారని తెలిపారు. అంగన్వాడీ హెల్పర్లకు తెలంగాణ ప్రభుత్వం గుడ్ న్యూస్ అందింది. అంగన్వాడీ టీచర్లుగా ప్రమోషన్ పొందే హెల్పర్ల గరిష్ట వయసును 45 నుంచి 50 సంవత్సరాలకు పెంచాలని నిర్ణయం తీసుకున్నారు. తాజా నిర్ణయం వల్ల 45 ఏళ్లు దాటిన హెల్పర్లకు ప్రయోజనం చేకూరనుంది.

# అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న ఎంఈఓలోను సస్పెండ్ చేయాలి

### జిల్లా విద్యాశాఖ అధికారి డీఈవో శంషుద్దీన్‌కు వినతి

**కడప బ్యూరో నేటి ప్రభాత సూర్య జూలై 3:**
ప్రొద్దుటూరు మండల విద్యాశాఖ అధికారిణి ఎంఈఓ సావిత్రి, కడప మండల విద్యాశాఖ అధికారి ఎంఈఓ గంగిరెడ్డిలు అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారని విచారణ జరిపి సస్పెండ్ చేయాలని కోరుతూ గురువారం పిడియస్ యు ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖధికారి డీఈఓ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టి అనంతరం జిల్లా విద్యాశాఖ అధికారి డిఇఓ శంషుద్దీన్ కు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా పిడిఎస్ యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.అంకన్న మాట్లాడుతూ ప్రొద్దుటూరు ఎంఈఓ సావిత్రి, కడప ఎంఈఓ గంగిరెడ్డిలు కార్పొరేట్ ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలకు తొత్తుగా మారిపోయారని అందుకే ప్రొద్దుటూరు పట్టణం కడప నగరంలో ప్లే స్కూల్స్ అనుమతి లేకపోయినప్పటికీ అనధికారికంగా అనుమతులు మంజూరు చేస్తూ ప్రతినెల మామూలు తీసుకుంటున్నారని, కొత్తగా కార్పొరేట్,ప్రైవేట్ ప్రాథమిక పాఠశాలల అనుమతి విషయంలో లక్షలాది రూపాయలు తీసుకొని కనీస సౌకర్యాలు లేకుండా యాజమాన్యాల దగ్గర లక్షల రూపాయలు తీసుకొని వాళ్లకు మంజూరు చేశారన్నారు, మరో వైపు ఫీజుల దోపిడీకి గురి చేస్తున్న కార్పొరేట్ ప్రైవేట్ పాఠశాలలు ఏ రోజు కూడా ఆకస్మిక తనిఖీ చేసిన దాఖలు లేవన్నారు. ఏదైనా కార్పొరేట్ ప్రైవేట్ పాఠశాలల విషయంలో ఎంఈఓలకు ఫిర్యాదు చేస్తే వారికి అన్ని సౌకర్యాలు ఉన్నట్లు తెలుపుతున్నారని, ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ కోసం వాళ్లు కృషి




చేయడం లేదని అందుకు నిదర్శనమే ఇటీవల ఉపాధ్యాయుల బదిలీల కౌన్సిలింగ్‌లో లక్షలాది రూపాయలు తీసుకొని నిబంధనలకు విరుద్ధంగా ప్రిఫరెన్షియల్ కేటగిరిలో కేటాయించాల్సిన స్థానాల కంటే అధికంగా కేటాయించడం వల్ల జనరల్ కేటగిరిలో ఉన్న ఉపాధ్యాయులకు తీవ్ర అన్యాయం చేశారని మండిపడ్డారు. పాఠశాల విద్యాశాఖ ఆర్జెడి శామ్యూల్ స్పందించకపోవడం వెనక ఆంతర్యం ఏమిటని వారు ప్రశ్నించారు ఈ అంశాలన్నీ విచారణ జరిపి ప్రొద్దుటూరు, కడప ఎంఈఓ సావిత్రి, గంగిరెడ్డిలను సస్పెండ్ చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పిడియస్ యు జిల్లా నాయకుడు మహేష్,పిడియస్ యు నగర నాయకులు కార్తీక్, యశ్వంత్, జోసెఫ్ ఆకాష్ కుమార్, అబూబకర్ సిద్దిక్ తదితరులు పాల్గొన్నారు.

# నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు కృషి

### నియోజకవర్గాల విజన్ యాక్షన్ ప్లాన్ సమీక్ష
### సమావేశంలో జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి
### ప్రత్యేక అధికారులు ప్రో ఆక్టివ్ గా పనిచేయాలి

**వైయస్సార్ కడప జిల్లా బ్యూరో నేటి ప్రభాత సూర్య జూలై 3 :**
జిల్లా విజన్ యాక్షన్ ప్లాన్‌లో నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్లోని సమావేశ హాలులో స్వర్ణాంధ్ర విజన్– 2047 లో బాగంగా నియోజకవర్గాల విజన్ యాక్షన్ ప్లాన్ పై జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ తో కలిసి జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారులు,మండల అభివృద్ధి అధికారులు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ స్వర్ణాంధ్ర–2047 విజన్ సాకారానికి ప్రజా ప్రతినిధుల సహకారంతో అధికారులు ప్రో యాక్టివ్ గా పని చేయాలన్నారు. పేదరికం లేని సమాజం, ఉద్యోగ కల్పన, నైపుణ్యం–మానవ వనరుల అభివృద్ధి, నీటి భద్రత, వ్యవసాయ సాంకేతికత, అంతర్జాతీయ స్థాయి లాజిస్టిక్స్, ఇంధన వనరుల సమర్థ వినియోగం, నాణ్యమైన ఉత్పత్తులు–బ్రాండింగ్, స్వచ్ఛాంధ్ర, వంటి 10 ప్రధాన సూత్రాలతో స్వర్ణాంధ్ర–2047 విజన్ డాక్యుమెంట్ ప్రణాళిక రూపకల్పనకు నియోజకవర్గ యాక్షన్ ప్లాన్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. ఈ మేరకు ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల అంశాలను సాధించడానికి నియోజకవర్గ ప్రత్యేక అధికారులు శ్రద్ధ చూపాలన్నారు. ప్రభుత్వ లక్ష్యాలు సాధించేందుకు బాధ్యతాయుతంగా పని చేయాలన్నారు. నియోజకవర్గ యూనిట్లు విజన్ యాక్షన్ ప్లాన్ సాధించడానికి కీలకం కానున్నాయన్నారు. ఇప్పటికే జిల్లాలో దాదాపు 78వేల బంగారు కుటుం బాలను గుర్తించామని నియోజకవర్గంలోని మండల వారీగా బంగారు కుటుంబాల మ్యాపింగ్ లక్ష్యాన్ని నిర్దేశించడం జరిగిందన్నారు. అలాగే ప్రతి గ్రామం , మండలాలలో మార్గదర్శులను గుర్తించే చర్యలను వేగవంతం చేయాలన్నారు. జిల్లాలో గుర్తించిన బంగారు కుటుంబాలను మార్గదర్శులు దత్తత తీసుకుని వాళ్ల ఉన్నతికి చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాలలో ప్రధానమైన వృద్ధి ఇంజన్లను గుర్తించడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా రాబోవు ఐదు సంవత్సరాలలో జిల్లాలో హార్టికల్చర్ 17%, మ్యానుఫ్యాక్చరింగ్ 18%, ఎనర్జీ 16%, టూరిజం 18 రియల్ ఎస్టేట్ 18% కమ్యూనికేషన్ 18% అభివృద్ధి సాధించే విధంగా లక్ష్యాలను నిర్దేశించుకోవడం జరిగిందన్నారు. జిల్లా వృద్ధిరేటు 16 శాతంగా నిర్దేశించుకోవడం జరిగిందనీ,అందుకు అనుగుణంగా అన్ని రంగాల్లో మంచి వృద్ధిరేట్లు సాధిస్తే అనుకున్న లక్ష్యాన్ని సాధించగలుగు తామన్నారు నియోజకవర్గ,ఆయా మండలాల విజన్ యాక్షన్ ప్లాన్‌పై స్పెషల్ అధికారులు,మండల అధికారులు పూర్తి అవగాహన కలిగి




పని చేయాలన్నారు. కీలక రంగాలైన వ్యవసాయం, పారిశ్రామిక, సర్వీస్ రంగాలలో నిర్దేశించిన లక్ష్యాలను సాధించడానికి సమస్యలను అధిగమించి ఇచ్చిన లక్ష్యాలను సాధించేందుకు కృత నిశ్చయంతో పనిచేయాలన్నారు. ముఖ్యంగా వ్యవసాయ రంగంలో ప్రధాన పంటలలో వృద్ధి సాధించాలన్నారు అలాగే ప్రత్యామ్నాయ పంటలు సీడ్ ప్రొడక్షన్, ఉత్పాదకత, ఏరియా ఎక్స్టెన్షన్లలో దృష్టి సారించి టార్గెట్లను అచీవ్ చేయాలన్నారు. వరి, పత్తి,వేరుశెనగ పంటల్లో రైతులకు సబ్సిడీ కింద మైక్రో న్యూట్రియన్లు అందించి ఉత్పాదకతను పెంచాలన్నారు. రియల్ ఎస్టేట్ రంగం జిల్లాలో మరో ప్రధాన కి రోల్ ప్లే చేస్తోందని మున్సిపల్ కమిషనర్లు అందరూ అనుమతులను సులభతరం చేసి రియల్ ఎస్టేట్ రంగానికి ఊతం ఇవ్వాలన్నారు. మున్సిపల్ కమిషనర్లు వారంలో రెండు రోజులు రియల్టర్లతో ఓపెన్ ఫోరం సమావేశం నిర్వహించాలన్నారు. లేఔట్స్ బిల్డింగ్ నిర్మాణాల వంటి అనుమతుల్లో జాప్యం తగ్గించి త్వరితగతిన మంజూరు చేస్తే మున్సిపాలిటీలకు అధిక రాబడి వస్తుందని ఆ విధంగా మున్సిపాలిటీలు అభివృద్ధి చెందుతాయన్నారు. అలాగే గ్రామా ల్లో స్వయం సమృద్ధి సాధించడానికి ప్రతి మండలంలో ఒక సోలార్ విలేజ్ అనుకూలతలను పరిశీలించాలన్నారు. జిల్లా ప్రధాన కేంద్రమైన కడప నియోజకవర్గంలో ఇండస్ట్రియల్, కన్స్ట్రక్షన్, మ్యానుఫ్యాక్చరింగ్ వంటి కీలక రంగాలపై ప్రత్యేక దృష్టి సారించి వృద్ధి సాధించాలన్నారు. రాయలసీమలోని కడప నగరం వేగంగా అభివృద్ధి చెందుతోందని అందుకు అనుగుణంగా ఎమర్జింగ్ ఏరియాలను గుర్తించి ఓపెన్ లేఔట్లు ట్రేడింగ్ లలో అనుమతులను సరళతరం చేయాలన్నారు. జిల్లా తలసరి ఆదాయం పెంచడానికి అధికారులు అందరూ కృషి చేయాలని తెలిపారు. ముందుగా వ్యవసాయం, హార్టికల్చర్, మైక్రో ఇరిగేషన్, పశుసంవర్ధక, ఫిషరీస్ వంటి శాఖల్లో జిల్లా అధికారులు యాక్షన్ ప్లాన్ కనుగుణంగా లక్ష్యాల సాధనకు ఏ విధంగా కృషి చేస్తున్నారన్న అంశాలపై జిల్లా కలెక్టర్ రివ్యూ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీవో హాజరతయ్యా, కడప ఆర్డిఓ జాన్ ఇర్విన్, బద్వేలు ఆర్టీవో చంద్రమోహన్, జమ్మలమడుగు ఆర్డిఓ సాయి,కడప మున్సిపల్ కమిషనర్ మనోజ్ రెడ్డి, జిల్లా అధికారులు,ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆదర్శ వృద్ధాశ్రమంలో ఘనంగా గోపిడి అన్నల్ రెడ్డి జన్మదిన వేడుకలు



**చింతపల్లి –నేటి ప్రభాత సూర్య (జూన్) 3**
గురువారం గోపిడి అనిల్ రెడ్డి 42 వ జన్మదిన వేడుకలు చింతపల్లి మండల కేంద్రంలోని ఆదర్శ వృద్ధాశ్రమంలో అంగరంగ వైభవంగా జరిగాయి. ఈసంధర్భముగా వృద్దులకు అన్నదానము, పండ్లు, బ్రెడ్, 25 కిలోల బియ్యం పంచడం జరిగింది. వృద్దులు, సిబ్బంది. ఆశ్రమ నిర్వాహకులు డాక్టర్ ఎస్ ఎస్ చారి, శ్రీమతి ఎస్ భాగ్యలక్ష్మి, గోపిడి అనిల్ రెడ్డి రెడ్డి ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో, ఆనందంగా జీవించాలని ఆశ్వాదించి అభినందించారు.

## 6 గురు పేకాటరాయుళ్ళు అరెస్ట్



**ఇబ్రహీంపట్నం– నేటి ప్రభాత సూర్య, జోన్ ఇంచార్జ్**
గుట్టు చప్పుడు కాకుండా నిర్వహిస్తున్న పేకాట శిభిరం పై దాడులు నిర్వహించిన పోలీసులు అరుగురు పేకాట రాయుళ్లను అరెస్ట్ చేశారు. ఇబ్రహీంపట్నం రాయపోల్ రోడ్ లోని వెంకటేశ్వర వెంచర్‌లోని వైట్ గోల్డ్ సమీపంలో బహిరంగ ప్రదేశంలో ఆరు గురు పేకాట ఆడుతూ పోలీసులకు చిక్కి కటకటాల పాలయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సామ మోహన్ రెడ్డి,టేకుల దిలీప్ రెడ్డి,జొర్రీ గల పవన్ కుమార్, ముత్యాల బిక్షపతి, టేకుల వంశీ రెడ్డి, సామ శ్రీకాంత్ రెడ్డి వీరంతా ఇబ్రహీంపట్నం కు చెందిన వారుగా తెలిపారు. పేకాట ఆడుతుండగా విశ్వసనీయ సమాచారం మేరకు ఇబ్రహీంపట్నం ఎస్సై పి నాగరాజు తన సిబ్బందితో వెళ్లి ఆరుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుండి రూ.35210 నగదు,6 మొబైల్ ఫోన్లు, ఒక సెట్టు ప్లేయింగ్ కార్డ్స్ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి పోలీస్ స్టేషన్ కు తరలించడం జరిగిందని సీఐ మహేందర్ రెడ్డి తెలిపారు.

## సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



**కడప బ్యూరో నేటి ప్రభాత సూర్య జూలై 3:**
నియోజకవర్గంలో సీఎం రిలీఫ్ ఫండ్ నుండి మంజూరైన ₹29,39,205 విలువైన 27 చెక్కులను లబ్ధిదారులకు పొలిట్ బ్యూరో సభ్యులు, కడప జిల్లా టీడీపీ అధ్యక్షులు రెడ్డెప్పగారి శ్రీనివాసరెడ్డి మరియు రాష్ట్ర ప్రభుత్వ విప్, కడప ఎమ్మెల్యే రెడ్డెప్పగారి మాధవి రెడ్డి లు గురువారం అందజేశారు. సమస్యలో ఉన్న కుటుంబాలకు ఆర్థిక భరోసాగా నిలిచేలా సీఎం రిలీఫ్ ఫండ్‌ను ప్రజల కోసం వినియోగిస్తున్న కూటమి ప్రభుత్వం, ప్రజాక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతోందని తెలిపారు.

## మరోసారి మానవత్వం చాటుకున్న మాజీ సర్పంచ్ బూడిద రాంరెడ్డి



**ఇబ్రహీంపట్నం –నేటి ప్రభాత సూర్య,జోన్ ఇన్చార్జి**
ఇబ్రహీంపట్నం మండలం ఉప్పరిగూడ గ్రామానికి చెందిన బుట్టి ప్రేమ్ రాజ్ ఇటీవల మరణించారు. ఆయన దశదినకర్మ బి ఆర్ ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మాజీ సర్పంచ్ బూడిద రామ్ రెడ్డి వారి కుటుంబానికి తన వంతు సాయంగా 25 వేల రూపాయలు రూపాయల నగదు ( 25000)ను గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ బూడిద నరసింహారెడ్డి,మడుపు గోపాల్ రెడ్డి, సురేందర్ రెడ్డి, బోస్ పల్లి చంద్రశేఖర్, అలాగా పల్లి శ్రీరామ్, బూడిద రాంరెడ్డి, నర్కుడి శ్రీనివాస్,బోసుపల్లి హరికృష్ణ, బోసుపల్లి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## హెూంగార్డులకు రెయిన్ కోట్ల పంపిణీ

**మంచిర్యాలజిల్లా నేటి ప్రభాత సూర్య ప్రతినిధి, జూలై 3:**
రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న హెూంగార్డులకు రెయిన్ కోట్ల పంపిణీ చేశారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలో గురువారం జరిగిన కార్యక్రమంలో కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ స్వయంగా హాజరై రెయిన్ కోట్లను హెూంగార్డులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "పోలీస్ వ్యవస్థలో హెూంగార్డులు కీలకమైన భాగస్వాములు. వారు ఎలాంటి వాతావరణంలోనైనా విధులు నిర్వహిస్తారు. వర్షాకాలంలో మరింత జాగ్రత్తగా పనిచేయాల్సిన అవసరం ఉంటుంది. అలాంటి పరిస్థితుల్లో రెయిన్ కోట్లు వారికి ఉపయుక్తంగా ఉంటాయి," అని పేర్కొన్నారు. పోలీసు అధికారులతో పాటు పలువురు హెూంగార్డులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.